ఆంధ్రమహిళ

సంపుటి 2 | మే 1946 | సంచికలు 24, 25

సేవాదీక్షలో మరొక సంవత్సరం

“ఆంధ్రమహిళ” జీవితములో నేటితో రెండు సంవత్సరాలు గడిచినవి. ఈ రెండేళ్లలోను ఆంధ్రమహిళలకు వారి ద్వారా దేశానికి ‘ఆంధ్రమహిళ’ యథాశక్తిని సేవ చేసినది.

“ఆంధ్రమహిళ’ తృతీయ సంవత్సరం ప్రారంభం కానున్న ఈ రెండేళ్లలోను “ఆంధ్ర మహిళ” ప్రజల అఖండాదరణను చూరగొన్నది. ఈ వ్యవధానంలో ఏ మాత్రం స్వల్పమైన సేవను మేము చెయ్యగలిగినప్పటికీ, దానికి ప్రజాదరణమే కారణమని సగర్వంగా చెప్పుకోగలుగుతున్నాము. అయితే ఆంధ్ర సోదర సోదరీమణులు మాపై చూపుతూ వచ్చిన ఈ అవ్యాజాదరాభిమానాలకు మేము తగుదుమా తగమా అని ఒక్కొక్కప్పుడు తలపోయక పోలేదు. కాని మేము పూనుకొన్న కార్యము ఉత్కృష్టమైన దన్న భావమే—అట్టి కార్యము ప్రజాదరణకు భాజనము కాక తీరదన్న ధైర్యమే మా సేవానిరతికి నిరవధికమైన ప్రోత్సాహాన గూర్చినది.

తగినంత కాగితం లేకపోవడమనేది అన్ని పత్రికలకూ ఏర్పడిన చిక్కే. కాని ‘ఆంధ్రమహిళ’కు తోటి పత్రికల కిచ్చినంత కాగితపు కోటా అయినా లభించక పోవడం మరీ విచారకరమైన విషయం. తత్ఫలితంగా నూతన చందాదారులకు ప్రతికలు అందజేయలేక పోవలసివచ్చినది. దీని వల్లనే పరిస్థితి కొంత వరకైనా చక్కబడే వరకు నెలకు ఒక్క సంచికను ప్రకటించడంతోనే మేము సంతుష్టిపడవలసి వచ్చినది కూడా.

భారత జాతీయ సంస్థ కాంగ్రెస్ కల్లోలితమైన-అగమ్యమైన పరిస్థితిలో వున్నతరినే ‘ఆంధ్రమహిళ’ జన్మించినది. అనేక అరిష్టాలను — అవాంతరాలను అధిగమించినది. తృతీయ వర్షపు జీవితాన్ని ఇప్పుడు ప్రారంభిస్తున్నది. రాష్ట్రంలో ప్రజామంత్రి వర్గ నిర్మాణం జరిగిన శుభ సమయంలో ఇది మేళవించడం ముదావహం.

రాష్ట్రీయ ప్రభుత్వానికి సంబంధించినంత వరకు పాత వ్యవస్థ స్థానే నూత్న వ్యవస్థ ఏర్పడినదని చెప్పవచ్చు. ప్రభుత్వంలో నూత్న వ్యవస్థా స్థాపనతో నవోదయమైనట్లే ‘ఆంధ్రమహిళ’ జీవితంలోకూడా తృతీయ వర్షాగమంతో నూత్న దశ ప్రారంభం కాగలదని విశ్వసిస్తున్నాం.

ఆంధ్రమహిళా లోకానికి—దేశానికి యథోచితమైన సేవను చెయ్యగలమని—మా దృఢ సంకల్పాన్ని ఎటువంటి పరిస్థితిలోనైనా వదులుకోనమని మరొక సారి యీ శుభ సమయమున వినయ వినమితులమై మనవి చేస్తున్నాము.

★

ముఖచిత్రం: శ్రీ భాగేశ్వరశర్మ రచన

సంపుటి - 2   సంచిక - 24, 25.
VOLUME   ISSUE.

ఆంధ్ర మాలిక

★

ప్రజా సేవకుడు

ప్రకాశం

ఆంధ్రమహిళ జోహారులు!

★





ప్రకాశంగారు ప్రధాని అయారంటే జనసామాన్యంలో ప్రతి ఒక్కరూ తామే ప్రధాని అయా మనుకున్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలూ సుఖాలు పంతులుగారివి. వీరి సుఖదుఃఖాలు ప్రజలవి. నాయకులు, దేశసేవాధురంధరులు, త్యాగులు చాలామంది వున్నారు. కాని, త్యాగంయొక్క విలువను ఆ త్యాగంవల్ల పొందే కష్టాన్నే కొలబద్దగా పరిగణిస్తే పంతులుగారితో సమానంగా నిలబడగలిగేవారు బహుకొద్దిమంది వుంటారు.

★

మొల్లరామాయణ ప్రశంస

— శ్రీ వాకాటి పెంచలరెడ్డిగారు —

శ్రీ మద్రామాయణమును సంస్కృతములో వాల్మీకి మహర్షి రసవంతముగ వ్రాసియుండ పలువురు తద్రామాయణమును విరచింపఁబూనుట కేవలము హాస్యాస్పదమని పెక్కండ్రు వచించుచుందురు. అట్టివారికి మొల్ల చక్కని సమాధాన మిచ్చినది చూడుఁడు.

"భూజనకల్పకంబగుచు భుక్తికిముక్తికి మూలమైన యా
రాజును దైవమైన రఘురామునుతించినఁ దప్పుగల్గనే"

మీఁదుమిక్కిలి

" కొండం
తటిదేవరకును గొండం
తటిపత్తిరి వెట్టువారు ధరణింగలరే"

అన్నట్లు శక్తి సంపన్నులు సర్వమయుని ఘనముగఁ బూజించెదరు. సామర్థ్య రహితులు వారి శక్త్యానుసారము భగవంతుని భజించెదరు. కావునఁదల్లిభాషలో రామాయణము విరచింపఁబడియున్నను భుక్తికి, ముక్తికి మూలమని విశ్వసించి మొల్ల రామాయణము నాంధ్రంబున రచించెను. తదుపరి గోపీనాధము వేంకటకవిగారు, వావిలికొలను సుబ్బారావుగారు, జనమంచి శేషాద్రిశర్మగారు మున్నగువారు సంస్కృత రామాయణము నాంధ్రీకరించిరి.

మొల్ల సంస్కృతాంధ్రములలో విశేష శేముషీధురంధురాలా? అని విచారించిన కాదని స్పష్టముగ నీ క్రింది పద్యమువలనఁ దెలియుచున్నది.

"దేశియపదములు దెనుఁగులు సాంస్కృతుల్
సంధులు ప్రాజ్ఞుల శబ్దవితతి
శయ్యలు రీతులుఁజాటు ప్రబంధంబు
లాయాసమాసంబు లర్థములును
భావార్థములుఁగావ్య పరిపాకములు రస
భావ చమత్కృతుల్ పలుకుసరవి
బహువర్ణములును విభక్తులు ధాతుల
లంకృతిచ్ఛందో విలక్షణములుఁ
గావ్యసంపద క్రియలు నిఘంటువులును
గ్రమములేవియు నెఱుఁగ విఖ్యాతగోప
వరపు శ్రీకంఠమల్లేశువరముచేత
నెఱుఁ గవిత్వంబుఁజెప్పగా నేర్చికొంటి"

పై పద్యానుసారము, మొల్ల శ్రీకంఠ మల్లేశు వరముచేతఁ గవిత్వము నేర్చుకొన్నట్లు విశదము. కవిత్వము శాస్త్రజ్ఞాన సముపార్జనవలన లభ్యమగునదికాదు. గణయతి ప్రాసలక్షణ జ్ఞానము వలననే కవనమల్లిన నయ్యది నీరసముగనుండును. కావుననే శ్రీ తిరుపతి వేంకట కవులు.

" పురాభవమ్మునన్
జేసిన పుణ్యవశమునఁజేసి కదాలభియించు; గట్టియ
భ్యాసముజేసినన్ గలుగునా? యిదివేదమా?
లేకశాస్త్రమా?"

అని నొక్కి వక్కాణించిరి.

పోతన 'పలికించు విభుండు రామభద్రుండట' అని భాగవతాంధ్రీకరణ సందర్భమున నుడివినట్లు మొల్లయు

"చెప్పుమని రామచంద్రుడు
చెప్పించిన పలుకుమీఁద..."

నని భగవదాజ్ఞానువర్తినియై రామాయణమును లిఖించెనుగాని వైదుష్య ప్రదర్శనమునకు వ్రాయదయ్యె.

కవిత్వము చెప్పుపట్ల మొల్ల యీ క్రింది నియమానుసారియై చాలవఱకు కటులనే గ్రంథ రచన సాగించెను,

"తేనెసోఁక నోరు తీయన యగురీతి
తోడసన్న మెల్లఁ దోఁచకుండ
గూఢశబ్దములను గూర్చినకావ్యమ్ము
మూఁగచెవిటివారి ముచ్చటగును."

మొల్లరామాయణములోని పద్యములన్నియు 845. ఏతద్రామాయణములోని రసవత్తర ఘట్టముల వివరింపఁబూనిన వ్యాసము విపులమగును. కాన నెల్లరు దానిని బఠించి యానందింతురని కోరుచున్నాను. సాహిత్యసేవయే విజ్ఞానమునకు జీవకఱ్ఱ. మహాపురుషుల యనుభవములే గ్రంథములు. కావున విజ్ఞానదాయక గ్రంథరాజంబుల బఠించి, రాఁబోవు సంతతికి మీా యనుభవముల నొసంగుదురని విశ్వసించుచున్నాను, ఎన్ని లాభంబులు మనకుఁ జేకూరినను, నయ్యవి జ్ఞాన లాభముతో సాటిగావు. పరలోకమునకు సయితము వచ్చునది మనము గడించునట్టి జ్ఞానమే. అట్టి జ్ఞాన సముపార్జనమునకుం గడంగుదురని నమ్మి శ్రీ తుమ్మల సీతారామ చౌదరిగారు "కుమ్మరి మొల్ల" అను శీర్షిక క్రింద వ్రాసిన పద్యములలో నొక్క పద్యము నుదహరించి వ్యాసమును ముగించుచున్నాను.

"కుమ్మరిపిల్లనంట పలుకుంజవరాలికి నీకు బాంధవం
బెమ్మెయినన్న? నీకుఁజదువెవ్వఁడు చెప్పె? నుదారతానిధా
నమ్మగునమ్మహాపురుషునామము చెప్పెదవేని హృద్య ప
ద్యమ్ములొసంగివాని శతధా నుతిసల్పుదునమ్మ సోదరీ ?"

★



శ్రీమతి సామ్రాజ్యం శ్రీ రమణరావు.



కస్తూర్బా గ్రామ సేవికల శిక్షణ

సీతానగరంలోను బొబ్బిలిలోను శిక్షణ కేంద్రాలు

ఆంధ్ర మహిళలకు విజ్ఞప్తి

కస్తూర్బాగాంధీ జాతీయ స్మారకట్రస్టు సీతానగరం ఆశ్రమంలో 40 మంది స్త్రీలకు గ్రామ సేవికా ప్రాథమిక శిక్షణ యిచ్చుటకై స్కీమును అంగీకరించిరి. ఆ శిబిరము జూన్ మొదటి వారంలో ప్రారంభమై మూడు మాసముల పాటు జరుగును. ప్రాథమిక శిక్షణ పూర్తి అయిన పిమ్మట పదిమంది స్త్రీలు బొబ్బిలిలో మంత్రసానులుగా తర్ఫీదగుటకై పంపబడుదురు. తతిమ్మా వారు సీతానగరంలోనే (Basic education teachers) క్రియాత్మక విద్యాలయ అధ్యాపకులుగా శిక్షణ పొందెదరు. ట్రస్టు యాజమాన్యమున నిర్వహింపబడే ఆస్పత్రులు, విద్యాలయములలో పై శిక్షణలను పొందిన దేశ సేవికలు మంత్రసానులుగాను ఉపాధ్యాయినులు గాను నియమింపబడుదురు.

ఈ శిబిరములను విజయవంతముగా నడిపించుటలో మీరు ట్రస్టుకు సహాయపడెదరని విశ్వసించుచున్నాను. ఆంధ్ర కమిటీవారు పంపిన ఈ స్కీమును ట్రస్టువారు అంగీకరించుటే గాక, గాంధీజీ సలహాపై సీతానగరం ఆశ్రమములోని వసతి గృహములను ఈ శిబిరము నడుపుటకై ట్రస్టుకు యిచ్చిరి. ఈ శిబిరము నిర్వహించుటకై ఎనమండుగురు ఆంధ్ర సోదరీమణులు సేవా గ్రామములో తర్ఫీదు పొందియున్నారు. శ్రీ బొబ్బిలిరాజావారు కస్తూర్బానిధికి రూ.25,000లు విరాళమిచ్చుటే గాక వారి సంస్థానం హాస్పటల్లో మిడ్ వైఫరీ ట్రైనింగు ఏర్పాటు చేయుటకు సమ్మతించి, వారి ఖర్చులపైననే విద్యార్థినుల కొరకు ఒక వసతి గృహముకూడ నిర్మించుచున్నారు. ఆ హాస్పిటల్ సూపరెంటెంటుగా వున్న శ్రీమతి డాక్టరు లక్ష్మీకాంతం గారు శిక్షణ యిచ్చుటకు అంగీకరించిరి. ఈ సదవకాశములను వినియోగించుకొని ఈ శిబిరములను జయప్రదముగా జరిపింపవలసిన బాధ్యత మన ఆంధ్ర సోదరీమణులపై యున్నది.

దేశ సేవికా శిక్షణలను పొందగోరు స్త్రీలు వివరములకు నాకు వ్రాసి తెలుసుకొన వచ్చును.

ఆంధ్ర మహిళా సభ, మైలాపూరు — దుర్గా బాయి, ఏజెంటు

శ్రీమతి అమ్మన్నరాజా

(8c పేజీ తరువాయి)

కొంతకాలం మద్రాసులోని కన్యకాపరమేశ్వరి బాలికా పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా వుండటంవల్ల ఆ శాఖలోని ఇబ్బందులు వీరికి బాగా తెలుసు.

శ్రీమతి అమ్మన్నరాజాగారు మద్రాసు క్వీన్ మేరీసు కాలేజీలో చదివి 1932లో బి. య్యే పేసయ్యారు. మరుచటి సంవత్సరం ఎల్. టి. పరిక్షలో ఉత్తీర్ణురాలైనారు. కాంగ్రెస్ ఉద్యమాలలో పాల్గొని, జైలుకు వెళ్లారు. స్త్రీల పురోభివృద్ధికి శాయ శక్తుల పాటుబడుతూ, ప్రత్యేకంగా స్త్రీ విద్య పట్ల శ్రద్ధ వహించారు.

1937 సం॥రంలోను మొన్నటి ఎన్నికలలోను ఏలూరునుండి స్త్రీల నియోజక వర్గం వీరిని మద్రాసు శాసన సభకు ఎన్నుకొన్నారు. ఈ సారి శాసన సభలో ఒక్క స్త్రీల ప్రత్యేక నియోజకవర్గానికే గాక, సాధారణ నియోజక వర్గానికి కూడా స్త్రీలను ఎన్నుకోటం తమకు ఆనందకరమైన విషయమని తెలియజేశారు.

"స్త్రీలకు రాజకీయాల్లోనూ, పరిపాలనా పద్ధతులలోనూ ఇంకా ఎక్కువ ప్రాతినిధ్యం వుండాలి. దాని వల్ల రేపు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం జరిగి నప్పుడు రాష్ట్ర పరిపాలనకు వీరెంతో తోడ్పడటానికి సావకాశం వుంటుంది." అన్నారు.

విద్య నేర్పటంలో నూతన విధానాలు రావాలని రేడియో, సినిమా మొదలైన వాటి సహాయంతో నిరక్షరాస్యత నిర్మూలనం చెయ్యాలని శ్రీమతి అమ్మన్నరాజాగారి ఆదేశం.

శ్రీమతి కుట్టిమాలు అమ్మ

(8c పేజీ తరువాయి)

1937 ఎన్నికలలో మలబారు స్త్రీలు, ఈమెను శాసన సభ సభ్యురాలిగా ఎన్నుకొన్నారు. మహాత్ముడు 1940 ఉద్యమంలో పాల్గొను వారిలో ఈమెను ముందుగా నియమించాడు. తిరిగి 1942 నుండి 44 వరకు జైలులో వుంది.

ఖద్దరు ఉత్పత్తి, హిందీ ప్రచారం, స్త్రీల విద్యా మొదలైన సంస్థలలో ఈమె నిరంతరము ముఖ్యస్థానాన్ని అలంకరించింది. జాతీయ పునర్నిర్మాణ సంఘపు ఉపసంఘ సభ్యురాలు. అనేక సంవత్సరాలుగా,బీదగృహాల సంఘాధ్యక్షురాలు. కస్తూరిబా సంస్థకు కేరళంలో ఈమెను ఏజంటుగా వుండవలసిందని, మహాత్ముడు కోరాడు. కాని, శాసన సభ సభ్యురాలుగా ఎన్నుకోబడిన కారణాన, ఆ పదవి స్వీకరింప జాలకపోయింది. ఐనప్పటికీ, దానికి సంబంధించిన కార్యకలాపములు చూస్తోనేవున్నది.

కేరళ స్త్రీలలో మొదటిదిగా గణింపవలసిన దేశసేవకురాలు, కుట్టిమాలు అమ్మ.

తీరిక:

తొడత్రొక్కుడు తొందరతో ఈ బ్రతుకేం పండగ,
చూస్తో నిలబడ్డానికి తీరిక లేకుండగ ?
ప్రాలుమాలి చెట్లనీడ పచ్చరంపలె దీర్ఘంగా
పరికిస్తూ నిలబడగా తీరిక లేనప్పుడు—
తోటల్లోపడిపోతూ దోరదోర చిలక్కొట్లు
ఏరి తీసికోడానికి తీరిక లేనప్పుడు—
పట్టపగటి తారకలై పరువెత్తే సెలయేళ్లను
పనికట్టుక చూడ్డానికి తీరిక లేనప్పుడు—
చూస్తో నిలబడ్డానికి తీరిక లేకుండగ—
తొడత్రొక్కుడు తొందరతో ఈ బ్రతుకు పట్టిదండగ !

—తిరుగుబోతు

అమాత్యపదవి నలంకరించిన ఆంధ్ర మహిళ



అచంట రుక్మిణమ్మ

"నన్ను మంత్రిణిగా చెయ్యటం నాకు కాదు గౌరవం మహిళా లోకానికి ; నేను వారి సేవకురాలిని మాత్రమే. అదే నా వాంఛ, అదే నా ఆశయం" అన్నారు శ్రీమతి రుక్మిణిలక్ష్మీపతి, ఆంధ్ర మహిళ ప్రత్యేక విలేఖరి ఆంధ్ర మహిళ తరఫున వారిని అభినందించిన సందర్భంలో.


అనేక మంది స్త్రీలు విద్య అంటే ఏమిటో ఎరుగని కాలంలో ఉన్నత విద్య నభ్యసించి స్త్రీల గౌరవాన్ని పెంపొందించిన ఆదర్శనారి ఈమె సంఘంలో భారతనారీమణులకు ఉన్నత స్థానాన్ని చేకూర్చ వలెనని ఇప్పటికి పాతికేళ్ల నుండి పాటుబడుతున్నారు. స్త్రీ ఉద్యమాలు ప్రారంభ దశలోనున్న కాలంలో, 1926 సం॥లో పేరిస్‌నగరంలోని అంతర్జాతీయ మహిళా సమావేశానికి భారతదేశపు అభ్యర్థినిగా వెళ్లి దేశ గౌరవాన్ని పెంపొందించారు.

ఆ నాటి నుండి స్త్రీ ఉద్యమా లన్నిటిలోను ముఖ్యస్థానాన్ని వహించిన నారీమణి. మద్రాసులో నివసించుట చేత ఆంధ్రులలోనే కాక తమిళులలోకూడా చాలపలుకుబడి సంపాదించారు. తమిళరాష్ట్ర కాంగ్రెసు సంఘమునకు ఉపాధ్యక్షురాలు. తమిళ జిల్లా లన్నింటిలోను అనేక సార్లు పర్యటన చేసి స్త్రీ విద్య కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమము మున్నగు విషయాలలో తీవ్ర ప్రచారంసాగించారు.

చాల సంవత్సరాలు మద్రాసు కార్పరేషన్ సభ్యురాలు. 1937 ఎన్నికలలో మద్రాసులోని స్త్రీల తరపున శాసన సభా సభ్యురాలుగా విజయంపొంది, డిప్యూటీస్పీకరుగా ఎన్నుకోబడ్డారు. మరుచటి సంవత్సరం, సిలోన్, చైనా, జపాన్ మున్నగు ప్రాచ్యదేశాలలోని విద్యా విధానాన్ని గమనించటానికి ఆయా దేశాలలోని విద్యా సంస్థలను సందర్శించారు. 1942 కాంగ్రెసు ఉద్యమంలో పాల్గొన్నందున కారాగారమునందు బంధింప బడ్డారు. మొన్నటి ఎలక్షనులలో తిరిగి శాసన సభ సభ్యురాలుగా ఎన్నుకోబడినారు. 55 సం॥రాలు వయస్సు అయినా, ఇంకా ప్రజోద్యమాలన్నిటిలోను ముఖ్యస్థానాన్ని అలంకరిస్తూ దేశసేవ చేస్తున్నారు.

★ ప్రజా సేవయే ప్రజా పాలన ★

ప్రజా ప్రాతినిధ్యం వహించిన దేశసేవికలు



శ్రీమతి అమ్మన్నరాజా



శ్రీమతి కుట్టిమాలు అమ్మ

"ఉపాధ్యాయుల జీతాలు, అందులో ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలలో పని చేస్తున్నవారివి చాలా శోచనీయంగా ఉన్నాయి" అన్నారు శ్రీమతి అమ్మన్నరాజాగార్ని మా విలేఖరి సందర్శించినప్పుడు.

విద్యా విషయాలలో వీరికి ప్రత్యేక శ్రద్ధ వున్నదని వేరే చెప్ప నక్కర్లేదు. "దేశాభివృద్ధికి అత్యంత అవసరమైన విద్యను నేర్పేవారికి తమ నిత్యజీవితమే ఒక పెద్ద సమస్య అయితే, ప్రశాంతంగా, మనసు పెట్టి, ఇతరులకు విద్య నేర్పటానికి సావకాశ మెక్కడ? నూతన విద్యా విధానాలను ఆచరణలో పెట్టటానికి ముందు ఉపాధ్యాయుల కష్టనిష్ఠూరాలను తొలగించటానికి ప్రభుత్వం పాటుపడాలి" అన్న అభిప్రాయాన్ని వెల్లడి చేశారు.

(తరువాయి 8 వ పేజీలో)

కేరళప్రాంతంలో కుట్టిమాలు అమ్మకుగల ప్రసుష్టం మరే స్త్రీకి లేదంటే అతిశయోక్తి కాదు. దీనికి ముఖ్య కారణం ఆమె చేసిన దేశసేవే. మహాత్ముని శంఖారావం విన్న వెంటనే 1931 లో కాంగ్రెసోద్యమంలో చేరి, రెండు మాసాలుకూడా నిండని పసికూనతో సహా జైలుకి వెళ్లింది. ఆ పాపతోపాటు, రెండు సంవత్సరాలు ఖైదులో వుంది.

కుట్టిమాలమ్మ కేరళకాంగ్రెసమితికి 1944లో అధ్యక్షురాలైంది. ఏ స్కూలులోనూ చదువుకోక పోయినా, స్వశక్తి చేత, విద్య నభ్యసించి, అన్ని వుద్యమాలను, సక్రమంగా నడపగల శక్తి సామర్థ్యాలు సంపాదించింది. మహాత్ముని నిర్మాణ కార్యక్రమం, కేరళ దేశంలోని అన్ని భాగాలలోను ఆచరణలో పెట్టిన దీమె.

(తరువాయి 8 వ పేజీలో)

★ బాధ్యతలు నిర్వర్తించుటే హక్కులు కాపాడుకొనుట ★

అక్క - తమ్ముడు

[కథానిక]

శ్రీ జొన్నలగడ్డ వేంకట రాధాకృష్ణయ్య

తెల్లవారితే ఉగాది. తమ్ముడు భోజనానికివస్తే బాగుండును. తోడపుట్టినవాడు-పదిహేడేళ్లైనా నిండలేదు, తన ఇంట్లోవుండి ఇన్ని మెతుకులు తింటూ, చదువుకోడానికి నోచుకోలేదు. ఎక్కడో కాలేజీలో చదువు—ఎవరి ఇంట్లోనో బస—హోటల్లో భోజనం—తనకూడా పట్నంలో వుండబట్టే ఆ బాధ. తనెక్కడోవుంటే ఈ వెత ఎందుకుంటుందీ?

ఎన్నాళ్లయిందో చూచి! ఆ హోటలు మెతుకులు అరుగుతున్నాయో లేదో! ఒక్కడూ ఎలా ఇదవుతున్నాడో—

తనభర్తకు తనమీద ఆపేక్ష అనంతం. అయితేనేం ఈ విషయంలో ఆయన అనకుండా తానై ప్రసక్తి తెస్తే ఆయన ఏమన్నా అనుకోవచ్చు.

ఇంతకీ తన వెర్రిగాని, ఇష్టముంటే, తన తమ్ముడు పట్నంలోనేవుండి చదువుకుంటున్నాడని ఆయనకు తెలియదూ? తెలిసే ఊరుకొన్నపుడు తను అడిగి వద్దు అనిపించుకోవటమా—ఛీ—"



"ఆ వెయ్యేళ్ల పూజారి నాకెక్కడ కనిపిస్తాడు"



"మరేం తమ్ముణ్ణి పిలవండి"

వంటింట్లో కూరలు తరుగుతూ శ్యామల యీ విధంగా తలచుకొంటున్న సమయంలోనే 'శ్యామా' అని ఆయన కేకవేశాడు.

"ఇదిగో, మా స్నేహితుడు సుబ్బారావు వచ్చాడు కాకినాడనుంచి. రేపు భోజనానికి రమ్మని పిలిచాను. మరి ఎలాచేస్తావో వంటు. బీరిగాణ్ణి మార్కెట్‌కు పంపి బంగాళా దుంపలు, కాలీఫ్లవర్, కారట్ మొదలైనవి తెప్పించు. డబ్బు అలమారలో వుంది."

ఇలా అంటూ మేడ మెట్లు దిగుతూంటే శ్యామల తెగించి 'మరేం' అంది.

'మరేం—ఏమిటి కానీ?' అన్నాడు శేషారావు.

"మా తమ్ముడు సుందరాన్ని కూడా పిలవండి. షికారు నుంచి వచ్చేటప్పుడు వాడి గదిదగ్గరకు వెళ్ళి రమ్మంటే వాడే వస్తాడు. తలకు నీళ్లయినా లేకుండా ఎక్కడో అవస్థ పడుతూ......"

"ఊహూ! ఇప్పుడు ఆ వెయ్యిళ్ళ పూజారి నా కెక్కడ కనిపిస్తాడు, ఉట్టినే శ్రమ పడటంగాని. నేను షికారు వెళ్ళేది బీచికిగాని కిల్పాకా? అబ్బే. నాకు అక్కడకు వెళ్లాలంటే కనీసం రెండుమూడు గంటల పనిపాడు" అన్నాడు శేషారావు.

స్నేహితుడు వస్తాడని చెప్పినపుడు ఆతని ముఖంలో కనిపించిన సంతోషం తన తమ్ముడు పేరెత్తేసరికి మాయమై, ముడుచుకుపోవడాన్ని చిన్నదైనా శ్యామల కనిపెట్టక పోలేదు.

"పిలుపుంటేనే-లేకపోతే వద్దు" అని శ్యామల వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రాత్రి తొమ్మిదింటికి శేషారావు తిరిగివచ్చాడు. కాని అతడు సుందరాన్ని కలుసుకున్నాననిగాని, లేదనిగాని శ్యామలతో చెప్పనూ లేదు, శ్యామల అడగనూలేదు.

* * *

ఆవేళ ఉగాది. భర్తకు తలంటి నీళ్లుపోసి, తనుపోసుకొని శ్యామల వంటలో మునిగింది. స్నేహితునికోసం వెళ్ళిన శేషారావు 11½ గంటలకు తిరిగివచ్చి "సుబ్బారావు భోజనానికి రావడంలేదు. వాళ్ల బంధువులు అతణ్ణి రానివ్వలేదు" అన్నాడు.

శ్యామల ఏమీ బదులు చెప్పలేదు. ఏమవాలోకూడా తోచలేదు. ఇంతలో వీధిలో సైకిల్ బెల్ మ్రోగింది. మరుక్షణంలో సైకిల్ గోడకు చేరవేసి, సుందరం చరచర లోపలికి వచ్చాడు.

శేషారావు అతణ్ణిచూసి, పలకరించకుండానే పైకి వెళ్లిపోయాడు.

'ఏమిరా ఇలా వచ్చావు'? అంది శ్యామల.

'పండుగకాదే అక్కా భోజనానికి వచ్చా' నంటూ తిన్నగా మేడమీదికి వెళ్లాడు సుందరం.

ఇద్దరకు వడ్డించి, శ్యామల పిలిచింది. ఇద్దరూ వచ్చారు. భోజనం చేశారు. సుందరం అడక్కపోయినా ఏవో కాలేజీ కబుర్లు చెప్పుకువచ్చాడు.

భోజనం పూర్తికాగానే, తమలపాకులు చేత్తో పట్టుకుని శేషారావు మేడమీదికి చక్కా పోయాడు.

అక్కడే కూర్చొన్న సుందరాన్ని చూసి శ్యామల 'నిన్న మీ బావకోసం వచ్చారా ఏమిటి?' అని ప్రశ్నించింది.

'లేదు అక్కా. నా మట్టుకు నేనే వచ్చా.'

'పిలవని పేరంటానికి ఎవరైనా వస్తారా? తప్పు కాదూ?' అంది.

'అక్క తమ్ముణ్ణి బొట్టెట్టి పిలవడం ఎందుకమ్మా.' అన్నాడు సుందరం నవ్వుతూనే.

'నవ్వుతావెందుకు? సిగ్గులేకుండా, పిలవందే భోజనానికెలా వచ్చావురా?' అన్నదామె.

ఆమె ఊరికే అనటం లేదని తీవ్రంగానే అంటున్నదని గ్రహించి సుందరం రిచ్చపడ్డాడు.

ఇక కూర్చోలేదు. లేచాడు.

'తప్పే అక్కా. క్షమించు. మరెప్పుడూ రానులే' అంటూ వీధిలోకి వెళ్లిపోయాడు.

ఆమె రెండడుగులు ముందుకువేసింది. సైకిల్ ఎక్కి అతడు వెళ్లిపోవడం ఆమెకు కనిపించింది.

ఆమె కళ్లనుంచి అశ్రువులు కాలవకట్టేయి. తనుకూడా అన్నం వడ్డించుకుందామని పీటమీద కూర్చుని, అలా ఎంతోసేపు ఏడ్చి, ఆమె ఆ ప్రక్కనే కొంగుపరుచుకొని నిద్రపోయింది.

ఆరాత్రి భోజనంచేస్తూ శేషారావు 'మీ తమ్ముడు మళ్లీ కనిపించకుండా అలానే చక్కాపోయాడేమే?' అన్నాడు.

ఆమె ఏమీ అనలేదు.

'మీవాడు వచ్చాడు కనక చేసినది వృథాకాలేదు. సుబ్బారావు రానందుకు మీవాడుకూడా రాకపోయివుంటే ఏ దాసి మనిషికో పారవెయ్యవలసి వుండేది ఆ చేసిందంతా' అన్నాడు.

అలా అని శేషారావు ఆమె వంకచూశాడు. శ్యామల ముఖ వైఖరిచూసి నాలిక కరుచుకొని అతడు తిరిగి ఏమీ అనకుండానే భోజనం పూర్తిచేసి చక్కాపోయాడు.

* * *

కాలచక్రంలో ఆరుమాసాలు గిర్రున తిరిగాయి. ఒక నాటి రాత్రి శ్యామలనుచూసి శేషారావు ఇలా అడిగాడు.

"ఏమోయ్! మీ తమ్ముడి పెళ్లి మాట ఏమీ ఆలోచించరా ఏమిటి మీవాళ్లు?"

"ఏమో నాకేం తెలుస్తుంది వాడి పెళ్లిమాట. అయినా ఇప్పుడు వాడి పెళ్లికేం తొందరొచ్చింది?"

"తొందరేమిటి? పదిహేడు, పద్ధెనిమిదేళ్ల వయస్సు వాడు—పెళ్లాం కాపరానికివస్తే ఈ పరికి ముగ్గురు బిడ్డల తండ్రై వుండేవాడు. మనకు కావలసిన సంబంధం ఒకటి వచ్చిందిలే, కట్నం కానుకలు బాగా ముట్టచెబుతారు." అన్నాడు.

ఆమె ఏమీ జవాబివ్వలేదు.

"మన సుబ్బారావు లేడూ—ఆవాడు ఉగాదికి భోజనానికి వస్తాడన్నానే—వాళ్ల అక్క త్రిప్లికేన్‌లోనే కాదు కాపరం వుంటూ. వాళ్ల అమ్మాయివుంది. బాగా ఎదిగి కూచుంది. ఆ కుర్రదాని నిచ్చి పెళ్లి చేయిద్దామని."

"చాలు చాలు. నిన్న వచ్చిందావిడ ఇక్కడికి. ఎందుకు కర్రి పొద్దులా ఆపిల్ల. కాకి అయినా నయమే. చదువులేదు. చట్టుబండలు లేదు. మావాడు అసలేమూకరాల మూరప్ప. చుంచులా మూతీదాన్ని చూస్తే, చూపించినవాళ్లకి కూడా మాట దక్కకుండా చేస్తాడు."

"నల్లగావున్న వాళ్లుమాత్రం అందంగా వుండరూ. నువ్వేం మహా పచ్చ దబ్బపండులా వున్నావో? నల్లని ఛాయ అయితేం, ఎంత లక్షణంగా వుంటుంది ఆ పిల్ల"? అన్నాడు శేషారావు.

"చాల్లెండి. ఆ కోతిపిల్లని మా తమ్ముడు చేసుకోడు" అంది శ్యామల.

"నీ మొహం. నీకేం తెలుసే మంచీచెడ్డా. నాలుగువేల రూపాయలిస్తారు కట్నం. కావాలంటే మీవాణ్ణి లండన్ పంపి చదివిస్తారు కూడాను. మీనాన్నకి నేను అప్పుడే వుత్తరం రాయడంకూడా జరిగింది." అన్నాడతడు.

"అయితే ఇక నాతో ఎందుకు ఈ సోదంతాను?"

"ఆడబడుచు లాంఛనాలడుగుతావేమో అని."

శ్యామల మూతి విరిచింది.

* * *

ఆ మరునాటి సాయంకాలం ఆఫీసునుంచి శేషారావు ఇంటికి ఆలస్యంగా వచ్చాడు.

రాగానే "మీ తమ్ముడు చాలా గొప్పవాడు. ఊళ్లో మనం వున్నాం గదా మనకి ఫోన్ చెయ్యకూడదా. ఓ కార్డురాసి పడెయ్యకూడదా? పోనీ ఎవరిచేతన్నా కబురంపవచ్చునే" అన్నాడు.

"అసలు ఏం జరిగిందో చెప్పక, ఈ సాదింపంతా ఎందుకు? ఏమైనాడు? కులాసాగా వున్నాడా?" అంది శ్యామల ఆత్రంతో.

"కులాసాగానే వున్నాడులే. 10 రోజుల క్రిందట జ్వరం వచ్చిందట. ఆస్పత్రిలో వున్నాడు. రేపు డిశ్చార్జి చేస్తారట." అంటూ మేడమీదికి వెళ్లాడు.

శ్యామల మనస్సులోనుంచి దుఃఖం సముద్ర తరంగాల్లా పొంగి పొరలివచ్చింది. "ఆనాడు తను అలా అనడం వాడికి కష్టం తోచింది కాబోలు. జబ్బుచేసి ఆసుపత్రిలో పడేసినా కబురుచేశాడు కాదు. ఎంత పాపిష్టిదాన్ని? అనరాని మాటలన్నాను కదా వాణ్ణి ఆవేళ" అనుకొని ఏడ్చింది.

భర్త రాగానే అతను చూడకుండా కళ్ల నీరు తుడిచి వేసుకోడానికి యత్నించింది గాని ఆమె ముఖమండలాన్ని ఆక్రమించిన విషాదమేఘాల నతడు గమనించక పోలేదు.

మరునాడు ఆదివారం.

వంట పూర్తిచేసి శ్యామల వీధి గుమ్మంలోకి వచ్చేసరికి భర్త, తమ్ముడు ప్రత్యక్షమయ్యారు.

రావోయి సుందరం అంటూనే శేషారావు అతణ్ణి మేడ మీదకు తీసుకు వెళ్లాడు.

"తోటిపిల్లనిముద్దెట్టడానికి ఈ ఎత్తు. ఏమైనా సరే ఈ యత్నం నెరవేరనీయకూడదు. వాడెమ్మ—రా అని పిలిచేటప్పటికి ఉబ్బిపోయినట్లున్నాడు." అనుకుంది ఆమె.

ఆ రాత్రి తమ్ముడితో ఒక్క నిమిషం మాట్లాడడానికి వీలిచ్చిందికాదు. భర్త రోజూ లేచేసరికి ఉదయం ఎనిమిదవుతుంది. తెల్లవారగానే తమ్ముడితో మాట్లాడుదామనుకుంది శ్యామల కాని అదేం విరుద్ధమో, తనకంటెముందుగా భర్త నిద్రనుంచి మేల్కొన్నాడు.

11 గంటలకు భోజనాలైనాక భర్త మేడమీదికి వెళ్లగానే కంటితోనే 'ఇలా రా' అని శ్యామల తమ్ముడికి సంజ్ఞ చేసింది.

అతడు రాగానే కోపం (ఎవరిమీదో—?) ఆపుకోలేక "నీకు దేముడు అభిమానం సిగ్గు పెట్టలేదా? ఆయన రమ్మనే సరికి ఉబ్బిపోయి చక్కా వచ్చావా? ఛీ! ఎందుకు వచ్చిన జన్మరా. పౌరుషంలేని జన్మ?" అంది.

సుందరం నిశ్చేష్టుడైనాడు. నోటమాట రాలేదు.

"తప్పైనమ్మా, బుద్ధిలేకే వచ్చాను. ఇదిగో వెళుతున్నా. ఈ వీధిలో ఎప్పుడేనా కనిపిస్తే చెప్పతీసికొట్టు" అంటూ దిక్కుముఖంతో వీధిలోకి వెళ్లి ఓ రిక్షావాణ్ణి పిలిచాడు.

సుందరంతో అసలు విషయం కదలేద్దామనుకుంటున్న శేషారావు అతడు ఇంకా పైకి రాలేదని మెట్లదగ్గరకువచ్చి "సుందరం?" అని కేకవేశాడు.

బదులు రాలేదు. క్రిందకు దిగాడు.


సుందరం రిక్షాలో కూర్చుని చక్కాపోవడం, వంటింట్లో శ్యామల వెక్కి వెక్కి ఏడుస్తూ వుండటంచూచి శేషారావు నిలువునా నీరైపోయాడు!

★

రాఘవ అస్తమయం

శ్రీ రాఘవగారి మృతి ఆంధ్ర నాటకరంగానికి, దేశానికి తీరని లోటు కలిగించింది. ఆయన నిరుపమానమైన నటుడు. నాట్యకళకు ఉపదేష్ట, కళాజీవి.

ఆయన మరణంతో కళా ప్రపంచాన్నుంచి ఒక దివ్యజ్యోతి విలుప్తమై పోయింది. కళాజీవులైన నటీనటుల ప్రోత్సాహశక్తి అంతరించింది.



ఆనేకులకు ఆయన నటుడని మాత్రమే తెలుసు. ఆయనలోని విప్లవోత్సాహ శక్తులను గుర్తించినవారు బహు కొలదిమంది. రాఘవ నాట్య, చలనచిత్ర రంగాలలో క్రొంగ్రొత్త పంథాలను ప్రవేశపెట్టి, వాటిలో విప్లవాత్మకమైన మార్పులను తెచ్చినమాట సువిదితం.

అయితే ఆయన దైనందిన జీవితంలోకూడా అదేవిధమైన విప్లవాత్మక స్వభావంతో మెలగేవాడు.

నాటక, చలనచిత్ర రంగాలలో ఆయన తెచ్చిపెట్టిన విప్లవానికి ప్రజలు ప్రశంసా కుసుమాలతో పూజించి, తమ నాయకుడుగా, ఉపదేష్టగా ఆరాధించారేగాని, సామాజిక వ్యవస్థలో ఆయన అనుసరింపజూచిన విప్లవాత్మక విధానాన్ని మాత్రం గుర్తించినట్లు లేదు.

రాఘవ అట్టి సంఘాన్ని ఎదిరించాడు. ధైర్యంతో పోరాడాడు. ఆయనలోని లక్షణాలు అసామాన్యమైనవి.

నటుడుగా ఆయన అంతర్జాతీయ విఖ్యాతి నార్జించాడు. హిరణ్యకశిపుని భూమికలో గురుదేవుడు రవీంద్రుని మన్నన లందుకొన్నాడు. రామరాజు నాటకంలో పఠాన్ రుస్తుం పాత్ర, రామదాసు భూమికలు ఆయన ధరించగా చూచినవారు ఎన్నడు ఆ నాట్యకళా కౌశలాన్ని విస్మరించలేరు.

నాటక కళోపాసకులగు స్థానం నరసింహారావు, డి. వి. సుబ్బారావు మొదలైనవారు పూనుకొని నాట్యకళాప్రపూర్ణుని స్మారక చిహ్నంగా ఒక ఆదర్శ నాట్య కళాశాలను స్థాపించడం అవసరం. అప్పుడే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుంది; రాఘవ సేవకు ఆంధ్రులు కృతజ్ఞతను వెల్లడించుకొగలుగుతారు.

రాఘవచిత్రము
చిరంజీవి దేవులపల్లి
సుబ్బరాయ శాస్త్రి (బుజ్జాయి)
గీసిన 'పెన్సిల్' హాల్

కళావేత్త బళ్లారి రాఘవ

సుమారు 15 సం॥ రాల క్రితం, ఒకసారి కాకినాడలో ఒక పెద్ద సంచలనం కలిగింది. ప్రతివారి యింటికి ఒకరో యిద్దరో చుట్టాలు వచ్చారు, చోల్లంగి అమావాశ్యకు వచ్చినట్లు. పెద్ద వాళ్లని అడిగాను "వాళ్లెందుకు వచ్చారని" "క్రొత్త నాటకాలొచ్చాయట చూట్టానికి వచ్చారు" అన్నారు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది నాటకాలు చూట్టానికి, 50, 60 మైళ్ళనుంచి పనికట్టుకు రావటమా అని. బళ్లారి రాఘవాచార్యులుగారు వారి నాట్యమండలితో నాలుగైదు నాటకాలు వరుసగా ప్రదర్శించారు. నేను కూడా కొన్నింటికి వెళ్ళటం తటస్థించింది. ముఖ్యంగా ఎన్నటికి మరువలేనిది, ప్రహ్లాద నాటిక. ఇదివరలో చూచిన ప్రహ్లాద నాటకాల్లో హిరణ్యకశిపుడు, కోపోద్రేకుడై కనీసం ఒక గేస్ లైట్ నైనా పగులకొట్టటం చూచి పనివాళ్లమైన మేమంతా భయపడటం అలవాటు. కాని ఈసారి హిరణ్యకశిపుడు అటువంటి పనులు చేయలేదు సరికదా రాక్షసుడా, మానవుడా అనే సందేహం కల్గింది. కొంత కాలం తర్వాత తెలిసింది రాఘవాచార్యులుగారి ఉద్దేశం కూడా అదేనని. హిరణ్యకశిపుడు తన కృత్యాలవల్ల రాక్షసుడుగా పరిగణింపబడ్డ వాడే కాని, రాక్షసులనబడే ఒక ప్రత్యేక తెగకు చెందినవాడు కాడని. ఆఅభిప్రాయాన్నే తమ ప్రదర్శనలో వెలిబుచ్చినారని. అంతేకాదు. ఆ నాటకాలలో, "పలుంవా, తులువా" మొదలైన సామాన్యంగా రంగంస్థలంపై వినిపించే పాటలు పద్యాలు కాని, కత్తి సాములు, గారడీలు కాని, హిందుస్థానీ మెట్టులు, మాటికి రెండేసి పాటలు కాని ఎక్కడా వినిపించక పోవటం, వీటి లేమిని ఖండిస్తూ ప్రేక్షకు లెవరు అసంతృప్తి తెలియ చేయక పోవటం ఆశ్చర్యదాయకమైనాయి.

రాఘవాచారిగారు రంగస్థలములో ఈనూతన సంస్కారము ప్రవేశ పెట్టి, నాట్యకళకు ఒక ఉత్కృష్టస్థానము చెలకొల్ప తలచారో, ఆ సంస్కారమునకు ప్రజానీకము ఆమోదించి, ఉన్నత ఆదేశాన్ని అందుకొన్నారు.

ఆంధ్రనాట్య కళలో ఒక నూతన శకం ఆరంభించటానికి అదే మొదలు. అభినయ ప్రాధాన్యమైనదే నటన కాని, ఆర్భాట పూరితమై, అట్టహాసంగా వుండేదిది నటనకాదని, కళాప్రపూర్ణ రాఘవాచార్యులుగారు వెల్లడిచేశారు.

నాటకాలు స్వాభావికంగావుండి పాత్రౌచిత్యాన్ని నిరూపించాలన్న ఉద్దేశంతో స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించుట ఆచరణలోకి తెచ్చారు. ఈ నూతనోద్యమాన్ని ఆదిలో అనేకులు ఆక్షేపించారు. కాని నాట్యకళే తన జీవితాశయముగా ఎంచి, తన సర్వస్వము దానికై ధారపోయ నుద్యుక్తించిన వ్యక్తి ఎట్టి అడ్డంకులనైనా త్రోసిపుచ్చి ముందంజ వేయకలడు.

బళ్లారి రాఘవాచార్యులుగారి అస్తమయమొక్క తెలుగు రంగస్థలానికేలోటు కాదు యావద్భారత దేశానికీ తీరని కొరత. వీరి చాణక్య పాత్ర పోషణమాచి రవీంద్రుడు ముగ్ధుడైనాడట 'ఇంతవరకు భారత దేశంలో వంగరాష్ట్రమే రంగస్థలంలో అగ్రతాంబూలాన్ని పుచ్చుకున్న దనుకున్నాను. ఆంధ్రులలో వంగ నాట్యరంగాన్ని తలతన్న కలవారున్నారని రాఘవ ఋజువు చేశాడు' అన్నాడట అమరకవి. ఇట్టి అపూర్వ ప్రశంస లెన్నిటికో పాత్రుడైన మేటి ప్రతిభాశాలి రాఘవ. శారీరకంగా మన మధ్యనుండి మాయమైన రాఘవాచార్యులవారిని మానసికంగానైనా సజీవులుగా చేయటానికి ఒకటే మార్గం, వారి ఉన్నతాశయాలను ఏకైక దీక్షతో ఆచరించడమే అది.

—వినాయక్

★



గాంధీజీ విమలవాక్యాలు

స్త్రీలు - పదవులు

"ఎన్నికలలో తగినంత మంది స్త్రీలను అభ్యర్థినులుగా నిలబెట్టక పోవడం లేదా అధికార పదవులకు నియమించక పోవడంపై కొందరు చేసిన ఆక్షేపణుకు మీరిచ్చిన సమాధానాన్ని చదివాను. పదవీ నియామకానికిగాని, అభ్యర్థిత్వానికిగాని ప్రమాణంగా గొనవలసినది సామర్థ్యం ఒక్కటే అని మీ భావం. ఇది యథార్థం కాదని ఎవరూ అనలేరు. ప్రతిభను ప్రశంసించవలసిన సందర్భాలలో వయోభేదంగాని, స్త్రీ పురుష భేదంగాని పాటించరాదని ఒక సూక్తి వున్నది కూడా.

అయితే వాస్తవంగా జరుగుతున్న దానికీ, ఈ మీ ప్రవచనానికీ అనంత వ్యత్యాసం కనిపిస్తున్నది. ప్రతీ సందర్భంలోను ఈ సూత్రానికి విభిన్నంగా జరుగుతూవున్న విషయం మీకు తెలియనిది కాదు. మంత్రి వర్గాలలోనేమి, శాసన సభలలోనేమి, స్థానిక సంస్థలలోనేమి సమర్థతకు ప్రాముఖ్యమిచ్చిన జాడ కనబడదు. జాతి, మత రాష్ట్రాది విషయాలే ముందుకు వస్తున్నవి. ప్రతి నిర్ణయంలోను ఇవే ప్రాధాన్యం వహిస్తున్నవి. ఇది ఏమి న్యాయమయ్యా అంటే వీటిని విస్మరించరాదని తప్ప వేరు సమాధానం రావడంలేదు. ఈ వాదనే నిజంగా సహేతుకమయ్యే పక్షంలో స్త్రీల మాటేమి? మీరు సూచించిన సూత్రం దృష్టిలో ఈ అభ్యర్థుల ఎన్నిక నియామకాల సందర్భాన అవలంబించే విధానాన్ని స్పష్టీకరించడం అవసరమని నేను తలపోస్తున్నాను."

ఒక సోదరీమణి వ్రాసిన లేఖలోని భాగమిది. ఒక విషయంలో సర్వత్ర తప్పు జరిగినప్పుడు మరో విషయంలో తప్పు జరిగితే మాత్రం ప్రమాదం ఏమన్న భావానికి త్రోవతీస్తున్నది ఈమె వాదం. అయితే ఇదే పద్ధతిని మనం అనుసరిస్తూపోతే, తప్పు పెచ్చు పెరిగిపోయి, భయంకర పరిణామాన్ని పొంది, చివరకు మనం విడివడడానికి అవకాశం లేనంత క్లిష్ట పరిస్థితిలో చిక్కుకోవడం సంభవిస్తుంది. కాగా నేను స్త్రీలకు ఈ సందర్భంలో ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ ఎన్నికలను, పదవులను పరిత్యజించి, త్యాగమూర్తులు కావలసిందని. తన్మూలంగా మహిళలు తమ జాతికి దేశానికికూడా వన్నెను తేగలుగుతారు.

వర్గ మత విషయాలకు మనం ఎంతకాలం ప్రాధాన్యాన్ని ఇవ్వడం తప్పని సరి అవుతుందో, అంతకాలం స్త్రీలు దూరంగా వుండి, తమ గౌరవ ప్రతిపత్తులను హెచ్చించుకొంటూ వుండడమే అనుసరణీయం. ఇది ఎంత వరకు నిర్దుష్టంగా సాధించగలమా అన్నదే మన సమస్య.

ఈనాడు రాజకీయాలలో పాల్గొంటున్న స్త్రీల సంఖ్య బహుస్వల్పం. ఈ కొలదిమంది అయినా స్వతంత్రంగా తమకు తామై వ్యవహరించక, భర్తలపైనో, తలిదండ్రుల సలహాలపైనో

ఆధారపడుతున్నారు. తమ నిరాధరత్వాన్ని గ్రహించి, స్త్రీల హక్కుల కోసం ఆందోళన చేస్తున్నారు.

ఇంతకంటె స్త్రీలు తమతోటి వారిని వోటర్లుగా చేర్పించడం, విద్యా ప్రబోధం చెయ్యడం స్వతంత్రంగా ఏ విషయాన్ని గురించి అయినా యోచన చేసే శక్తిని వారిలో పెంపొందించడం, తమ్ము కాలానుగతంగా నిర్బంధంలో వుంచుతున్న వర్ణమత శృంఖలాలను విచ్ఛేదించుకొని, త్యాగసహిష్ణుతలలో స్త్రీకి గల అపూర్వ ధైర్య స్థైర్య సామర్థ్యాలను పురుషుడు గ్రహించ గలిగే పాటి మార్పును పొందించడం మొదలైన పనులను చెయ్యాలని నేను సూచిస్తున్నాను.

ఇలా చెయ్యడంవల్ల ప్రస్తుతంలో కలుషితమైవున్న వాతావరణాన్ని స్త్రీలు ప్రవిత్రీభూతం చెయ్యగలుగుతారు.

ఇక పురుషుల మాట: దోషభూయిష్ఠమైన వాతావరణం ఎక్కడ పరివ్యాప్తమైవున్నా దానినుండి విడివడడమే తమ విధ్యుక్తంగా పురుషులు భావించాలి. తమ మనస్సులలోనుంచి ఈ వర్ణ మత విభేదాలను తొలగించుకోవాలి. ఈ భేదాలను తొలగించుకోగలగడానికి స్త్రీలకు పురుషులకుకూడా ఒక సులభ మార్గం వున్నది.

అది మరేమీ కాదు. హరిజనులు కావడం—నేడు నీచాతి నీచంగా పరిగణింపబడుతున్న ‘భంగీ’ వృత్తిని స్వీకరించి సేవా జీవితంలో నిమగ్నులు కావడం.

సమర్థతగల స్త్రీలు ఎక్కడ వుంటారో, అక్కడ వారికి అవకాశమిచ్చి పురుషుల కంటె మిన్నగా ప్రకాశించగల వీలుకలిగించడం పురుషుల ధర్మం. నేను సూచించిన విధానం స్త్రీలు, పురుషులుకూడా వర్తించే పక్షంలో వాతావరణం త్వరితంగా పునీత మౌతుంది. ఈ విధంగా పురుషులు చేసినా, చెయ్యలేక పోయినా స్త్రీల కర్తవ్యం మాత్రం స్పష్టంగా వున్నదనే నా విశ్వాసం.”

(హరిజనబంధు నుంచి)

★

మనస్తత్వము

"శివం"

జాతీయ రచనామండలి

విశ్వనాథము పనిచేసే ఆఫీసు కిటికీలోనుంచి చూస్తే ఎదురుగావున్న బజారులో జరిగే అనేక విషయాలు కండ్ల పడుతూంటాయి. ఆదివారము (యిప్పుడు ఆదివారమునాడు బజారు వుండటము లేదు కాబోలు) నాడు మాత్రము భరింపరాని దృశ్యాలు అగుపించవచ్చును...అటువంటప్పుడు బయటకు చూడటము మానివేయొచ్చు...బలవంత మే మాత్రమూ లేదు.

ఎట్లాగయినాగాని, కిటికీగుండా బయట జరుగుతున్న విషయాలను చూచి ఆనందించే అవకాశము మాత్రము— విశ్వానికి చాలాస్వల్పము. ఎందుకంటే విశ్వనాథానికి ఎదురుగానే—అంటే కిటికీకి అడ్డముగా, హెడ్డు గుమాస్తా నారాయణయ్యరు కూర్చుని వుండేది. తను స్టేటుమెంట్లు వేసుకుంటోనో, లేక ఏ డ్రాఫ్టు అయినా గాని వ్రాయడము పూర్తి అయినానో, లేక కాస్త నడుము నొప్పిపట్టి అయినానో, కాగితముల పయినుంచి తలను ఎత్తే సరికి...తనకు ఆ Distempered గోడ మీది విచిత్రమయిన పచ్చటి చుక్కలు...సరిగ్గా కళ్ళ ఎదుట పడుతూంటాయి. తర్వాత హెడ్డు గుమాస్తా ముఖము...

సంవత్సరము క్రితము విశ్వనాథము యీ ఆఫీసులో గుమాస్తాగా ప్రవేశించే సరికి...అతనిని అమితముగా ఆకర్షించిన మొట్టమొదటి విషయము...ఆ గోడమీది చుక్కల రంగులు...చుక్కలూను. వాటిని చూచి అతను మహా మురిసి పోయేవాడు. క్రొత్తలో మొదట్లో తను కొంచెము సోమరిగా...వుండేవాడు—ఆ మాటను తను కాదనలేడు కూడాను. ఇంటివద్ద అందరూ తనని 'యద్దేవ' చేసే వారు...దేవలోకమునూ, వెన్నెల రాత్రులనూ, గభీర సముద్రములనూ...గురించి వ్రాయబడిన కవిత్వమంటే చెవి కోసుకునే వాడని. తన వంటి బద్ధకస్తుడూ...సోమరి వ్యక్తి వూహాలోకాల్లో విసుగు లేకుండా ఎట్లా సంచరించగలిగే వాడో...ఎవ్వరూ చెప్పలేరేమొ? గడ్డిపోచంత పటుత్వ మున్న విషయము చాలు...అతనిని వూహాలోకాలలో... సంచారానికి పేల్కొల్పడానికి. ఉదాహరణము ఆ మూడు మచ్చలు! అద్భుతమయిన మూడు ద్వీపాలవి. ఆ ద్వీపాల మధ్యనుండి...తనొక్కడూ తన బుల్లి పడవతో...ఆవలించే ఆ విశాల నీలాకాశము క్రింద ఎన్నిమార్లు ప్రయాణము చేసేడు. ఎంత ఆనందమును అనుభవించ గలిగేడు...ఆ విహారాలవల్ల. తను వుద్యోగానికి వచ్చిన తర్వాత మారిన పంకాలాగే కుర్రాళ్ళలో మూడో వాడు, చిత్రకళలో తనకూ ప్రవేశమున్నదన్నే విషయాన్ని నిరూపిస్తూ...ఆ మూడు ద్వీపాలనూ...ఎర్రసిరాతో అంచులు దిద్ది మానవాకృతులుగా...పిలకలతో తయారు చేసేడు...ఎవ్వరూ లేని సమయాన. తను చిన్న తనములో, చంద్రునిలోని 'ముసలమ్మ'ను చూడటానికి ఎంతగా అసహ్యించుకునేవాడో... యీ నాడు తన ద్వీపాలలోని మానవాకృతులను చూడ టానికి అంతకంటె ఖిన్నగా బాధపడుతున్నాడు.

కాని యీ మధ్య...వూహాలోకాలలోనికి తన ధీర కృత్యాలపయి మోజు తనకే క్రమముగా చల్లబడి పోయినది. ఇది వరకులాగ ప్రతీరాత్రి నిద్రలో...ఏదో వక నదీ ప్రవాహము వెంటనో,...కొండల వెంబడో, వంటరిగా విహరించడము మానివేసినాడు. క్లబ్బులో చేరిన తర్వాత, అతని పగటి కలలు పట్టణానికి బయటనే వున్న కొండలవయిపూ ...గుట్టలవయిపూ, పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న కొండజాతి ప్రజలవయిపూ మరల సాగినవంటే అసత్యము కాదు. నిస్సహాయుడిలా వంటరిగా తిరుగక—మూర్తి, శర్మ, శ్యామల, లక్ష్మి, రాజ్యం (క్లబ్బు స్నేహితులు) మొదలయిన మిత్రబృందముతో ఆడుతూ పాడుతూ కొండలు ప్రతిధ్వనించేట్లు నవ్వుకుంటూ ... మైళ్లకొలది ... తిరుగ సాగేడు...వూహాలోకాల్లోనే.

ఈ సారి నాన్నగారు, తనని "స్త్రీలతో కలసి విచ్చలవిడిగా తిరుగుతున్నావనీ, వాళ్ళుకూడా వెళ్ళే క్లబ్బులో నే మెంబరుగా చేరేవనీ" అడగక పోవడము కొంతవరకూ నయమే. క్రిందటి సారి చెల్లెలు మగవాళ్ళ Tennis Club లో (స్త్రీలకూ, పురుషులకూ అదే) చేరతానంటే ఎంత రభస జరిగింది?

విశ్వనాథము యిప్పుడు తీరికగా కూచుని విచారిస్తున్నాడు. 'తను రెండు నెలల క్రితము రెండు దినాల సెలవు తీసుకొని గుంటూరు ఎందుకు వెళ్ళినానా' అని. తన క్లబ్బులోని మిత్రులంతా—శ్యామలకూడాను—రేపు నాగార్జున కొండకు ప్రయాణము అవుతున్నారు. తను ఎన్ని దినాల నుంచో కలలు గనే విషయము రేపు కార్యరూపము దాలుస్తూంది...తీరాచేసి, తనకు సెలవ దొరుకుతుందా...దొరకదా...అనేదే ప్రస్తుతము ఆలోచించవలసిన విషయము.

* * *

"దయయుంచి...ఒకసారి 'లీవురిజిష్టరు' చూడనిస్తారా? సార్."

"ఆరు, నాలుగు కలిపితే పది, రెండు...పన్నెండు, ఏడు...పంథొమ్మిది, పన్నెండు పోతే...ఏడు పైసలు, అణాలు ఒకటి, ఒకటీను పదమూడు...పధ్నాలుగు, ఆరు వందల యాభయ్యెను...ముఫ్ఫయిఆరు, ఆరువందలఎనభయిఆరు అన్నమాట. మొత్తము 686-14-7. 'కరక్టు'...నేను మీకు అనేక పర్యాయములు చెప్పినా...పని చేసుకుంటూండగా మాట్లాడించ వద్దని. ఏమి లాభం...నా నోరు అరిగిపోవడమేకాని...మీరు వినరుకదా..."అన్నాడు అయ్యరు పుస్తకాలపయినుంచి తలెత్తి, కళ్ల జోడుపయినుంచి విశ్వనాథాన్ని చురచుర చూస్తూ.

"తప్పిదానికి క్షమిస్తా రనుకుంటా. లీవు రిజిష్టరు ఒక సారి యిస్తారా...చూసుకొని యిచ్చేస్తాను."

"లీవు రిజిష్టరా?" మనీపర్సును ఒకసారి యిస్తారా... అని అడిగినంత ఆశ్చర్యాన్నే పొందేడు నారాయణయ్యరు.

"అవును సర్, లీవు రిజిష్టరు. మనము వాడుకున్న సెలవలు note చేయబడి వుండే రిజిష్టరు" అన్నాడు విశ్వం...విపులీకరిస్తూ.

"ఒహ్హో! లీవు రిజిష్టరా? అదయితే...ఆఫీసరుగారి డ్రాయరులో వుంది. అయినా దానితో ఏమి పని మీకు?"

"నాకు యింకేమయినా సెలవ మిగిలి వున్నదేమో...చూచుకుందామని...సర్."

ఒక్కసారి 'ట్రే' లోని గుండుసూదులు...పాళీలు తలక్రిందులు అయినట్లే... వినవచ్చింది హెడ్డుగుమాస్తా నవ్వు.

మీకు మిగిలివున్న సెలవలు...ఏమిటో వాడుకున్న సెలవలు ఏమిటో మీకే తెలియవుటుండీ! అయితే నేను చెబుతాను వినండి. మీకు వున్న సెలవులన్నీ యిదివరకే వాడేసేరు...బాబూ!"

"లేదు సార్. ఇంకా రెండు దినాలు మిగిలి వున్నట్లుగ నాకు జ్ఞాపకము వుంది..."

"జూలై నెల మొదట్లో రెండు దినాలు వాడేయటము గుర్తుకు రావటంలే...అన్నాడు అయ్యరుగారు చిరాకు పడుతూ.

"అది సరే సార్. విక్టరీ సెలవల్లో...యింకా ఒకటి రెండు దినాలు వుండాలి..."

"లేదు. అవ్వీ వాడేసేరు. సరిగ్గా monthly returns పంపబోయేముందు సెలవు పెట్టేరు...గుర్తు లేకూ మేమంతా...ఆ స్టేటుమెంట్లు అగుపించక తన్నుకున్నాము కూడాను..."

ఇంతలో జవాను వెంకన్న...తలుపు వెనకనుంచి కాఫీ తెచ్చినట్లు సంజ్ఞ చేయడమూ...,అయ్యర్ గారు 'ఒక్క క్షణమయినా సరిగ్గా పని చేసుకోనీయరు గదా" అని నసుకుతూనే లేచి బయటకు జారడమూ...విశ్వనాథము కిటికీవద్దకు అడుగులు లెక్క పెట్టుకుంటూ నడవటము జరిగేయి.

చుట్టూవున్న పెద్ద భవనాలు...ఆఫీసును చూచి యీసడిస్తూన్నాయి. కిటికీ గుండా అగుపించే ఒక మేడమీద నుండి త్రివర్ణ పతాక మొకటి...తెలతెలబోయే ఆకాశములో స్వేచ్ఛగా ఎగురుతూంది. బానిసత్వాన్ని బెదిరి

స్తూన్న పతాకమును పక్షులు రెండు వకదాని నొకటి తరుముతుంటూ చేరబోవడేము...క్రిందటి వారము తను సినిమాలో చూచిన News Reel లోని విమాన యుద్ధమును స్మృతికి తెచ్చినది...విశ్వానికి. ఇదే మాదిరిగా వకదాని నొకటి తరుముకోగా... వక విమానము...అకస్మాత్తుగ చెడిపోయి సముద్రములో పడి మునిగిపోతుంది. దూరాన పోతూన్న మిత్ర నౌక...యిది చూచి... విచార చిహ్నముగా... పతాకమును ఎగుర వేస్తుంది.

తామంతా యీ దాసత్వములో పడి మునిగి పోగా, ఆకాశాన్నంటుకునే సౌధమునుంచి ఎగిరే ఆ పతాకము... తమ విషాద జీవితానికి స్మృతి చిహ్నముకాదు కదా...? స్వాతంత్ర్యాన్ని...యిష్టా అయిష్టతలను మరచి, కాగితాలే ప్రపంచమనుకుని జీవిస్తూన్న తమ వంటి గుమాస్తాల చరిత్రను, అల్లంత ఎత్తునుండి విచిత్రమయిన భాషలో యితర ప్రజానీకానికి ఎలుగెత్తి చెబుతున్నదా...ఆ పతాకము! లేక పోతే ఆ 'టప టప' మనే విచిత్రమయిన భాష ఏమిటి?

తన ప్రక్కను కూర్చునే గుమాస్తా సుబ్బారావు... పెన్సిలు కోసము మూడవ సారి పిలవడముతోనే...ఊహాలన్నీ బ్లాటింగులో అద్దేసినట్లే అయిపోగా... టేబిలువద్దకు వచ్చి కూర్చున్నాడు విశ్వనాధము.

శనివారమునుంచి సోమవారము సాయంత్రము వరకు తామంతా కలసి నాగార్జున కొండలలో కాలాన్ని గడప బోయేది, మొత్తము మూడు దినాలు. ఆదివారము మామూలుగ సెలవు దినమే. అంటే పదకొండు గంటలకే ఆఫీసు కొచ్చి...సాయంత్రము ఆరు గంటల కల్లా యింటికి వెళ్ళి పోవచ్చును! ఇక...శనివారము, సోమవారము సెలవు పెట్టాలి. రెండు దినాలు సెలవు కనుక మిగిలి వుంటే ఎంత బాగుండును!

లీవు రిజిష్టరును గురించి హెడ్డుగుమాస్తా అబద్ధమాడటము లేదూ? సాధారణముగా అది ఎప్పుడూ నారాయణయ్యరుగారి 'అల్మయిరా' లోనే వుంటుంది. ఏ కారణము చేతనో గాని...ఆయనకు ఆ రిజిష్టరు తన కండ్లబడ నివ్వటము యిష్టము లేదు. కానీయి, ఎందుకు కనపడదో చూద్దాము...అని అనుకుంటూనే విశ్వనాధము లేచి అయ్యరుగారి అల్మయిరాను చేరబోయే సరికి మేడమెట్లమీద శబ్దము వినరాగానే...ఖంగారు ఖంగారుగా...విశ్వనాధము తన టేబిలును చేరి...పనిలో నిమగ్నుడయి పోయినట్లు నటించ సాగేడు. ఖంగారులో స్టేటుమెంట్లులో వక చోట 7000 కు బదులు 700 కూడా వేయ సాగేడు. మధ్యాహ్నము నాలుగు గంటలకు...అయ్యంగారు టిఫినుకు లేచే వఱకు గాని—తనకు అల్మయిరా తెరిచే అదనే చిక్కలేదు.

లీవు రిజిష్టరు 'అల్మయిరా' లోనే వున్నది. తను వాడిన సెలవు దినాలన్నీ అతిజాగ్రత్తగా అందులో గుర్తించబడి వున్నాయికూడాను. సెప్టెంబరులో రెండు విక్టరీ దినాలూ వాడేసేను. పోగా యింక వక్క సెలవు దినము తనకి మిగిలివున్నదన్న మాట.

రేసుకోర్సులో ఎక్కువగా అగుపించే ముఖాల వంటి ముఖముతో, విశ్వనాధము నీరసించి పోయి...కుర్చీలో జేర్లబడి పోయేడు. సెలవులన్నీ వాడేసినట్లు తనకీ తెలుసును గాని...తన యిష్టదైవ మెవ్వరయినా తనని కటాక్షించి...వాడుకున్న దినాలన్నీ చెరిగిపోయేట్లు చేయడమో లేక మరొక విధముగానో...తనకు వుపకారము చేయడము జరుగుతుందని...పిచ్చి భ్రమపడ్డాడు. కాని అటువంటి మంచి పను లేవీ జరుగ లేదు...యిక్కడ.

అయితే ఇక తనకు మిగిలి వున్నది వక్క దినము... సెలవే. మరొక రోజు Special leave అడిగితే...దొర దయతలచి యివ్వవచ్చు. తను నారాయణయ్యరును పట్టుకు ప్రాకులాడితే లాభము ఏ మాత్రమూ లేదు. తిన్నగా దొర వద్దకే వెడితే బాగుంటుంది.

దొరను చూస్తే... తనకు జమీందారుగారి నల్లటి 'జాగిలము' గుర్తు కొస్తూంటుంది. అంతటి కుత్రత తెలివి, చలాకీ, పట్టుదల...దొరలోకూడ పేరుకు కూచున్నాయి.

దొరచేత సంతకాలను చేయించడానికి నాలుగు స్టేటుమెంట్లును 'pad' లో కట్టుకొని విశ్వనాధము దొర గది లోకి నడిచేడు.

SPARKS దొర విశ్వనాధాన్ని చూస్తూ చిరు నవ్వొకటివదుల్తూ...తన ఎదుటనే వున్న విశ్వనాధము దస్తూరీతో

వున్న వక వుత్తరాన్ని చూపుతూ అన్నాడు "నీ దస్తూరీ చదువుతుంటేనే ఆనందముగా వుంటుందోయి. నీ వంటి దస్తూరీ మన మిగతా గుమాస్తా లందరికీ వుంటే చాలా బాగుండును. అన్నట్లు ... యెప్పుడూ పని తేలికగా వుంటూందా ?"

"చిత్తము. తేలికగానే వుంటూంది తమ దయవల్ల."

"మంచిది. మనస్సును పని మీద లగ్నము చేస్తే... కష్టమయిన పనయినా తేలికగా వుంటుంది సుమా. ఇందులో పెద్ద తెలివి తేటలు అక్కరలే."

"చిత్తం. వారు మీ రిచ్చిన పని చాలా సరదా అయిన పని కూడాను."

సంభాషణ చాలా సాఫీగా, అనుకూలముగా, నడుస్తూంది. తను Spceial leave అడగటానికి యిదే చక్కని సమయము కూడాను. ఆఫీసరు డ్రాయరుమీద వున్న "Do it now" అనే మాటవైపే చూస్తూ నాలుకను తడుపుకోసాగేడు విశ్వనాథము.

"ఆ సుబ్బారావుకు పనంటే వట్టి ఏడుపోయి. పైగా తన పని చాలా కష్టమంటాడు. పని ఎందుకు కష్టముగా వుంటుంది? మనస్సును పనిమీద...లగ్నము చేయకపోవడం వల్లనేఆతను 'ఎప్పుడు శనివారం వస్తుందా...ఎప్పుడు ఆదివారము ఆఫీసు ఎగకొడదామా...ఎప్పుడు సెలవు పెడదామా...' అనే ఎప్పుడూ ఆలోచిస్తూంటాడు. ఇదేనా పైకి వచ్చే లక్షణము ?"

"కాదు సార్."

"నీవు కనక యిదేమాదిరిగా...ఉత్సాహముగా, పట్టుదలగా పని చేస్తే ఏడెనిమిది ఏండ్లలో హెడ్డుగుమాస్తావు అయ్యి తీరుతావు...మంచిది. నీకు ఏం కావాలి..."

విశ్వం గుండెలు దడదడా కొట్టుకున్నాయి. ఇప్పుడు కనుక సెలవు అడిగితే ఎనిమిదేళ్ళకు రాబోయే హెడ్డుగుమాస్తా పని పోతూన్నట్లే అనిపించగా...వుక్కిరి బిక్కిరి అవుతూ. "సంతకాలకు స్టేటుమెంట్లు సర్" అని అనగలిగేడు.

సంతకాలయిన స్టేటుమెంట్లతో బయటపడ్డ విశ్వానికి... Distempered గోడమీది చుక్కలన్నీ త్రివర్ణ పతాకాల లా అగుపిస్తూ...టప టప లాడుతూ...సందేశాల నిస్తూ బానిసల మనస్తత్వాన్ని హేళనచేస్తూన్నట్లు అగుపించసాగేసరికి క్రుంగిపోయాడు కుర్చీలో.

★

పడుపువృత్తి

పడుపువృత్తి స్త్రీ జాతి కొక కళంకము. ఇది ఒక చోట కాక ప్రతిదేశంలోనూ వ్యాపించి ఉంది. పురుషుడు స్త్రీని బానిస చేసి, ఆమెను తీసికొని పోయిన నీచ స్థితికి ఇది సూచన. ఇది నశించే దాకా, స్త్రీ జాతికీ కళంకంపోదు.

కడుపుమంట తీర్చుకోడానికి స్త్రీ పడుపువృత్తి నవలంబించడం హేయంగా అగపడుతూంది. పరస్పర ప్రేమయే ఆధారంగా వుండవలసిన దాంపత్య శోభను నీచస్థితికి త్రోయడం ప్రకృతికి భిన్నం. స్త్రీ తన ఇష్టానిష్టాలతో పని లేకుండా, పురుషుని సుఖంకోసం తన మాంసాన్ని అమ్ముకోవడం అతి నీచమైన బానిసత్వం. దీని వలన ఆమెకు నైతిక పతనమే కాక, శారీరక మానసిక పతనాలుకూడా కలుగుతాయి. పడుపువృత్తికి దిగిన తరువాత మలినరోగాలవలన శరీరమంతా పాడుచేసికోనని స్త్రీ లేదు. మొదటిలో ఆర్థికంగా ఏదో లాభదాయకంగా అగపడినా, ఈ వృత్తిలోనికి దిగిన స్త్రీ కొన్నాళ్లకు రోగాలవలన శరీరమంతా పాడయి, ఒక్కొక్కప్పుడు మెదడుకూడా చెడి జీవిత సౌఖ్యమంతా దూరమై, మోసపోతుంది. ముందు రాబోయే స్థితిగతుల నూహించుకోనగలిగిన స్త్రీ ఎవతే కూడా ఈ వృత్తిలోనికి దిగదు. అజ్ఞానంవలన, కష్టనిష్ఠురాలు తెలియక, అప్పటి పరిస్థితులను బట్టి మోసగాండ్ర ప్రోత్సాహానికిలోనై, స్త్రీ మొదటిలో ఈ వృత్తిలోనికి దిగుతుంది. సంఘం ఆమెయందు చూపే నీచత్వము, కఠినత్వమువలన, వెనుకకు తిరిగి రావడానికి అవకాశంలేక, అందులోనే జీవితాన్ని నశింప చేసుకుంటుంది.

పడుపువృత్తి ప్రతి దేశంలోను వ్యాపించియుండుట చేత, దీనిని రూపు మాపడానికి ప్రతిచోటా ప్రయత్నాలు చేయబడుతున్నాయి. కాని ఈ ప్రయత్నాలు పడుపువృత్తి ఎందుకు వచ్చింది అనే విషయగ్రహణమీద ఆధారపడి ఉండక పోవడంనుండీ, అంతగా ఫలించడము లేదు. పడుపువృత్తి నిర్మూలన కొరకు జరిగిన అంతర్జాతీయ సమావేశం గురించి 1913లో లెనిన్ ఇలా వ్రాసేడు. "స్త్రీలను పిల్లలను అమ్మడాన్ని అభ్యంతర పెట్టడానికి ఐదవ అంతర్జాతీయ సమావేశం లండనులో కొద్ది కాలం క్రింద జరిగింది. అక్కడ జమీందారిణులు, రాణీలు, మతాధిపతులు, పీఠాధికారులు, పోలీసు ఆఫీసర్లు, వారి హంగుదారులు హడావిడిగా తిరిగేరు. ఎన్ని విందులు జరిగేయి, ఎంత అఖండమైన ఆహ్వానాలని! పడుపువృత్తి యొక్క దుష్టత్వము గురించి, దాని యొక్క ప్రమాదము గురించి ఎన్ని గంభీరోపన్యాసము లవి! కాని దీనిని ఎదుర్కోడానికి ఆ ధనిక ప్రతినిధులు ఏమి మార్గాలు సూచించేరు? ముఖ్యంగా రెండు—మతము, పోలీసు. కెనడానుండి వచ్చిన ఒక శ్రీమంతురాలు పోలీసుల గురించి ముచ్చటిస్తూ మానాన్ని కోల్పోయిన స్త్రీలమీద పోలీసుల అవసరం గురించి ఎంతో ఉత్సాహంగా మాట్లాడింది. కాని కూలి హెచ్చుచేయడం వీలవుతుందా అనే ప్రశ్న వచ్చినప్పుడు, ఆడ కూలీలు హెచ్చు జీతానికి అనర్హులనే అభిప్రాయం వెలిబుచ్చిందామె. కార్మిక కుటుంబాల బీదతనము, దుర్భరపరిస్థితులు, చిన్న బిడ్డల రెక్కల కష్టంమీద లాభాలు తియ్యడం, భరింపరాని షరతులు మొదలయిన పడుపువృత్తి యొక్క సాంఘిక కారణాల పరిశీలన ద్వారా, ఆ సమస్యా పరిష్కారాన్ని ఆస్ట్రియా ప్రతినిధి అయిన గార్ట్నరు చర్చింప ప్రయత్నించినపుడు, అడ్డుకేకల ద్వారా అతడు మాట్లాడక కూర్చోవలసిన పరిస్థితి వచ్చింది." పడుపువృత్తి నిర్మూలనానికి మార్గం ఇది కాదని గ్రహించినపుడే ఏమయినా వీలవుతుంది.

పడుపువృత్తికి ముఖ్య కారణం ఆర్థికం. లాండల్స్ చెప్పినట్లు 'బీద తనమునే ఫేక్టరీలో తయారవుతూంది పడుపువృత్తి.' ఆకలే నూటికి 80 వంతుల పడుపువృత్తికి దారి

* మొదటి ఆరు వ్యాసములు (వివాహము, ఆర్థికసమస్య, బిడ్డలు, వంట, ఆరోగ్యము, విద్య) నవంబరు, డిశంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిలు ఆంధ్ర మహిళ సంచికలలో ప్రచురింపబడినవి.

తీస్తూంది. ఆకలి బాధ లేకుండా చేయగలిగితే, నూటికి 80 వంతులూ ఇది తగ్గిపోతుంది. ఆర్థికంగా స్త్రీ పురుషునికి బానిస అయి ఉండి, బీద తనమువలని బాధలకు ఎక్కువగా గురి అవుతూంది. రెక్కల కష్టంవలన ఆర్జించుకోడానికి పురుషుని కంటె ఆమె కెన్నో ఎక్కువ ఇబ్బందులున్నాయి. అందువలన పొట్ట కూటికి ఈ మార్గానికి దిగుతుంది. లీగ్ ఆఫ్ నేషన్స్ వివిధదేశాలలో నడిపిన పరిశీలనల ద్వారా బీద తనమే, ఆకలి బాధే ప్రతి దేశంలోనూ కూడా పడుపు వృత్తికి దారి తీస్తున్న ముఖ్య కారణమని తేలింది. స్త్రీ తన శరీరాన్ని అమ్ముకోడానికి సిద్ధపడినపుడు, దానిని కొనుక్కోడానికి తయారుగా, పనిపాటులు లేకుండా కాలాన్ని వెళ్లబుచ్చవలసిన అవసరం గల ధనిక వర్గము ఒకటుండాలి. కేపిటలిస్టు దేశాలలో అటువంటి ధనిక వర్గము స్త్రీని శరీరమమ్ముకొనమని ప్రోత్సహిస్తుంది. కేపిటలిస్టు తత్వము వలన బీద తనములో మ్రగ్గుతున్న స్త్రీ అందుకు తయారవుతుంది.

ఇది కాక ఇతర కారణాలుకూడా కొన్ని ఈ వృత్తికి కారణమవుతున్నాయి. పశ్చిమ దేశాలలో సాహస క్రియల మీద అభిమానము, యాంత్రిక నాగరికత తెచ్చిన వస్తువుల మీద తాహతుకు తగని అభిమానము కొందరు యువతులను ఈ వృత్తిలోనికి లాగుకొని పోతున్నాయి. స్త్రీలను ఇతర దేశాలకు కొనిపోయి, పడుపువృత్తిలో దింపి, అందువలన లాభాలు పొందుదామనే సంఘాలు ఇటువంటి యువతులకు దొంగ ఆశలు కల్పించి, తరువాత మోసపుచ్చుతాయి. అప్పుడా స్త్రీలు వెనుకకు వెళ్లలేని స్థితిలో పడుపువృత్తికి దిగుతారు.

మన దేశంలో బీద తనం కాక పడుపువృత్తికి గల ఇతర కారణాలలో మతసంబంధమయిన, అయిష్ట వివాహ సంబంధమయినవి ఉన్నాయి. మన దేశంలో దేవాలయాలకి సంబంధించి దేవదాసీలనే వారుండడం ఒక ఆచారమై ఉంది. నృత్యము, సంగీతము ఈ తెగలోనే ఎక్కువగా ఉండేవి. దైవవిగ్రహం ముందు నృత్యం చెయ్యడం, సంగీత కచ్చేరీలు చేయడం వీరి విధి. వీనికి తోడుగా పడుపువృత్తి, కూడా చేస్తూ ఉంటారు వీళ్లు. ఈ తెగవాళ్లకి బీద తనము బాధ లేక పోయినా, వీరిలో చాలమంది ఇప్పటికీ తమ కులాచారమైన వృత్తిని మాని, ఇతర వృత్తులలోకి రావడానికి ఇష్టపడరు. పెళ్లిళ్లకు ఒప్పుకోరు. తమ కులాచారం ప్రకారం అలాగ అవివాహితులుగానే ఒక దేవాలయానికి సంబంధించి ఉండి, పడుపువృత్తిని స్వీకరిస్తారు.

చిన్న పిల్లలకు ముసలివాళ్ల నిచ్చి వివాహం చెయ్యడంతో, ఆ స్త్రీ యౌవనం వచ్చినప్పుడు భర్త మీద అయిష్టంవలన ఇంటినుండి వెళ్లిపోయి, ఆ తరువాత ఒంటరిగా విడిచి పెట్టబడి, వేరు గత్యంతరం లేక, పడుపువృత్తిలోనికి దిగుతుంది. అలాగే పునర్వివాహం లేక నిర్బంధించబడిన బాల వితంతువులు యౌవన సౌఖ్యం కొరకు ఎటువంటి అవినీతికైనా పాల్పడి, ఆ తరువాత సంఘంయొక్క నిందలను భరించ లేక ఇంటినుండి పారిపోయి పడుపువృత్తి నిర్వాహకుల చేతిలో పడతారు. ఇలాగ మన దేశంలోని వివాహ సంస్థలోని లోపాలు కొందరు స్త్రీలను పడుపువృత్తిలోనికి దింపుతున్నాయి.

మన దేశంలోని పెద్ద పట్టణాలలో పురుషులు స్త్రీలకంటె చాలా ఎక్కువగా ఉంటారు. 1931 సెన్ససు లెక్కల ప్రకారం 1000 మగవాళ్లకి కలకత్తాలో 475 స్త్రీలు, బొంబాయిలో 553 స్త్రీలు ఉన్నా స్త్రీ పురుష జనాభాలో ఇంత తేడా ఉండడం పడుపువృత్తిని హెచ్చు చేస్తుంది. పెద్ద పట్టణాలలో స్త్రీ పురుష జనాభా దరిదాపు సమానంగా ఉండేటందుకు తగిన అవకాశాలు, సుళువులు వస్తేగాని ఈ చెడుగు పోదు.

పడుపువృత్తి నిర్మూలన కొరకు అనేక ప్రయత్నాలు చేయవలసి ఉంది. స్త్రీలను ఎక్కువగా ప్రోగుచేసి ఈ వృత్తిని నిర్వహించే పడుపుగృహాలను (brothels) నిర్మూలిస్తే చాలు, ఈ వృత్తి చాలమటుకు నిర్మూలమవుతుందని చాలమంది అనుకుంటారు. అదే చాలచోట్ల ఆచరణలోకి వస్తూంది. కాని ఆ పని ఒక్కటే చేయడంవలన ఏమీ ఉపయోగం లేదు. పడుపుగృహాలను రద్దుచేయడం మాత్రాన ఈ చెడుగు పోతుందన్న అభిప్రాయంపై లాండర్స్ ఇలా అంటున్నాడు. "దుమ్మునంతా ఇంటిలోపల ఉంచి, సుమ్మం


ముందు కుడవడం ద్వారా నీతిని ప్రపంచంలో స్థాపిస్తామని ఆశపడుతూంది అంతర్జాతి సమితి."

ఇలాగ పడుపుగృహాలను విచ్ఛిన్నం చేయడం, లేక పట్టణ సరి హద్దుల పైకి తరుమడం వలన మాత్రం ఏమీ లాభంలేదు. దానికి తోడుగా ఎన్నో కార్యాలను నిర్వహించవలసి ఉంటుంది. పడుపుగృహాలను విచ్ఛిన్నం చేసినప్పుడు, అందులోని స్త్రీల నందరినీ రక్షణ గృహాలలోనికి తీసికొని వారిని కొంతకాలము పోషించి, వారి కేదైనావృత్తిని నేర్పి, పొట్ట పోషించుకొనుటకు మార్గాన్ని ఏర్పరచాలి. పడుపు వృత్తివల్ల కలిగే సాధక బాధకాలను ఎక్కువగా ప్రచారం చెయ్యాలి. పడుపువృత్తి మాని వచ్చిన స్త్రీలను సాంఘికంగా బాధలు పెట్టక వారి అవస్థను కొంత సానుభూతితో చూస్తూ, వారికి దయ చూపాలి అదిగాక పడుపువృత్తిని నిరోధించేటందుకు ముఖ్యంగా స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్నివ్వాలి. వారి ఆర్థిక స్థితి ఎక్కువగా వృద్ధి చెయ్యాలి. చాల వృత్తులలో స్త్రీలు పొట్ట పోషించుకొనుటకు అవకాశాలు కల్పించడమే కాక, వారి కందులో జీతాలు బాగుగా ఉండేటట్లు చూడాలి. స్త్రీల ఆర్థిక పరిస్థితి చక్కబాటే పడుపువృత్తి నిరోధానికి ముఖ్యమార్గం. అది గాక వివాహ పరిస్థితుల్లో చాల మార్పు అవసరం. మన దేశంలో స్త్రీకి ముదుసలులను కట్టిపెట్టక, ఆమెకు నచ్చిన వానికి వివాహం చేయుట, బాలవితంతువులకు పునర్వివాహములు చేయుట, స్త్రీకి అత్తింటిలో బాధలు పోగొట్టుట మొదలగునవికూడా చాలా ముఖ్యము ఈ చెడుగును నిరోధించడానికి.

సోవియటు రష్యాలో స్త్రీలకి ఆర్థిక స్వాతంత్ర్యముంది. స్త్రీల వేతనాలు పురుషుల వేతనాలతో సమానంగా ఉంటాయి. అది కాక వివాహంలో స్త్రీకి ఎంతో స్వేచ్ఛ ఉంది. పని లేకుండా కాలాన్ని ఎలా వెళ్లబుచ్చాలా అనే ధనిక వర్గం లేదు. వీటన్నిటి మూలంగా సోవియటు ప్రభుత్వం వచ్చేక పడుపువృత్తి నూటికి 90 వంతులు తగ్గిపోయింది. స్త్రీల ఆర్థిక స్థితిని బాగుచెయ్యడమే కాకుండా సోవియటు ప్రభుత్వం పడుపుగృహాలను నిర్మూలం చేసి, అందులోని స్త్రీల కొరకు అనేకమైన రక్షణ శాలలు కట్టింది. వాటిలో ఆ స్త్రీలను చేర్చి, వారికి వైద్య సహాయాన్నిచ్చి రోగాలను కుదిర్చి, చదువు చెప్పిస్తుంది. అలాగ కొంత కాల ముంచిన తరువాత వాళ్లను ఫేక్టరీలలో నియోగిస్తుంది.

కనుక స్త్రీ జాతికి కళంకమైన పడుపువృత్తిని సమూలకంగా నిర్మూలించాలంటే స్త్రీకి పురుషునితో సమానత్వము వచ్చేటట్లు చూడాలి. ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యము, వివాహ స్వాతంత్ర్యము అవసరము. అవి వచ్చేదాకా పడుపు వృత్తిని మాన్పడానికి చేయబడే పైపై ప్రయత్నాలు ఏదో కొద్దిగా ఉపయోగిస్తాయి కాని, ఎక్కువగా ఉపయోగింపబడవు.

★



భగ్నప్రణయిని!!

శ్రీమతి కోకా సరస్వతీకుమారి

విసుగువిరామమ్ముఁ వదలివీనులవిందుగ ప్రేమమీరనా
ముసిముసినవ్వులోల నినుముద్దుగబిల్చిన పేరులెల్లనీ
కసికిసమూలమాచునను గాసిలిబెట్టునటంచు నేడునా
పసిమనమెప్పుడున్ యిటులభావనచేసి యెరుంగదేలకో?

చిరుతతనంబునుండి కడుచెల్మినిగూర్చిన ప్రేమవాహినిన్
మరువదలంచు నీమనముమారినరీతిని జూడగాధరన్
కరుకగుబాధలన్ దలచికాలముజెందెడి మార్పుజూచినన్
బరువగుచుండె నా బ్రదుకుభారము యెప్పటికప్పుడీగతిన్

యిమ్ముగవచ్చు శోకభరమెప్పుడు యీగతినాదుగుండెలో
క్రమ్ముచుశాంతి భద్రతలకాకర మీయక రెచ్చగొట్టినన్
వమ్మగునాదుభక్తియని బాధలనెల్లెడ కట్టిపెట్టినా
సొమ్మగుప్రేమతో దలతు శోభదలిర్పగనిన్ను నామదిన్

కదలిన గుండెనిబ్బరము కల్గగజేసెడు నీదురూపునే
వదలక మాటిమాటికిని వర్ధిలుచుండెడి ప్రేమసంపదన్
మెదలుచునిన్ను నాహృదయవీధిని నిల్పితినో మనోహరా!
సదమలప్రేమనాకొసగు సంపదలోగల భావమిట్టిదే!

సుందరపుష్పహారతిని శోభనుదెచ్చితినీదు రాకకై
చిందరవందరన్ బరగుచెల్మి సమూహపు చిట్టినవ్వులన్
పొందియపూర్వ భాగ్యమగుపుణ్య సుధామధుగ్రోలనేడిటన్
తొందరసేయు నా మదిమధూత్సవకాంతులు చెంగలింపగా!


ఖటావ్
వాయల్స్
రంగు వేసినవి. అచ్చకము వేసినవి. మెర్సిరైజు వేసినవి

పాటక స్త్రీ జనాభ్యుదయము

★

—రాజకుమారి అమృత కౌర్ గారి To Women అనే ఆంగ్ల గ్రంథము నకు తర్జుమా. మొదటి రెండు అధ్యాయములు మార్చి, ఏప్రిల్ సంచికలలో ప్రకటింపబడినవి—

★

పాటక జనములోని స్త్రీలకు మనము చేయ గలిగిన సేవకవకాశములు చాలగానే వున్నవి. పెద్ద పెద్ద పారిశ్రామిక పట్టణములలో పారిశ్రామిక చట్టప్రకారము యజమానులు తమ దగ్గర కూలి చేసే స్త్రీలకు పిల్లలకు కొంతవరకు జీవితావసరములతో పాటు వైద్య సహాయము, విద్యావకాశములు కూడ కల్పించాలి. కాని యివన్నీ అక్షరాల ఆచరణలోకి రావాలంటే యింకా కొంతకాలము గడవాలి. పారిశ్రామిక ప్రదేశములుకాని యితర చోట్లకూడ స్త్రీల చేత పారిశ్రామిక చట్ట విరుద్ధముగ పని చేయించుతువుంటారు. దీనిని గురించి మనము తగిన శ్రద్ధ తీసుకోవాలి. ఆడ కూలీలు పురుషులతో సమానముగ కష్టించి సమానమగు పని చేసినప్పటికి తక్కువ కూలిని పొందుతున్నారు. పైపెచ్చు పని చేసే సమయములో తోటి కూలీలు మేస్త్రీలు మొదలైన పురుషులు యే విధముగ సంచరించినప్పటికి సహించి వూరుకోవలసి వస్తూ వుంటుంది. ఇంక వీళ్ల నివాసములు హరిజనుల నివాసములకు యే విధముగాను తీసిపోవు. వీరి పిల్లలగురించి శ్రద్ధ తీసుకోవటము యెక్కడో గాని వుండదు.

నిరాడంబర జీవనము

ఊరికే మాటలు చెప్పేకన్న స్వయముగా ఆచరణలో పెట్టి చూపటము ఉత్తమమనే పద్ధతిని, యితరులను తమ పద్ధతులను మార్చుకొనమని చెప్పేకన్న ముందు మనమే మార్చుకుని వాళ్లకు చూపటము మంచిది. మనలో శుభాశుభములన్నింటికి డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టే వాడుకవున్నది. ఇంత అనవసరపు ఖర్చు యెందుకని అడిగితే ఖర్చు తగ్గించవలెనని యెంత ప్రయత్నించినా యింటిలోని స్త్రీలు వొప్పుకోరు. వాళ్లే యీ దుబారాఖర్చులకు కారణమని ప్రతి పురుషుడు అంటాడు. అక్కర్లపట్ల చేసే వ్యర్థపు ఖర్చులవల్ల, వరదక్షిణ వంటి దురాచారాలవల్ల కొన్ని కుటుంబములు సంవత్సరముల పర్యంతము కాదుగదా తరతరాలవరకు అప్పులలో మునిగి వుంటవి. ముందు మనమే స్వయముగా యీ దురాచారాలను నిర్మూలించి సుఖ జీవనానికి సంఘాభ్యుదయానికి మార్గదర్శకులము కావాలి.

రచన :
రాజకుమారి అమృతకౌర్

★

తర్జుమా :
శ్రీమతి అచ్యుతుని గిరిజ

మనలో చాలామంది క్షేమజాలకు పోయి తలకు మించిన వ్యయముతో బాధపడుతువుంటారు. ఆహార వ్యవహారములలో దుస్తులలో నిరాడంబరముగా వుంటే స్వయముగ మనము యెంతో లాభము పొందటమే కాక మనము సహాయము అవసరమైన ఆర్తులకుకూడ వుపకారము చేయ గలుగుతాము. అందువల్ల నిరాడంబర జీవనము ప్రతివారికి అవసరము.

బాల్య వివాహము, బహు భార్యాత్వము, పరదా

శారదాచట్టము వచ్చినా బాల్య వివాహాలు యింకా జరగటము మన మందరము చూస్తునే వున్నాము. విద్యా ప్రచారమే యీ బాల్య వివాహ జాడ్యానికి తగిన మందు. దురాచారాలను అరికట్టటానికి న్యాయచట్టము (లా) కొంత వరకు వుపకరిస్తుంది. కాని సంఘములోని ప్రతి ఒక్కరు ఆ దురాచారము యొక్క దుష్పరిణామాన్ని చక్కగా గ్రహించితేనే గాని ఆ దురాచారము సమూలముగ నశించే అవకాశము వుండదు. మన జాగ్రత్తవల్ల, బాల్య వివాహము చేసిన తలిదండ్రులకు తగిన శిక్ష విధించటము వల్ల యీ దురాచారము నశించటానికి ఎక్కువ వీలు వుంటుంది.

ఈ పద్ధతే బహు భార్యత్వానికి కూడ అనువర్తిస్తుంది. బహు భార్యాత్వము తన హోదాకు స్థితికి తీరని ఆటంకమని స్త్రీ ముందు గ్రహించితేనే గాని అది తగని పని అని పురుషునికి నచ్చచెప్పలేదు. ఆర్థికముగా పేద వాళ్లల్లో బహు భార్యాత్వము ఒక్కొక్కప్పుడు తప్పని సరి అవుతుంది. ఒకడు ఒక్క స్త్రీని మాత్రమే పెండ్లాడి పొలములో పని సహాయము కోసము కూలి యిచ్చి యింకా యిద్దరిని పెట్టుకునే కన్న ముగ్గురిని పెండ్లాడటము ఆర్థికముగా సులభము. అందువల్ల బహు భార్యాత్వానికి లోబడతాడు. కాబట్టి స్త్రీలే తమ బాగోగులను తెలుసుకుని తెలివి తేటలు కలిగి ప్రవర్తించటానికి వాళ్లకు చదువు ఎంతైనా అవసరము. అప్పుడు తమను అధోగతి నుంచి రక్షించుకోగలుగుతారు. మొగపిల్లలు కలగకపోతే భార్య భర్తని మళ్లీ వేరొక స్త్రీని పెండ్లి చేసుకోమని బలవంతము కూడ చేస్తుంది. పుత్ర సంతతి కోసము తన అంగీకారమిచ్చి యీ విధముగా బహు భార్యత్వమును బలపరచటము ఒక ఆచారమైపోయింది. ఇటువంటి దురాచారాలకు తలవంచకుండ తమ గౌరవమును నిల్పుకోగల సామర్థ్యము చదువు వల్లనే స్త్రీలలో కలుగుతుంది. అప్పుడు సంఘములోని యే స్త్రీకిగాని ఆచారము పేరిట అన్యాయము, అవమానము జరగ లేవు. అసలు యీ దురాచారాలు అన్నింటికి స్త్రీల అవివేకమే కారణమనటముకూడ సరికాదు. ఎందు చేతనంటే పురుషులలోకూడ విద్యావిహీనులు చాల మంది వున్నారు. అందువల్ల అందరికి కూడ కొంచము కాకపోతే కొంచమైనను చదువు తప్పని సరిగా వుండాలి. సంఘములోని దురాచారాలను నిర్మూలించి సంస్కరించాలని యెప్పుడు ప్రయత్నించినా యిటువంటి విద్యావిహీనులే మొండికాలు అడ్డుపెడతారు. వాళ్లకు మతము ఆచారముల లోతుపాతులను గ్రహించగల సూక్ష్మ బుద్ధి వుండదు కాని ఆచార వ్యవహారాలను మారిస్తే స్త్రీల మీద తమ కున్న

ప్రభుత్వము ఎక్కడ వూడిపోతుందో అనే భయంతో యేవేవో మొండివాదనలతో సంఘ సంస్కారము మటుకు జరగనివ్వరు. విద్యావతులైన కన్యలు భార్య వున్న వరులను పెండ్లి చేసుకొనక పోవటము వారి కనీస ధర్మము. అదే విధముగ విద్యావతులగు స్త్రీలు యే విధమైన దురాశలకు లోనై తమ పిల్లలను భార్య వున్న పురుషుడి కిచ్చి పెండ్లి చెయ్య కూడదు. ఈ విధముగ బహు భార్యత్వమును నిరోధించటమే కాక విద్యావతులు తమ వివేకమును వుపయోగించి తోటి స్త్రీల కష్టములనుకూడ నివారించ కలుగుతారు. ఇట్లా కాక ఆశలకు లోనై యింకొక స్త్రీని వుసూరుమనిపించి బహు భార్యాత్వమును ప్రోత్సహించి నట్లయితే స్త్రీ జాతి గౌరవమునకే కళంక మాపాదించిన వాళ్లవుతారు.

ఇంక పరదా సంగతి. పరదా పద్ధతి యిప్పటికే నశించింది. ఇంక కొద్ది కాలములోనే సాంతము పోతుంది. కాని యింకా కొన్ని ప్రాంతములలోను కొన్ని జాతులలోను యీ పరదా పద్ధతి చాల యెక్కువగావుంటున్నది. పురుషుడు ఒక్కక్షణమైనా అనుభవించటానికి ఒప్పుకొనని పరదా పద్ధతిని మతము పేరిట ఆ యా జాతులలోని స్త్రీలు ఆజన్మాంతము అనుభవించి, బుద్ధి సూక్ష్మతను, ఆరోగ్యాన్ని, నీతిని పోగొట్టు కోవాలని వివేకవంతులైన స్త్రీలుగాని పురుషులుగాని యెవరు అనలేరు. స్త్రీ మన స్ఫూర్తిగ యథేచ్ఛగ సంఘసేవ చేసినప్పుడే మానవాభ్యుదయము కోసము ప్రతి రంగములోను స్త్రీలు నిరాఘాటముగాను నిశ్చింతగాను పాల్గొన వచ్చుననే ఆదర్శమును స్థాపించ కలుగుతుంది. అధికారము వుపయోగించి పని చేయుటయే యిష్టమైతే ఆ విధముగా ముందు చేయవలసిన పరదా దురాచార నిర్మూలనము. పరదా పద్ధతిని ఆమోదించే ముందు దానిని గురించి పురుషులు కొంచెము నిదానించి ఆలోచించాలి. పరదా వెనుక అణగిపోతున్న ప్రతి ఒక్క స్త్రీ యీ దురాచారాన్ని చైతన్యము తెచ్చుకుని ఎదుర్కోవాలి.

ఏకైక న్యాయ విధానము

వివాహము, విడాకులు, వారసత్వము, సంరక్షణ మొదలైన హక్కుల విషయములో ఒకే ఒక న్యాయవిధానము ఉండవలెనని చాల కాలమునుంచి నా అభిమతము. కొంతకాలము వరకు ఇది నిర్బంధశాసనముగ వుండ నక్కర లేదు. మొదటిలో ఈ విధానానికి ఇష్ట పడని వారు బద్ధులుకానక్కర లేకుండ ఏర్పాటు చేయవచ్చును. క్రమేపీ స్త్రీ పురుష భేదము లేకుండ జన సామాన్యము ఈ విధానమును ఆమోదించి అనుసరించినట్లయితే ఇది సుస్థిరము కాగలదు. దేశములో విద్య అభివృద్ధి చెందిన కొద్దీ, ఈ విధానము తక్కిన విధానములను అతిక్రమించి రద్దుచేయ కలుగుతుంది. దీని వలన ప్రస్తుతము జరుగుతున్న వివాదగ్రస్తమైన చట్ట సవరణల ఆవశ్యకత వుండదు. ఏస్వల్పమైన మార్పు తీసుకొని రాదలచినను స్థిరమవుతున్న అనవసరపు ప్రతిఘటన అంతరించగలదు. నిజంగా ఆలోచించి చూస్తే బూచివాళ్లంటే పసిపిల్లలకు ఎంత భయంగా వుంటుందో 'మత భ్రష్టత' అని

యెవరైనా ఒకరంటే సామాన్యజనులకు అంత కలవరం కలుగుతున్నది.

స్వదేశ వస్తువులనే వాడాలి

స్త్రీలు ప్రవేశించి చాల పని చేసిన, చేయబోతున్న కార్యక్షేత్ర మొక్కటి వున్నది. తమ దేశమును అభిమానించడము, ఆ దేశ ఆచార వ్యవహారములను గౌరవిస్తు ఆమోదించటము, దేశీయ నాగరకత, కళల ఔన్నత్యమునకు గర్వించటము, తమ వూరిలో, తమ దేశములో తయారయిన వస్తువులనే అభిమానించటము ఇవన్నీకూడ స్త్రీలలో సహజముగానే వుంటవి. అందువల్ల స్వదేశ వస్తువులు లభించే పక్షమున విదేశీ వస్తు బహిష్కరణ నియమము మనకు కష్టసాధ్యము కాదు. ఎప్పుడుకూడ యంత్రములతో తయారు చేసిన వస్తువుల కంటె చేతితో తయారు చేసిన వస్తువులు నాణ్యమైనవిగా ధర హెచ్చుగా వుండటము అన్ని దేశములలోను మనము చూస్తున్న విషయమే. నేను యిదివరకే ఖాదీ విషయమై చెప్పివున్నాను. అందులోవున్న ప్రాముఖ్యతను గుర్తించ వలసినదని మటుకు యింకొకసారి పునరుక్తి చేస్తున్నాను. ఖాదీ వుత్పత్తికి గాంధీజీ యిస్తున్న ప్రత్యేక విలువ, ప్రాముఖ్యత చాలవరకు వూరిలోని స్త్రీల మీదనే ఆధారపడి వున్నది. ఎందు చేత నంటే వాళ్లందరు పూనుకుంటేనేగాని సరిపడ, చేతితో వడకి యింట్లో నేసిన ఖాదీ వుత్పత్తి కాదు. ఖాదీలో వున్న అసలు విషయము తత్వము గనక అర్థమయినట్లయితే రోజు ఒక్క గంట సేపు నూలు వడకటము మనకు తప్పక అభ్యుదయదాయకమే గాక సరదా అయిన కాలక్షేపము అయి తీరుతుంది. మనము వడుకుతున్న ప్రతి ఒక్క పోగుతోడను తెగి విచ్ఛిన్నమై వక్రమైన మన జాతీయతను తిరిగి చక్కచేయ గలుగుతున్నామని గ్రహించ గలిగినట్లయితే రాట్నము పట్ల అభిమానము కలుగుతుంది. దీని సంగీతము మనసుకు హాయి కూరుస్తుంది. ఏది ఎట్లావున్నా గృహ పరిశ్రమల ద్వారా స్త్రీలకు చాల ఆర్థిక సహాయము వుంటుంది కాబట్టి మనము గృహ పరిశ్రమల అభివృద్ధికై ఎప్పుడు పాటుపడుతు వుండాలి. మనము మన దేశ పురోగమనాన్ని ఆశిస్తున్నాము. కాని పెద్ద పెద్ద యంత్ర సహాయముతో చేసే పరిశ్రమల ద్వారా అశాంతితో కల్లోలాలతో వుండే పాశ్చాత్య దేశాలవలెనే మన దేశముకూడ వుండాలని కోరవలెనా లేక అందుకు భిన్నముగానా అనే విషయము ఎవరికి వారే ఆలోచించండి. మానవుడి కష్టనష్టాలను తగ్గించటానికి మాత్రమే యంత్రాలను సృష్టించారు గాని వాటివల్ల మానవుడు చైతన్య విహీనుడైన కీలు బొమ్మగా తయారు కావాలని కాదు అనే విషయాన్ని మన మందరము గ్రహించినట్లయితే నిజంగా ఆ విధముగా మానవుని తయారు చేస్తున్న యంత్ర ప్రధానములయిన పరిశ్రమలను విసర్జించి మానవ కల్యాణదాయకమగు గృహపరిశ్రమలనే శక్తి వంచన లేకుండ వృద్ధి చేయగలము. *

* పై విషయమును వ్రాసిన తర్వాత శ్రీమాన్ నారాయణ అగర్‌వాల్ గారి గాంధీ సూచన (The Gandhian plan) చదవటానికి చాలసంతోషమైనది. నా సహచరులందరు దీనిని శ్రద్ధతో చదువవలెనని నా సలహా.

వలపు గెలుపు

శ్రీమతి వి. ఎస్. లక్ష్మి

ఇంద్రాదిదేవతలు నలరూపం ధరించి స్వయంవరమునకు వస్తారని దమయంతి వింటుంది. గుండె చెరువై పోతుంది. మర్నాడే స్వయంవరం. ఆ రాత్రి చెలికత్తె వసంతతో...

దమ—వంచే చేనుమేస్తే ఇంకేమి చెయ్యగలం వసంతా!

వసం—అవును దేవీ! ధర్మ విరుద్ధమైన వార్తయే విన్నాము.

దమ—రంభా ఊర్వశాది అప్సరలు సరిపోయారు కాదా ఈ దేవతలకు.

వసం—దేవీ! నీ సౌందర్యం ముందు రంభా ఊర్వశులు దిగదుడుపు అని చెప్పుట అతిశయోక్తికాదు. ముఖప్రియమునకై చెప్పిన మాటగాదు. దేవతల మారువేషధారణమే దీనికి తార్కాణం.

దమ—అందముగా ఉంటే పీడించుట ధర్మమా!

వసం—వైరాగ్యులగు పురుషులు అరుదు.

దమ—స్త్రీ సౌందర్యవతియగుట ఆమె దోషమా! వసంతా! ప్రకృతిలో ఎన్ని సౌందర్య వస్తువులు లేవు. శీతఉషస్సు, సంధ్యారాగము, వికసితపుష్పము, పున్నమిచంద్రుడు! స్త్రీ సౌందర్యముకూడా ప్రకృతి జన్యమే కదా!

వసం—సాధ్యముకాదు గనక గానీ లేకపోతే శీత ఉషస్సు, సంధ్యారాగమును పెరటిలో కట్ట గోరకపోదురో స్వార్థ మానవులు?

దమ—నా మనస్సు వికలమైపోవుచున్నది వసంతా! నలుడు కూడా నా అందమును చూసేనా ప్రేమిస్తున్నది! అది ప్రేమయా! మోహమా! శక్యమైనచో నా యీ దుర్భర తాపహేతూ భూతమగు సౌందర్యమును సమయింపజేసి అమాయా గ్రస్తులు ఇంద్రాదిదేవతల తీక్ష్ణదృక్కులకు గురిగాకుండా నా ప్రియుని నేను చేరకపోయెదనా! అయితే వసంతా నలునిది మోహమా! ప్రేమా!

వసం—దేవీ! విషమమగు ప్రశ్నయే వేసినావు. కాని ఒక్క విషయము. నలుడు నిన్ను చూడకుండగనే మనస్సునీపై లగ్నము చేసినాడు. గుణసంపదలను ప్రేమించిన నలుని, సౌందర్యకాముకులగు దేవతలతో జతపరుపకు దేవీ!

దమ—అవును నిజమే! నలునిది నిష్కల్మష నిష్కామ ప్రేమ. దేవతలు కామాంధులు!

వసం—సత్యము దేవీ!

దమ—అయిన దేవతల మాయా నలులనుండి మానవనలుని గ్రహించుటెట్లు!

వసం—అదే ఆలోచించుచున్నాను దేవి!

దమ—ఓ దేవతలారా! మీరునూ కామక్రోధాది అరిషడ్వర్గహిత స్వభావులా! మీరు నివసించు పుణ్యలోకములు స్త్రీలోలుర విహారములా! హా! విధీ. దేవతాపతులే మానవులను, అందులో అబలలను హింసింప జూచినచో ఇకవారికి రక్షణ ఎక్కడిది? ఈశ్వరా! ఈ దేవతాపతుల కుహనా కుతంత్రమునుండి విముక్తురాలనుచేసి నా హృదయాధిపతిని నాకు చూపవా! వసంతా! కళ్లు తిరుగుచున్నవి. తల దిమ్ముగనున్నది. నేను నా నలుని పొందు మార్గము చూపలేవా! దేవతల మోసమునుండి వెలివచ్చు మార్గము నాకు చూపవా!

వసంత—దేవీ-పోయి నిద్రింపుము! నీవు చాలా డస్సిపోయితివి. ఉపాయము కన్పించకపోదు. ఎంత మాయారూపము ధరించినను మానవులకూ దేవతలకూ భేదము లుండక పోవుగదా!

* * * * *

మర్నాడు స్వయంవరసమయ మాసన్నమౌతుంది. పలు దేశముల రాకుమారులు సర్వమణిమయ భూషణ భూషితాంగులై సభ నలంకరించియుండిరి. ఒక్కొక్కరి చేతిలో ఒక్కొక్క తామరపూవున్నది. ఒక్కొక్కరివద్దకే దమయంతి తీసికొనిపోబడుతూంది. ఒక్కొక రాకుమారుని పేరు రాజ్యముపేరు, వారి వారి శౌర్యసాహసాది సద్గుణ వివరములు ప్రక్కన వర్ణింపబడుతున్నాయి. దమయంతి ఒక్కొక్కరినే దాటిపోవుచున్నది. తలనైనను ఎత్తుటలేదు. ప్రార్థనా నిమగ్న హృదయయైనట్లు ఆమె ముఖము చెప్పుచున్నది. నలుని పేరు చదువుసరికి ఉలికిపడి పైకి చూచినది. నల్గురు నలులు ఒకేరూపములో ప్రత్యక్షమయినారు. గుండె దడదడ కొట్టుకొన ప్రారంభించింది. ముఖముపై ముచ్చెమటలు పోసినవి. శరీరము ఆపాదమస్తకమూ కంపించ దొడగినది. చేతిలో దండ దడదడలాడుచున్నది. కాని దమయంతి ముఖములో ఇసుమంతైనను విషాద సూచనలు పొడకట్టలేదు. ఆమె నల్గురు నలుల వైపునూ తీక్ష్ణముగా పరకాయించి చూచుచున్నది. ఒక త్రుటిలో ఆమె ముఖముపై మెరపు తీగ మెరిసింది. పెదవులపై చిన్న వికాసము తోచినది. వారిలో ఒక్కని చేతిలోని తామర పువ్వుమాత్రము కొంచెముగా వాడి వంగి ఉన్నది. ఆమె హృదయము స్థిమితపడింది. ముఖములో నూత్న వర్చస్సు గోచరించుచున్నది. ఇంద్రాది దేవత లొకరిపై పొకరు చూచుకొనుచూ దమయంతిలో కల్గిన నూత్న మార్పునకు హేతువులను వెదుకుకొనుటకు తికమకలు పడుచున్నట్లున్నారు. దమయంతి ఆనందాతిరేకముతో ఇంకనూ తీక్ష్ణముగా పరీక్ష చేసింది. తనకు స్ఫురించిన ఉపాయములన్నియూ ఉపయోగించింది. వారి కండ్ల వైపు తేర పారిచూసింది. కొందరి కనురెప్పలెంత సేపటివరకూ కూడా మూసికొనుటలేదు. ఆ పాదమస్తకమూ పరీక్షించింది. ఎక్కడా మార్పు కన్పించుటలేదు. ఆకారము సమానము. అంగసౌష్టవములో ఒక్క తీరుగానున్నారు. దుస్తులలో భేదములేదు. కాని కొందరి పాదముల బొటనవ్రేళ్లు మాత్రము ఆనియుండలేదు. కుహనా నలుల నల్గురి పాదములను ఒకదాని వెంట నొకటి తరచేగ దృష్టితో చూసింది. మానవ నలుని పాదతలమునూ పరీక్షించింది. తన తొలి యభిప్రాయము ధృవపడింది. ఆమె ముఖ వికాసము సహస్రకరదీప్తివంతమయినది. ఒక్క నిట్టూర్పు విడిచింది. గులాబిరేకులవంటి పెదవులపై మల్లెపూలవంటి చిరునవ్వులు కెరటాలవలె పొంగి పొరలాయి. తాపీగా గజగమనముతో ఒక్కొక్క అడుగునే కదలించి కుహనా నలుల నొక్కొక్కరివైపే దృష్టి సారించి మరల్చి దాటి వెడుతూంది. దేవతాధిపతుల ముఖములో కళకాంతులు సన్నగిల్లాయి.

దమయంతి ఒక్కొక్కరినే దాటిపోయి పాలనుండి నీటిని విడదీయు హంసవలె ముందుకుపోయి తన చేతిలోని పూలమాలతో మానవ నలుని కంఠసీమ నలంకరింపజేసింది. నలుని ముఖములో వెన్నెల అరబోసినట్లు తోచింది. మాయ నలులందరివ్వన మాయమయి పోయారు. సభ నలంకరించిన రాజపుత్రులు కరతాళనలో తమ ఆమోదము తెల్పారు. నల దమయంతుల పులకిత గాత్రములు వలపుగెలుపును ప్రకటించాయి.

సుదినం ★

రచన :
శ్రీ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

తెల్లవారింది. అంధకారమంతరించింది. తెల్లని వెలుగు ప్రపంచాన్నావరిస్తున్నది. కండ్లను మూసికొని నిద్రపోతున్న ప్రజలందరూ కండ్లు తెరిచారు. రాత్రి చూచిన చీకటి లేదు. మటుమాయమై పోయింది. వాళ్లంతా ఆ తెల్లని వెలుగును చూచారు. కండ్లను మిరుమిట్లు గొల్పుతోందా వెలుతురు. నీటి శయ్యపై విశ్రమించి మేల్కాంచిన తమ్ములన్నీ కూడా ఆ నూతనమైన వెలుగును చూచాయి. ఆ నవీనమైన గాడ్పులు వాటికి కూర్చిన ఆనందాన్నెవరు వర్ణిస్తారు ?

ఆ ప్రాతఃకాలం—ఆ వెలుగు—ఆ గాడ్పులు—ఆ పద్మముల నాశ్రయించియున్న ముత్యములు—ఆ ప్రకృతి—ఆ అంతా! ఇంకెందుకు ప్రకృతంతా! నూతనం! నవీనం! పురాతనపు అజ్ఞానాంధకారాన్ని నవీనమైన ఉదయజ్ఞాన భానుడి కిరణాలు రూపు మాపాయి.

తెల్లవారటంవల్ల అందరు లేచి ఎవరిపనులు వారు చేసుకుంటున్నారు. ప్రపంచమంతా లేచింది. కాబట్టి, నా వాడుకకు (అంటే ఎనిమిది గంటలయి, "కాఫీ అయిందిరా అబ్బాయీ" అనేదాక లేవకపోవటం) వ్యతిరేకంగా తొందరగానే మేల్కొనవలసివచ్చింది. లేచాను. నూతనమైన కళతోను, నూతనమైన శోభతోను వెలుగొందుతున్న మా వీధిని చూచాను. ఆ వీధి—పచ్చని మామిడాకు తోరణాలతోను, రంగురంగుల కాగితాలతోను — అక్కడక్కడ ఆకాశమార్గంలో "భారతమాతకి జై", మహాత్మాకి జై" అని వ్రాసి ఉన్నాయి. ఇలా నూతనశోభ వచ్చింది మా వూరికి.

ఇదంతా చూచాను. నాకేమీ అర్థం కాలేదు. ఎందుకీ యింత అలంకారం? అని అనుకున్నా. సరే ఏపాటు తప్పినా సాపాటు తప్పదు. త్రాగుడు కలవాటైన వాణ్ణి కాబట్టి (మన కాఫీయే లెండి) ఆ గుక్కెడు నీళ్లను త్రాగి వాకిట్లోకి రాబోయే సరికి "మూర్తీ మూర్తీ" అనే పిలుపు వచ్చింది. ఇతడెవరో కాదు. మా సహోధ్యాయి, వేణు. పెద్ద లౌకికరాయ కాబట్టి అతడి రాకకు కారణమడిగాను. "మన ఊరికి ఒకాయన వస్తున్నాడురా" అన్నాడు.

నేనతడితోటి ఆశ్చర్యంగా "ఒకళ్లేమిటి. ఎందరో వస్తారు. ఎందరో పోతారు. ఒకళ్లొస్తే ఏం ఇద్దరొస్తేఏం" అన్నాను.

"అది కాదోయ్ వెఱ్ఱి వెంకప్పా! ఎవరో వస్తారంటే మనకేం. అది కాదు. ఒకళ్లొస్తారంటే ఏ మాత్రం విశేషం లేకుండా అంటూమట్రా గాంధీజీ మద్రాస్ వెళ్లుతున్నాడు" అని అతడింకా పూర్తి చెయ్యకుండానే "మద్రాసు వెళ్లితే మనకేం లాభం? మన ఊళ్లో ఉంటేగా ఒక రోజైనా?" అని అన్నా.

"పూర్తిగా వినకుండానే నన్ను మధ్యలో ఆపితే ఎట్లా? గాంధీజీ మన ఊళ్లో ఆగట్టు. ఇక్కడికి రెండు మైళ్ల దూరంలో ఆగుతాట్ట."

"మనం వెళ్లాల్రా తప్పకుండా"

"తప్పకుండా వెళ్దాంరా. మన స్టూడెంట్సందరు వెళ్తారు"

అని కాలేజీ టైముకు మామూలుగా బయల్దేరదామన్నాడు. ఇప్పుడు తెలిసింది నాకు ప్రొద్దున చూచిన అలంకార దృశ్యాని కర్థం.

10 గంటలయింది. మా అమ్మ దగ్గరికి వెళ్లి "వంటయిందా? త్వరగా పోవాలి. గాంధీమహాత్ముడు వస్తున్నాట్ట. పోయి చూడాలి" అన్నా. మన అమ్మలందరు చెప్పే మామూలు వాక్యాన్నే మా అమ్మ పల్కింది. "అప్పుడే ఎలాగవుతుందిరా అబ్బాయి! ఇంకా తొమ్మిది కాలేదు కదా!" అని అంది.

ఎలాగైతేనేం భోజనం చెయ్యకుండానే వెళ్లాం. వేణు, నేను బయల్దేరాం. ట్రంక్ రోడ్ గుండా వెళ్దామనుకున్నాం. 'ట్రంక్ రోడ్' అంటే ట్రంక్ పెట్టెలుండే రోడ్డని కానీ ఏమీ కాదు. మన గ్రాండ్ ట్రంక్ రోడ్డన్న మాట. అక్కడ ఎక్కడ చూచినా జన సమ్మర్దంగానే ఉంది. అంగళ్లన్నీ మూయబడ్డాయి. ఎవరు మాట్లాడినా మహాత్ముని మాటే.

అందరు 'దేశసేవ'ను గూర్చి మాటాడేవారే. అందరు దేశసేవకులే. అందరు రాజకీయాన్ని గురించి ఉపన్యసించే వారే. అందరు రాజకీయ వేత్తలే. "దేశసేవ" అన్నా "రాజకీయం" అన్నా యీ రెండింటిలో ఏ ఒక్క దాని

కూడా అర్థం తెలీదు. కాని అందరు రాజకీయ వేత్తలే. అందరు దేశసేవకులే. గాంధీజీ అంటే ఎవరు? అతని తత్వమేమిటి? అనేది కూడా తెలియనివాళ్ళే చాల మంది. గాంధీజీ అంటే ఎవరో ఆంగ్లేయుడనో అతడే కార్యార్థిగానో హిందూదేశమునకు వచ్చేనని అనుకొనే వాళ్లుకూడా ఉండకపోరు మనలో. అంటే నీవూ, నేనూ అన్నమాట. నిరక్షరాస్యులనే గాదు. చదివిన వాళ్ళల్లోకూడ యిలాంటి వాళ్లున్నారు. కానీ అందరు అతన్ని గూర్చి మాటాడటం!

అడుగడుగు, అత్యుత్సాహంగా నడుస్తున్నాం. గమ్యస్థానం చేరవచ్చే కొద్దీ మరింత కుతూహలం—ఆయన్ని చూడాలని ఆశ. 11 గంటలయే సరికి మహాత్ముడాగే ప్రదేశాన్ని చేరుకున్నాం. గాంధీజీ అయిదు నిమిషాలక్కడ ఆగుతాడు. ఆయనుండేది క్షణమాత్ర మయినా అలంకారం మటుకు తక్కువ కాలేదు. రైల్వేరైలుకు ప్రక్కనే ఒక ప్లాట్‌ఫామ్ చెక్కలతో కట్టబడి ఉంది. ఆ ప్లాట్‌ఫామ్ పైన కొందరు స్థానిక కాంగ్రెస్ నాయకులు కూచున్నారు. అక్కడనే ఒక లౌడ్‌స్పీకర్‌ను అమర్చారు.—చాలా బాగా అలంకరించారు. కాంగ్రెస్ జండాలు ఆకాశవీధిలో ఎగురుతున్నాయి. వీటికితోడు అక్కడెవరో పెద్ద గొంతుకతో "కాంగ్రెసు జెండా" అనే పాటను పాడుతున్నారు. స్టూడెంట్స్ కాంగ్రెస్ అంతా హాజరైంది. ఇంకా వాలంటీర్లు చాలామంది వచ్చారు. వాళ్లందరు ప్రజలను వరసల్లో కూచోబెడుతున్నారు. ఇసుక వేస్తే రాలని జన సమూహం! ఆ దృశ్యాన్ని చూడే సరికి దైవారాధన కన్న మనుజారాధన ఎక్కువైందే అనిపించింది. నిజమే! దైవాతీతుడు కాబట్టే మానవుణ్ణారాధిస్తున్నారు. అక్కడ అందరి కంటె పల్లె జన మెక్కువ. అక్కడ మా సహోధ్యాయులు అందరూ హాజర్! అవును మరి ప్రపంచమంతా విద్యార్థులేగా. స్టూడెంట్సే దేనికైనా సమర్థులు. త్యాగం, దేశసేవ వారి ఆశయాలు. వారి (అంటే చాలా మంది) ఆశయాలు స్వార్థశూన్యం, పరార్థప్రధానాలైనవి. ఎవరున్నా ఉండక పోయినా వీళ్లుమటుకు మానరు.

ఇలాగే గల్లంతుగా ఉంది. సూర్యుడు తన పీఠాన్ని సంపూర్ణంగా ఎక్కాడు. అక్కడ్నుంచీ యీ అల్లర్నం ఆలకిస్తున్నాడు. తలలన్నీ ఎండలో మాడుతున్నాయి. కానీ కొందరు మాత్రము గాంధీటోపీలను పెట్టుకున్నారు. వారు ఖద్దరును ధరించటంవల్ల కాంగ్రెసు వారమనుకుంటారు. తల పైనున్న టోపీ వారికి ప్రధానం. లోనున్న ఆశయాలు, ఆలోచనలు కావు! సరే, ఎలాగైతేనేం 12 గంటలయింది—12-30 అయింది. అప్పుడే అక్కడున్న సిగ్నల్ చెక్క వంగింది. ఇక రైలొస్తోందిగదా అని పెద్ద గోల ప్రారంభమయింది. అందరికీ ఆ మహనీయుణ్ణి చూడాలనేగా! ఇంతలో రైలొచ్చింది. అక్కడ ఆగలేదు. అందరు ఆశ్చర్యపోయారు. అది ఢిల్లీ ఎక్స్‌ప్రెస్! మా కందరికీ నవ్వాగలేదు. మిన్నుముట్టిన ఆశలన్నీ ఒక్కసారి మంటి నంటాయి. చాలమంది ఉపన్యాసాలు, కొందరు పాటలు, కొందరు పద్యాలు అన్నీ పాడారు.

మళ్లీ రైలు శబ్దం అయింది. పొగలను చిమ్ముకుంటూ మెల్లిగా ఆ పొగబండి ఎప్పుడూ ఆగని చోట యీ దినం ఆగింది. అదే మరి! ఆ దినం నూతన వెలుగుతో వెలుగుతున్నదన్నానుగా! ఆ టెంపొరరి ప్లాట్‌ఫారమ్ ముందర ఆగిందా రైలు. ప్యారీలాల్ మొదలైనవారి సహాయాన ఆ మహనీయుడు రైలునుండి దిగాడు. ఆయన నిజంగా మహాత్ముడే! ఈ బిరుదు ఆయన కీయటంలో ప్రజ వెఱ్ఱిది కాదు. ఆయన యొక్క భౌతిక శరీరంకూడ పావనమైనదే. తెల్లని శరీర చ్ఛాయ—అధవళత్వముతో ఏకమయే ఆయన స్వదేశీ (స్వహస్తపు) దుస్తులు—ఆ తెల్లని సులోచనాలు అంతా పవిత్రత! "అఖిల పావన పుంజంబునబ్జభవుడు మెలగా వీనియందు నిల్పెంచె నొక్కొ"! ఆ మహాత్ముడు తన వాగమృతాన్ని మాకర్ణపుటములపై చిమ్ముతాడనుకున్నాం. కాని, మా ఆశ నిరర్థకమే అయింది. ఆయనేమీ లౌడ్‌స్పీకర్‌లో మాటాడలేదు. ఆయన ఆనాడు మౌనవ్రతదీక్షలో వున్నారు. ఆంధ్ర కేసరిగారు ఏవో రెండు మాటలు చెప్పారు. ఇంతలో మా పల్లెకాపులందరు ఆయనమీదికి తోసుకుంటున్నారు. అల్లకల్లోలమయింది. ఆయన తిరిగి, 5 నిమిషాలు కాకుండానే రైలెక్కారు. గార్డ్ పచ్చ జెండా చూపించాడు. అందరికి గార్డుమీద కోప మొచ్చింది. ఇలా అందరి ఆశలు తీరక ముందే మా దృక్పథంలోనుంచి తప్పించుకుపోయాడు.

భారత దేశపు భాగ్యం మా కండ్లలో పడటం—వెంటనే వెళ్లిపోవటం—రెండు ఒకే మాటు సంభవించాయి—

ఆయన మాటలు వినడానికి నోచుకోపోతేనేం?

మహనీయుని దర్శనభాగ్యం లభించింది... సుదినమే!

◎ ఆంధ్ర రాష్ట్రమునకు సుస్వాగతం! ◎

— ఎన్నడో? —

రచన:—శ్రీమతి లక్ష్మీరఘురామ్, బి. ఏ.

"వస్తున్నది, వస్తున్నది ఆంధ్రరాష్ట్రము"ని ఎన్నాళ్లనుంచో ఆశతో నిరీక్షిస్తున్నాము. ఆశ నిరాశ అయింది. భావ ప్రపంచములోని మేటి భవనములు కూలి పోయినవి. పౌరుషములు మొక్క పోయినవి. గౌరవము కృంగిపోయినది. మిగిలినది చప్పబడిన ఆంధ్ర మహాశయుల ప్రతాప గర్వము.

"అదుగో ఆంధ్రరాష్ట్రము కనుచూపు మేరలోవున్నది. ఒక్క గంతువేసి ఎగిరితే చాలు అందుతుంది" అని అంటు



న్నారు సర్వము తెలిసిన మేధావులు. మన కట్టి సత్తువే వుంటే ఆ నాటి సైమన్ కమిషన్ రోజుల్లోనే ఆ నోము నోచుకుని వుండేవాళ్లము. గతజల సేతుబంధమేల? ఇప్పుడు ఏది యుక్తము? ఒక్క గంతువేస్తే అతి సులభముగా మనకు మన రాష్ట్రము లభిస్తుందా?

దత్తమండలాల వారితో తగవులు వృధా కాలక్షేపము. ఎవరికి వారేయమునా తీరే అని వాళ్లు వత్తి వత్తి చెపుతు వుంటే ఎందుకు మనకా బలవంతపు బ్రాహ్మణార్థము. ఆంధ్రులంటే దేశ భక్తులు, దేశ గౌరవ స్వాతంత్ర్యముల కొరకు సర్వము అర్పించిన త్యాగులు. కాని యీ త్యాగము యొక్క ఫలమును అనుభవించ లేని స్థితిలో వున్నారు. ఆంధ్రులు త్యాగులైతే కావచ్చును. కాని తనకుమాలిన ధర్మము మొదలు చెడ్డ బేరము గదా!

కాని ఆంధ్రుడా! మద్రాసు మనదని మరచావా? "వస్తే వచ్చింది, లేకపోతే పోయింది" అని నోరుజారి అంటివా? విసుగెత్తి అరవలతో కయ్యము విరమించుకున్నావా? ఉన్నత భావములైతే ఆకాశ వీధుల పరుగులెత్తుతున్నవి. కాని చంచల చిత్తమువల్ల క్రియ శూన్యము అవుతున్నది. మాటలు కోటలు దాటును గాని...అన్నట్లుంది మనస్థితి. "ననిగబేసు" అనువారు ఒకప్రక్కన "ఎనకు ఎంగ" అనువారు మరొకప్రక్క వుక్కిరి బిక్కిరి చేస్తుంటే ఎట్లాగైనా తప్పించుకోవాలని ఆలోచనలో పడి స్వరాష్ట్రము సంగతి మరవటము భావ్యము కాదు సుమా. త్వరలో ప్రతాపములు బయట పడబోతున్నవి. జరిగిన అన్యాయము, అమర్యాదలు మరవకూడదు. సమయము మించిన లాభము లేదు.

ఆంధ్రరాష్ట్రము యిప్పటివరకు దూరాన వుండి పూరించింది. ఇప్పుడిప్పుడే కనుచూపులోనికి వస్తున్నది. ఇప్పటికైనను అనాదరమునకు కినుక వహించి వెనుదిరిగి పోక ముందే జాగ్రత్త పడి ఆమెకు హృదయ పూర్వకమైన సుస్వాగత మిచ్చి తోడ్కొని రావటము ఆంధ్రుడి విధి.

ఎల్లోరాలోని శిల్పశోభ

★

రచన: శ్రీమతి పి. రమణమ్మ

[సేవాగ్రామంలో శిక్షణ [illegible]దయుచున్న ఆంధ్ర విద్యార్థినులకు శ్రీమతి ఆ[illegible]దేవిగారితో అజంతా ఎల్లోరాల యాత్ర సలిపే భాగ్యం లభించింది. ఫిబ్రవరి సంచికలో శ్రీమతి రమణమ్మగారు అజంతాలోని కళాసౌందర్యమును వర్ణించి "మకబరా" చేరేటంతవరకు వ్రాసారు. ఆ తరువాయి గాథ యిది.]

మకబరాకు నాలుగు మీనార్లు వున్నాయి. అవి ఎక్కితే ఔరంగాబాద్ అంతా కనిపిస్తుంది. నాలుగు ప్రక్కల ఉన్న ప్రకృతి నాలుగు రకాలుగా ఉంది. ఒక ప్రక్క చక్కటి పచ్చని తోటలు, ఒక ప్రక్క కొండలు, ఒక ప్రక్క ఎడారి మాదిరిగ ఉంది. ఒక ప్రక్క పట్టణము, తోటలో కొలనులు, ఫవ్వారాలు (ఫౌన్‌టెన్‌లు) పూలమొక్కల వరుసలు అచ్చు "పుకార్"లో చూచిన ఉద్యానవనములాగవున్నది. అజంతా, ఎల్లోరాలను చూచిన తక్షణమే ఈ మకబరా చూచే అవకాశము కలిగింది. అందువల్లకూడా విభిన్న యుగములలోని కళానుభూతులు ఒక్క సారి హృదయమును ఉప్పొంగించాయి. మకబరాకు దగ్గరలోనే గుహాలలో కొంత శిల్పముంది. ఈ రెండు యుగముల కళలు శిల్పములు ఒకదాని ప్రక్కన ఒక్కటి నిల్చి మూగ భాషలో యీ క్రమ వికాసము యొక్క ఇతిహాసమును తెల్పుచున్నాయి.

ప్రాచీన కాలములో మొగలులు వాడే పాత్రలు, పళ్లెములు మొదలైన కొన్ని సామానులు చూచాము.

అజంతా, ఎల్లోరాలలోని శిల్పములను చూచిన తరువాత ఔరంగాబాద్ గుహాలలోని శిల్పకళ అంత బాగనిపించదు. కనుముక్కు తీరులలోను, శరీరసౌష్ఠవములోను అంత కళ చూడలేము. గుహాలను, మకబరాను చూచి "పేనుచక్కి" చూచాము. అక్కడ కోనేరులలో రంగు రంగుల చేపలను పెంచుతారు. ఇదికూడ చాల బాగుంది.

ఔరంగాబాద్ గుహాలలోని విగ్రహములుకూడ బుద్ధునివే. అక్కడకూడ స్థూపములు లేవు. రాయి గట్టిది కాక పోవటమువల్ల అన్నీ శిథిలమై పోయినవి.

మరునాడు దౌలతాబాద్ మీదుగా ఎల్లోరాకు బైలుదేరాము. దౌలతాబాద్‌లో కొండమీద కోటను చూద్దామనుకున్నాము కాని అవకాశము చిక్కలేదు. ప్రక్కనుంచి వెళ్లుతూంటే కొండమీద ఉన్న ఆ కోట దానిలో అమర్చినట్లు కనిపించింది. కొండనే తొలిచి కోటగా చేశారు.

ఎల్లోరా చేరే సరికి తొమ్మిది, పది అయింది. బస్సు దిగిన చోటికి ఎల్లోరా గుహాలు రెండు ఫర్లాంగులుంటాయి. వెళ్లగానే ముందుగా 16 వ నంబరు వేసి ఉన్న గుహను చూస్తాము. దానిని కైలాస పర్వతమంటారు. ఎల్లోరా గుహాలలో కల్లా అదే ముఖ్యము.

ఇక్కడ రాయి నల్లరాయి. కొండలను నిలువున చెక్కి దేవాలయముగా మార్చి వేశారు. దేవాలయము లోపల చుట్టు ఏనుగులను సింహములను వాటి పోరాటమును ఎంతో సజీవముగా చెక్కారు. ఏనుగు సింహము యొక్క నడుమును తొండముతో చుట్టి తన పర్వతము వంటి శరీరముతో అణిచి వేస్తూఉన్నది. సింహము త్వరితవేగముతో ఎగిరి ఏనుగు యొక్క కుంభస్థలమును పంజాతో చీల్చుటకు ప్రయత్నిస్తుంది.

రంగులేకుండానే శిల్పాలు నల్లరాతిలో ఇన్ని భావములు, ప్రవృత్తులు చూపకలిగారు. ఒక చోట రావణుడు కైలాస

పర్వతాన్ని, తన యావచ్ఛక్తిని వినియోగించి ఎత్తుతున్నాడు. కైలాసములోని జీవులన్నీ అదరి పోయాయి. పాపము పార్వతి కంపించిపోయింది. ఈశ్వరుడు ఒక చేతితో పార్వతిని అనునయిస్తూ రెండవ చేతితో అభయమిస్తున్నాడు. కైలాస పర్వతమును కదలకుండా కాలి బొటనవ్రేలితో నొక్కి పెట్టాడు. ఆ వూపుకి కొందఱు బోర్లపడ్డారు. కొందఱు పరుగెత్తుతున్నారు. కొందరు భీతితో, భక్తితో ప్రార్థిస్తున్నారు. పాపము రెండు కోతులున్నాయి. ఒకటి భయముతో వక్కి యీశ్వరుని పాదముల దగ్గర కూర్చొని ఉంది. ఒకటి ఒక కొమ్మ పట్టుకొని పడలేక పారిపోలేక కంపించిపోతూంది. అప్పుడు దాని ముఖము చూచి తీరాలి. అసలే కోతి ముఖము గదా? పాపము భయమువల్ల పొట్ట జానెడు లోతుకు దించుకుపోయింది.

ఇంకొక చోట నటరాజు ప్రళయతాండవము చేస్తున్నాడు. ఆ తాండవ నృత్యము చూస్తే నిజంగా అడుగుల చప్పుడులు, ఢమరుధ్వనులు వినిపిస్తునట్లే భ్రమిస్తుంది మనస్సు. అడుగులో నృత్యము ప్రళయము తాండవిస్తూంది. ముఖములో శాంత భావము విరజిమ్ముతూంది. నృత్యము చేస్తూన్నప్పుడు వెన్నెముక కండలోని వొంపులను ఎంతో చక్కగా కనపరచారు.

ఒక చోట దుర్గ మహిషాసురుని మర్దిస్తూంది. మరొక చోట నృసింహుడు స్థంభమును చీల్చుకొని వచ్చి హిరణ్యకశిపుని గోళ్లతో చీలుస్తున్నాడు. ఒక చోట మేనక విశ్వామిత్రుల తపస్సును విడిచి పోవునట్లు చెక్కి ఉంది. గంగ, యమున, సరస్వతుల విగ్రహములను చూచి తీరాలి. ముఖములో ఎంత సౌకుమార్యము కనపడుతూందో. ప్రతి అంగము ఒక సంపూర్ణకళ. ఒక దగ్గర సరస్వతి పాదముల దగ్గర వ్యాసపీఠము మీద తాళపత్రమును పెట్టి ఒక అమ్మాయి చదువుకొంటూంది.

ఇక్కడ 30 గుహలు శిల్పసౌందర్యములతో నిండి ఉన్నాయి. బౌద్ధ, శైవ, జైన శిల్పములు అన్ని గుహలలో చూస్తాము. జైనమహావీరుడు తపస్సు చేస్తూంటే తీగెలు వల్లగా కొండె చెట్లు కొని అతని మీదకు పోతూన్నాయి. తీగలల్లు కొన్నాయి. శరీరమంతటా పాములు పోరాడుతున్నాయి. పుట్టలు పెరిగిపోయాయి. కాని అతని ముఖములో శాంతి కరగలేదు. జైన విగ్రహములన్నీ దిగంబరములే కాని వెగటనిపించవు. అదే కళ యొక్క ఆత్మ. వికారము లేని సత్యమును చూపిన కళే 'సత్యం, శివం, సుందర'మని పిస్తుంది. జైన మహావీరుడు ఉన్న గుహలోనే ఒక విగ్రహముంది. దాని వెనక ఒక గున్నమామిడి కాయలతో, ఆకులతో, నవనవలాడుతూంది. పనస చెట్టున పనస కాయలు వ్రేలాడుతున్నాయి. రాతిలో జీవము పోశారు శిల్పులు. వీటిని చూస్తేనే రాతిలోకూడా ప్రాణముందని పిస్తుంది. 16వ నంబరు గుహలోనికి వెళ్లకపోయేముందే ద్వారము దగ్గర నాగరాజు భార్య నిల్చొని ఉన్నారు. ఆ రెంటిలోను విద్యా వైభవములతో ఒప్పారు తీవి ఒలుకుతూ ఉంది. ముఖ్యముగా అక్కడ స్థంభములలో ఉన్న నగిషీ చూడవలసినదే. అక్కడ గుహలు అంతస్తు లంతస్తులుగా ఉన్నాయి. అన్ని అంతస్తులు నిజముగా శిల్పములతో ఒప్పారు కైలాసములే. ఇంత అందముగా ఉన్న శిల్పములలో యే ఒక్కటికూడ అన్ని అంగములు చెక్కుచెదరక వున్నది లేదు. ముఖ్యముగా ఏ ముఖములోను ముక్కులు మిగలలేదు. ఈ శిథిలానికి కారణము మత కలహములు. మూడు మతముల సంఘర్షణ ఈ గుహలలోని కళా శిథిలత్వాన్ని చూస్తే బాగా అర్థమౌతుంది. ఒక చోట బుద్ధుని చెక్కి శివునిగా, ఇంకో చోట శివుని చెక్కి శక్తిగా చేశారు. మానవ హృదయము ఎంత సుకుమారమై కళా స్వార్థము విశాలము అనదో, మత విషయము వచ్చినప్పుడు అంత కర్కశత వహిస్తుంది. శిల్పములు, కళలు మొదలైన లలిత కళలన్నీ మతావేశములోనే పుట్టి పెరిగి విస్తృతిని పొందేయి. మళ్లీ వాటి దుస్థితికికూడ మతావేశమే కారణము. అజంతా గుహలు చిత్రకళలకు, ఎల్లోరాగుహలు శిల్పములకు ప్రాధాన్యములు. ఒక స్థంభమునకు ఉన్న నగిషీ, డిజైన్లు, మరొక దానికి లేవు.

అజంతాగుహలలో రంగుల ద్వారా మానసిక భావాలను ఎంతో చక్కగా చూపేరు. బుద్ధుని దయ, కరుణ, ప్రేమ, సహనశీలత, ఔదార్యము వాటివల్లే బాహ్య, ఆంతరిక శత్రువులను జయించు ఆత్మశక్తినే ప్రధానముగా చూపేరు.


కాని ఎల్లోరాలో శరీర బలమునుకూడ ఎక్కువ చూపేరు. అజంతాలో సింహములవంటి క్రూర జంతువుల ముఖములలో కూడ దయ, సేవ, కరుణ మొదలగు సద్భావములనే ప్రస్ఫుటము అగునట్లు చిత్రించారు. ఎల్లోరాలో శివుడు, నరసింహుడు, దుర్గ మొదలగు దైవముల ముఖములలో, భక్త రక్షణ భావమునే గాక, దుష్టుని అణచివేయుదమనే భావమునుకూడా ఒకేసారి, ఒకే ముఖములో ఈ భావ సంఘర్షణను నల్లరాతిలో చెక్కి చూపేరంటే ఎంత నైపుణ్యము వుండాలి.

అజంతా ఎల్లోరాలోని కళలు సత్యాన్వేషణములో వెలుబడ్డాయి. బౌద్ధ, పౌరాణిక ప్రవృత్తులు వేరైనా ఆ యిద్దరి శిల్పములు, ఆ శిల్పములకు గ్రహించిన సాధనములు ఒకటే. అవి ఒకే సత్యమునకు కొనిపోయే లక్ష్యములు. నేడు యీ శిథిలావస్థలో ఉండికూడ ఆ కళలు మానవ హృదయమును ఆటే కొనిపోవుచున్నవి. ఔరంగజేబు కట్టించిన మకబరా అతని వైభవమును, భార్యయందలి అభిమానమును తెల్పుచున్నవి. దానిలో ఉన్న శిల్పము మానవ హృదయమును తృప్తిపరచనిదైనను సత్యమునకు సంబంధించినది కాక పోయినను నేటి వాటి దుస్థితి సత్యమునే తెల్పుతూంది. మకబరాలోని ఔన్నత్యము, వైభవము మా వైభవము నేడేమంది, అది ఆ ఆలంగీర్ తోనే వెడలిపోయింది అంటున్నట్లుంటుంది. కాని అజంతా ఎల్లోరాలలోని శిల్పము ఆ కళలు నేటికిని ఆ ప్రకృతి ఒడిలో ఆ సత్యమునే మేము నేటికిని చూపుతున్నాము, మాకు నాశనమేమిటి అను నట్లుంటుంది. అజంతా ఎల్లోరాగుహలు కొన్నివేల సంవత్సరముల క్రింద చెక్కబడి ఉన్నప్పటికి లోభాగములలో నేటికిని చెక్కుచెదరలేదు. కాని మకబరా, దానికి ఎదురుగా భవనములు, లోభాగములు, బీటలువారి ఉన్నాయి అక్కడక్కడ. ఎల్లోరాలోకూడ ఒక చిన్న జలప్రపాతము 'సౌవ్వారా' ఫౌన్ టెన్ మాదిరిగా పడుతూంది. ఇక్కడి ప్రకృతి దృశ్యములుకూడ అందమైనవే కాని అజంతా అంత కాదు.

ఎల్లోరాగుహలలో మాతో ముగ్గురు తెలుగువాళ్లు విద్యార్థులు కలిశారు. వారి పరిచయము చేసుకున్నాము.

ఈ విధముగా దీపావళి సెలవులలో దివ్య కళా వైభవములను చూచుకొని వారమురోజులకు మరల సేవాగ్రామమునకు బయలుదేరాము. 13 వ తేది రాత్రి 8 గంటలకు సేవాగ్రామము చేరుకున్నాము. ఇంత ప్రయాణము చేసినా సామూహికముగా స్వయం సేవకత్వము వహించటంవల్ల భోజన ఖర్చులతో సహా మా ప్రవాస ఖర్చులు రాకపోకలకు 21-0-0 లు అయాయి. రైలు బండ్ల ఖర్చు తప్ప ఒక కూలీనికూడ పిలవలేదు.

★



మల్లమదేవీ మహిళా మందిరము

★

బొబ్బిలి రాణీవారి ఏభై వేల రూపాయల విరాళముతో కట్టబడుచున్న ఆంధ్ర మహిళాసభ హాస్టలు.

★

భగవదనుగ్రహమువలన ఆంధ్ర మహిళాసభ నూతన భవనాలు జూలై నెలకు పూర్తి అయి ఆగస్టులో గృహ ప్రవేశమహోత్సవం జరుగుతుంది.

ఈలోగానే మా విద్యా కళా పారిశ్రామిక శాఖల నభివృద్ధిచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ శాఖలలో విద్య నభ్యసింపగోరు స్త్రీలు వివరములకు మాకు వ్రాసితెలుసుకొనవచ్చును.

మల్లమదేవీ మహిళామందిరము (హాస్టలు)లో యితర కళాశాలలలో విద్య నభ్యసిస్తున్న స్త్రీలకు గూడా ప్రవేశము గలదు. వారు మా సభ నిబంధనలకు లోబడి రోజుకు ఒక అరగంటయైనను పారిశ్రామిక శాఖలో పనిచేయుట కంగీకరించాలి.

దుర్గాబాయి

ప్రధాన కార్యదర్శిని

ఆంధ్రమహిళ

శ్రీ ఇంకొల్లు వెంకటేశ్వరరావుగారు

సీ॥ ఐతమ్మసుతునిగాఢాలింగన మొనర్చి
వీరధర్మము వినిపించునాడు
ఖడ్గంబునందిచ్చి కరుణతో మాంచాల
భర్తనాలమొనర్ప బంపునాడు
కవ్వించి నాగమ్మ కదనభూములలోన
సైనికులకు ముందు సాగునాడు
పేరమ్మదిక్కులు పిక్కటిల్లగ వేగ
పితృపాదు నలిగి శపించునాడు

తే॥ తెనుగురుధిరంబు నాత్మల తీవరించి
వనితలెల్లరుబరిమీద కొరగిమిన్న
మన్న తాళంబు వైచి పేర్గన్ననాడు
హాడలుబుట్టించెజగతిని ఆంధ్రమహిళ ॥

సీ॥ మగడు యుద్ధములోన మగిడిరా చానమ
తెచ్చి కుంకుమ పసుపిచ్చునాడు
పరిపంధిబలముల బాధించిరుద్రమ
నేలనాల్గుచెరంగు లేలునాడు
శీలసంపద చెక్కుచెదరకుండుటకునై
పోరి మల్లమ బలిపోవునాడు
గండికోట రణోర్వదండు పైగోవింద
మాంబ రోలలాట లాడునాడు

తే॥ గుండె చేజేత మనుబోతు గోచియవ్వ
పుచ్చుకొనిపోయి మాడచిపోరుచున్న
బాలచంద్రునకిడ చారబట్టునాడు
హాడలు బుట్టించె జగతిని ఆంధ్ర మహిళ ॥

ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

స్థాపితము 1923.

హెడ్డాఫీసు: మచిలీపట్టణము

అధికారము పొందబడిన మూలధనము: ఒక కోటి రూపాయలు.

చందా వేయబడి, జారీచేయబడిన మూలధనము: ఇరువదిలక్షలు.

చెల్లింపబడిన మూలధనము: పదమూడులక్షలు.

రిజర్వుఫండు: రెండులక్షలు.

డిపాజిట్లు: రెండుకోట్ల, ఇరువదిరెండులక్షలు.

అమలులోనున్న వ్యాపారము మొత్తము: మూడుకోట్ల రూపాయలు.

బ్రాంచీలు, సబ్ ఆఫీసు:

మదరాసు, బాంబే మ్యూచుయల్ బిల్డింగు,

378, ఎస్ప్లనేడు.

సికిందరాబాదు: మెహతామహల్, జేమ్సువీధి.

మచిలీపట్టణము, నెల్లూరు, తెనాలి, గుంటూరు, బెజవాడ, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరము, బరంపురం (గంజాం), ఒంగోలు, చీరాల, దుగ్గిరాల, నరసరావుపేట, వినుకొండ, బ్రాడీపేట (గుంటూరు), గవర్నరుపేట (బెజవాడ), గుడివాడ, పాలకొల్లు, భీమవరం, సామర్లకోట, రామారావుపేట (కాకినాడ), పిఠాపురం, తుని, అనకాపల్లి, శ్రీకాకుళం (విశాఖ).

ఫిక్సెడ్ డిపాజిట్లు: నూరురూపాయలకు తక్కువగాని మొత్తములను, 3, 6, 12, 24 మాసములకు అన్ని బ్రాంచీలలోను తీసుకొనబడుచున్నవి.

3 సంవత్సరముల క్యాషు సర్టిఫికెట్లు, యీ బ్యాంకులో ప్రత్యేక సౌకర్యము.

అన్నిరకముల చెక్కులు, డ్రాఫ్టులు, డివిడెండ్ వారంట్లు, హుండీలు, వసూలుచేసి పెట్టబడును.

గవర్నమెంటు పత్రములు, పేర్లుకొనుట, అమ్ముట మొదలగు వ్యాపారములుకూడా చేయబడును.

వివరములే ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

వాశణాశి కృష్ణమూర్తి,

ఎం. ఏ., బి. కాం, యల్. యల్. బి., సి. ఏ. ఐ. ఐ. బి.,

జనరల్ మేనేజరు.

బీభత్సాన్ని తొలగించి శాంతిభిక్ష పెట్టగల

స్త్రీమూర్తి

యూరపునుంచి, ఒక యుద్ధవిలేఖరి యిలా రాస్తున్నాడు.

'యుద్ధము జరుగుతూవున్న ఒక స్థలానికి, వెనుకగా బాంబులతో హతమైన ఒకవూరిలో, ఒక స్త్రీ మూర్తి తనయింటి సెల్లరులోనుంచి పైకివచ్చి, పూర్వము తనయింటి వాకిలిగావున్న స్థలాన్ని చీపురుతో తుడుస్తోంది. యుద్ధములో పాడుపడిన వూళ్ళన్నింటిలోను, చీపురుతో స్త్రీలు ప్రత్యక్షమవడము, సర్వసామాన్యమయిన దృశ్యముగా మారిపోయింది. నేల మట్టమైన ప్రతి డచ్చి పల్లెలోను ముసలి మొగవారు బాంబులుచేత గుండ్లచేత, గుండ్లుపడిన వారివారి పొలాల్లో, దిక్కుతోచకుండ, నిల్చునివుంటే స్త్రీలు వారి యింటికి గడపలు అనుకునే స్థలాలను చీపుర్లతో తుడిచేవారు. ఒక్కొక్క స్త్రీ పడిపోగా మిగిలి పోయిన, ఒక్కొక్క తీగెకు, పోటింపులు పెట్టుకుంటోంది. ఒకవూళ్ళో ఒక స్త్రీ తన చిన్న పెరడు అనుకుంటున్న స్థలములో రాళ్ళను చీపుళ్ళతో తుడుస్తూంది. ఎవరో ఆవిడను "ఏమమ్మా, రెండువేల పౌనుల బాంబుల్తో వూరిని నేలమట్టం చేయగా నీవేమి బాగుచేస్తున్నావు అని అడిగారు.

"నేను కాకపోతే యెవరుచేస్తారు. నా కాబేజి మొక్కలను వుల్లిపాయల మొక్కలను కాపాడుకోవాలి. ఈ పంటే నాకు మిగిలింది. చెమటోడ్చిన శ్రమ ఫలితము యిది" అని కోపముగా జవాబిచ్చినది. ఇదిగాక, యెవరో వొకరి తుడుపును, మొదలెట్టాలి. ఇంకొకవూరిలో ముసలమ్మ వొకతె తన గొడ్లపాకను తుడుస్తోంది. ఎనభైమైళ్ళ దూరంలోగా ఒక జంతువు గూడ లేదు. రైతు గుడ్లప్పజెప్పి చూస్తున్నాడు. కాని వాని భార్య, ఆ గందరగోళంలో తుడుస్తోంది మళ్ళీ జీవితం కొత్తగా మొదలెట్టడానికి.


శిథిలాలైన పెద్ద పెద్ద పట్నాలను నగరాలను యీ చిన్న చిన్న యింటి చీపుళ్ళతో తుడవడం కష్టసాధ్యమైనదేకాని యెక్కడా యుద్ధముచేత చిందరవందర అయిన ప్రదేశాలకు బుల్‌డోజరులు (పెద్ద పెద్ద, అడ్డంకులు, అవలీల అవతల వుంచే పెద్ద మోటారు(ట్రక్కు..)) వచ్చి, సైన్యం కోసం త్రోవ చేసేలోపల స్త్రీలు స్వభావసిద్ధంగా, తమ చీపుళ్ళతో మగవాళ్ళుచేసిన యీ బీభత్సాన్ని తుడవడం మొదలెడతారు. ఈ మాటు వారు బాగుచెయ్యగలరనే నమ్మకం లేదు. అయితే యీరోజు యూరపుదేశంలో మగవారికంటె స్త్రీలు ఎక్కువగా వున్నారు. యుద్ధములో చనిపోయిన సైనికుల భార్యలు, శత్రువులచేత జిక్కి చంపబడ్డ పురుషుల భార్యలు, క్రిందటి యుద్ధములో సైనికుల భార్యలు తప్పక యీ ఘోరాన్ని బాగు చెయ్యడానికి ప్రయత్నిస్తారు.

అనువాదం : శ్రీమతి కామరాజు మైత్రేయిగారు

పారిస్‌లో జర్మనులచేత చిక్కి చనిపోయిన వారి భార్యలందరు కలిసి ఒక సంస్థను స్థాపించుకున్నారు. ఈ సంస్థకు ఒక అందమయిన పిల్ల అధ్యక్షురాలు. ఆవిడ "భవిష్యత్తుకు మనమే కర్తలము. మనము యీ కర్తవ్యాన్ని మన వెనుక సంతతికి వదలివేయరాదు. వారు మనము పడిన గొప్ప కష్టాలను, మనము చూచినట్టి గొప్ప బీభత్సాలను చూడలేరు. అనుభవించలేరు." అని అన్నది.

అంతర్జాతీయ ప్రణాళికలు అమలు జరుపు సభలకి, మొదటిమాట స్త్రీలను పేర్కొనడము ప్రమాదవశాత్తున కాదు. ఇంకా యెక్కువమంది స్త్రీలు వుండాలి. ఎంచేతనంటే ఎక్కువమంది యుద్ధములో వున్నారు. కృషిచేశారు. కొన్ని వేలమందికి చీపురుతప్ప యింకేమి మిగలలేదు కూడాను. ఎందుచేతో స్త్రీలు యిపుడు ఈ నాశనము నష్టము విషయమై చాల చికాగుగా వున్నను పురుషులకంటే వీరు మెరుగుగా చేస్తారా? అనేది వేరు ప్రశ్న. కాని యిప్పుడు జరిగిన యీ అనర్థముకంటె ఎక్కువ అనర్థము తెచ్చిపెట్టలేరు కదా!

★



స్త్రీలు - భావకవిత్వము

ప్రకృతి జడమని కొందరు, అజడమని కొందరు, జడాజడమయమని కొందరూ అంటారు. ఎవరేవిధంగా భావించినా అది రసమయము, లావణ్యమయము, అమృతమయమూ అని నా అభిప్రాయము.

ఆ ప్రకృతిని సరిగా కరికించే ఎట్టి స్థాణువైనా ఒక్కసారి చలించి, పులకరిస్తుంది. ప్రతి జీవాణువు ప్రకృతి బద్ధమై ఉంది. అది లేకుంటే, ఆనందము, సృష్టి లేదు. నిఖిల రసాత్మకమైన ఈ ప్రకృతిని ఆరాధింపని వారంటూ లేరు.

స్త్రీ అట్టిది.

పాకకళలో పరిపూర్ణ పుష్టిని పొంది, సకల శక్తులూ సంపాదించిన ఆమె హస్తము కవిత్వ కళలో కూడా కావలసినంత అమృత సిద్ధిని కాంచినదని చెప్పాలి.

వస్తువు, వర్ణన, శబ్దము, ధ్వని, అలంకారము మున్నగునవి ఒక్కొక్కటి ప్రధానంగా కవిత్వం అనేక విధాలుగా ఉంది. ఇందులో భావమూ, ధ్వనీ ప్రధానమైనది ఉదాత్తమన్నారు పెద్దలు.

ఈ విషయంలో సంస్కృత కవయిత్రులు భావబలాన్నే బాగా అవలంబించారు.

మారుల—

గోపాయంతీ విరహజనితం దుఃఖమగ్రే గురూణాం
కిం త్వం ముగ్ధేనయన విసృతం బాష్పపూరం బుణత్సి
నక్తం నక్తం నయన సలిలై రేష ఆర్ద్రీకృతస్తే
శయ్యోపాంతః కథయతి దశామాతపే శోష్యమాణః

ముద్దరాలా, ప్రతీరాత్రీ కన్నీటిచే ప్రక్కలు తడిసి ఎండిపోతూన్న నీ పానుపే నీ విరహాన్ని తెలియచేస్తూంది. పెద్దల దగ్గర విరహదుఃఖాన్ని మాటు పరచి, కన్నీటి కెరటాల్ని నిరోధిస్తున్నావెందుకు ?

మోరిక—

ప్రియతమస్త్వ మిమా మనఘార్హసి
ప్రియ తమాచ భవంత మిహార్హసి
నహి విభాతి నిశాకరహీతః శశి
నచ విభాతి నిశాసి విహేందునా.

ఓ అనఘుడా, నీ వామెను గాఢంగా ప్రేమించావు. నిన్ను కూడా ఆమె అల్లాగే ప్రేమిస్తూ

సారస్వత గోష్ఠి * శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు

ఉంది. కావున, మీ యిద్దరికీ బాగుంది. రాత్రి లేక చంద్రుడు, చంద్రుడు లేక రాత్రి శోభించవు కదా.

ఇంకా

యామీత్యధ్యవసాయ ఏవహృదయే బధ్నాతు నామాస్పదం
వక్తుం ప్రాణసమా సమక్షమ ఘృణే శక్తం కథం పార్యతే
ఉక్తంనామ, తథాపి నిర్భరగళ ద్బాష్పం ప్రియాయాముఖం
దృష్ట్వాపి ప్రవసత్యహో, ధనలవప్రాప్తిస్పృహా మాదృశాః.

ప్రియురాల్ని విడిచివెళ్లాలనే ఊహ హృదయంలో కలిగిందే అనుకో. కాని, ఈ సంగతి నిర్దయగా ప్రాణతుల్యమైన ఆమెకెల్లా చెప్పను? ఒకవేళ చెప్పితినా—విధీ విరామం లేకుండా కన్నీరు కారుస్తూన్న ఆ ప్రియురాలి ముఖం చూస్తూ కూడా ధనంమీద ఉన్న ఆశచేత మాలాంటి వాళ్లు వారి వారి కాంతల్ని విడిచి, విదేశాలికిపోతూ ఉన్నారు. ఆహా.

వీటిలో విరహాన్నీ, నాయికా నాయకులకు గల పరస్పరానురాగాన్నీ, ప్రవాసానికిపోయే నాయకుణ్ణీ ఎల్లా చిత్రించారో చూడండి. ఇందొక్కొక గాధ మహాకావ్యభావాన్ని ద్యోతకం చేస్తూంది. వీటిలోని భావాలు ఆలోచించిన కొద్దీ, ఊహాకుమించిన మధుర స్మృతుల్ని జ్ఞప్తికి తెస్తున్నాయి. దీన్నీ పూర్తిగా భావకవిత్వమని చెప్పాలి. ఆయా భావాలకు తగిన శబ్దాలు కూడా అతి సునిశితంగాను, మృదుమధురపేశలంగాను ఉన్నాయి. అన్వయక్లిష్టత ఎక్కడా లేదు. కవికి భావోద్రేకం కలిగి, మథనపుట్టిన తర్వాత, ఆ భావం శబ్దంతో కలిసి, రూపాన్ని ధరిస్తుంది. అదే కవిత్వం. ఆ కవిత్వం సుషుప్తిలో ఉన్న లోకాన్ని మేలుకొలుపుతుంది.

భావం హెచ్చైనప్పుడు శబ్దాడంబరానికి తావుండదు. శబ్దాడంబరంలేని భావకవిత్వం సూటిగా హృదయానికి హత్తుకుపోతుంది.

ఆంధ్రకవయిత్రులు కావ్యకథా వస్తువుకు, వర్ణనకు ప్రాముఖ్యాన్నిచ్చి, తమ రచనలు సాగించారు. దానిలోనైనా రసభావాను కూలత పాటించినట్లు తోచదు. వృత్తము, దానిని నడిపించే శక్తీ మహోన్నత దశకు రాకపోతే రచన రసహీనమవుతుంది. పైగా వారి కావ్యాల్లో భావనాబలం చాలా తక్కువగా కనిపిస్తూంది. అందలి వర్ణనలుగాని,వస్తువుగాని అంత స్పష్టంగా గోచరించడం లేదు. ఏవో పద్యాలూ, ఏవో గద్యాలూ ఊరికే చదువుతున్నామను కుంటాము. కాని, అవి కూడా కావ్యాలే అని చెప్పాలి. అప్పటి వాతావరణాన్ని బట్టి పురాతన వృత్తాల్నే వారు చర్విత చర్వణం చేశారు.

పద్యంలో ఒకాయన—

విప్ర తలముండ తల్లి వివేకికాదు
ఎన్ని చెప్పిన నాభార్య వీథ్యరాని
అన్నిటికి తోడు నాకాలు అవిటికాలు
రామకవిగాని బ్రతుకు శ్రీ రామరామ.

అన్నాడు. ఛందోబద్ధమైనంత మాత్రాన దీన్ని కవిత్వమనిగాని, హృదయరంజకమైనదని గాని అంటామా? అనము. తత్త్వ, శాస్త్రకవిత్వాలు కూడా ఈ పంథాలోనే వుంటాయి. కాంతా సమ్మితమైనదే కవిత్వము గాని, తదితరములు కావు.

నేటి కవయిత్రులు గద్యపద్యగేయ రచనలెన్నెన్నో చేస్తూన్నారు. ఇవన్నీ చాలామట్టుకు భావబంధురంగానే ఉన్నాయి.

అసలు భావముంటేనే కాని, కవిత్వము కాదు. రసాత్మకమైనదే కవిత్వము, అదే భావ కవిత్వము. భావశూన్యమైన పద్యంగాని, గద్యం గాని వట్టి చొప్పదంటు.

స్త్రీ లీ భావకవిత్వాన్ని ఏ మాత్రం సాధించారో అన్న విషయాన్ని చర్చించడంమానివేసి, నా రచనలు కొన్ని ఉదాహరిస్తాను—

నగలు ధరియింపగా నేడు నాదు మనసు
మోజుపడ్డది తీర్తురా మోజు నాథ?
సారసాహ్లాదకరు డదే చందమామ
కాంచు సుందరీ, వానికి గలవె నగలు?

వీడ్కోలు అనే ఖండకావ్యంలో—

ముగ్ధభావైక వేద్యమై ముద మెలర్ప
అరుగు దెంచెను మెల్లగా అట్ల లేదియ

రాగానే,

నాడనంత నియతి పసుపాడి, నిదుర
నిరుపమనితాంత సుస్వప్న నిధుల్ని

కన్నది.

మలయపవమానగానమ్ము, పులుగు గము
ల కలకలమ్ములు, కొదమ కోకిల రుతము,

పశ్చిమాశను జాబిల్లి పలవరింత-హృదయ ముకుళాన్ని విదలించాయి. నిదుర లేచింది. చెలులతో కూడా బయలు దేరి కనులు రెండును వీపునగట్టివైచి—ఉయ్యాలలూగడానికి ఉద్యానవాటికి వెళ్ళింది. చెలులందరూ లోపలి తోటలో పువ్వులు కోయడానికి వెళ్ళిపోయారు. అప్పుడామె ప్రియుని కోసం—అలరు తోటల్ల కనులుగా నిలిచి—పోయింది.

అంతలో—

పాలిపోయెడి వెన్నెల బయలు నందు
తీగలా నీడ వెనుముందు సాగ, సాగి
కనులు గప్పెను వెచ్చని కరయుగమ్ము.

పరిచిత హస్తమగుట వల్ల తన ప్రియుడని గుర్తించింది. అతడెదురుగా వచ్చి—

శీత మనమ్ము లందడగి
లేచిన కోరిక లెల్లదీర నీ
రాతిరి లోకమే మరచి,
రాగగళమ్ముల ప్రేమగీతికా
వ్రాతము పాడుకొందము ప్ర
భాతపు మందసమీరణ శ్రుతిన్
ఊతగ సేకరించుకొని
ఊయెల నూగుచు రమ్ము వెచ్చెలీ.

అనె—

నేటి ఈ సంవత్సరాది పేరంటము విక్రమార్కుని, శ్రీకృష్ణదేవరాయల్ని, రఘునాథ భూపాలునీ స్ఫురింపచేస్తూంది.


ప్రతీకాంతా ఓక్కొక్క భావకావ్యం. కాంతా కవిత్వాభ్యుదయాన్ని ప్రోత్సహించే ఇటువంటి పేరంటములు ప్రశంసార్హములు.

(ఆలిండియా రేడియో, మద్రాసు కేంద్రమువారి అనుమతిని)

★

★

Famous
FOR OVER A
QUARTER CENTURY



Kerala Soaps
OF DISTINCTION



MILLED TOILETS

Willingdon
Sandalwood
Vep
Coal Tar
Lavendar
Rose

SHAVING SOAP

In Bakelite containers Wooden Bowls and refills

SHAMPOO SOAP

In Sandal perfume

LEAF SOAP

For washing delicate fabrics

DENTIFRICE

In Bakelite containers and refills

WASHWELL SOAPS

In bars and Twin Tablets

DEEPABRAND SOAP

For cleaning household utensils

INDUSTRIAL AND INSECTICIDAL SOAPS, PERFUMERY ESSENTIAL OILS, ETC.

For prices and names of Agents, please Apply to :—



THE BUSINESS MANAGER
KERALA SOAP INSTITUTE, CALICUT

FAS-189

రుచులు
అప్పుడూ-ఇప్పుడూ



తిండిలో, కవిత్వంలో, అలంకారంలో....

రచన :
శ్రీమతి కె. సుగుణమణిగారు

రుచులంటే నా కింత అభిమానం యెందుకో అందరికీ చెప్పనా ?...చెపుతాను, చెప్పాలి...ఒకప్పుడు చిన్నప్పుడే. "ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు, జూడ జూడ రుచుల జాడ వేరు" అన్న పద్యంమీద వచ్చింది—యీ ప్రశ్న. చిన్నప్పుడు మా స్కూల్లో ఇన్స్పెక్టరుగారు అడిగేరు ఒక అమ్మాయిని—'ఆవకాయ రుచి యేమిటని ? పాపం, ఆ అమ్మాయి నోరంతా నీరూరిపోతూ మా అందరి నోళ్లూ ఊరించేసింది!—మరండీ (చప్పరింపు)—ఆవకాయండీ కొంచం ఉప్పగాను (గట్టిచప్పరింపు)—కొంచం కారంగాను (ఇంకా గట్టిచప్పరింపు)—కొంచం పుల్లగాను మరండీ (మళ్లీ గట్టిచప్పరింపు)—యెంచక్కానండి ఇలాగ చప్పరింపులతో సరిపోయింది! ఇన్స్పెక్టరు, మేష్టారు, మేమూ అంతా నవ్వులు—చప్పరింపులూను, లాలా జలాలతో అందరి నోళ్లూ ఊరిపోయేటట్లు చేసింది!! ఆఖరుకు ఆ అమ్మాయే కొట్టేసింది ఫస్టు ప్రయిజు...అప్పట్నుంచి పట్టుకుంది నా కీ రుచుల పిచ్చి!

ఐనా ఆ సంగతే మరచి పోయేను. "మరచి పోతే మళ్లీ యెందుకొచ్చిందం"టారేమో! అదీ చెపుతాను.

అప్పుడు—'మళ్లీ యెప్పుడు!' అంటే—స్కూలు ఫైనల్ చదువుతున్నా. మాకు పెట్టిన సెలెక్షన్సులో కొన్ని శృంగార పద్యాలున్నాయి. మా తెలుగు పండితుడుగారు వాటి పదవిభాగ, అర్థ, తాత్పర్యాలు చెప్పి చెప్పి, చెప్పించి చెప్పి, గంటంతావాగినా మా బ్రహ్మచారి పిల్లలకు దాంట్లో 'రసం' గ్రాహ్యమైందిగాదు. చెప్పి చెప్పి విసిగి వేసారి పోయేడు. అందుకేనట్రా—అన్నాడు—ఒకకవి—వట్టినే అన్నాడా? అరసికత్వ కవిత్వ నివేదనం శిరసమాలిక మాలిక మాలికా!" అని నెత్తీ నోరూ కొట్టుకు యేడ్చేడు లేకపోతే మీలాంటి పిల్లలకి యీ పద్యాలు 'వాళ్లు' పెట్టడం యేమిటి—'నేను' మీ ముందు నోరు చించుకోవడం యేమిటి! అని వాపోయేడు (ఆయన అచ్చంగా అలాగే మాట్లాడే వాడు) "అంటే ఏమిటండి మేష్టారు" అన్నాడు ఒక విద్యార్థి. మేష్టారు కొంత శాంతించేరు—"అంటే— రసం గ్రహించలేని మీలాంటి శుంఠలకు, కవిత్వంలోని రుచులు చూపించమని, శిరసమాలికన్ = నొసటి మీద, మాలిక = వ్రాయవద్దు, మాలికా = ఓ బ్రహ్మదేవుడా!' అని బ్రహ్మదేవుణ్ణి బ్రతిమాలేడు. 'ఏ పనైనా చెప్పుగాని యీ పని మాత్రం నాకు విధించకురా బాబూ' అని మొర పెట్టుకున్నాడు—కవి" (అంతట్లో స్కూలుగంట అయింది ఆ వేళకు బ్రతికేం!).........

ఇలాగ కవిత్వంలో "రుచులు" వేరు. శృంగార, హాస్య, బీభత్స, భయానక, రౌద్ర, కరుణాది నవరసాలుట్టిపడేటట్లు కవులు అనేక రుచులు గల కవిత్వ పాకాలు

7

తయారు చేస్తారు. ఒకరిది చేమకూర పాకం, ఇంకొకరిది ద్రాక్షా పాకం, మరొకరిది నారికేళ పాకం, వేరొకరి కవిత్వం—కొరకబడని 'అయః పిండ' తుల్యం! అసలు "రుచి" అంటే "ఉప్పు" "ఉప్పులేని కూర—పప్పులేని తిండి" అంటూ ఏదో పద్యంవుంది? రుచుల నేసరికి తినటానికి పనికొచ్చే పదార్థాల రుచులే మనకు జ్ఞాపకమొస్తాయి. కాని రుచులు అనేక విధాలు. ప్రతీ దాంట్లోను ప్రజల రుచులు (Tastes) దేశకాల పరిస్థితుల్ని బట్టి, మానవుల ప్రకృతిని బట్టి వేరు వేరుగా ఉంటాయి.

జీవిత రుచులు :—అప్పటి పెద్దల రుచులు వేరు. ఇప్పటి ప్రజల రుచులు వేరు. జ్ఞానార్జనయే జీవిత పరమావధిగా యెంచినవారి ఆ ఆధ్యాత్మిక రుచులు వేరు. భోగలాలసతే భాగ్యమని యెంచు యిప్పటివారి భౌతిక రుచులు వేరు. కట్టు, బొట్టు, జుట్టు, అలంకారం ఇలాగ అన్నిట్లోను అప్పటికీ, యిప్పటికీ రుచుల్లో భేదాలున్నాయి. వారికి నిరాడంబర జీవితం రుచిస్తే, వీరికి ఆడంబర బ్రతుకులు రుచి.

తిండి రుచులు :—పూర్వుల తిళ్ల రుచులు వేరు. ఇప్పటి రుచులు వేరు. అంటే తీపి, కారం, పులుపు, చేదు వగైరా రుచులే వేరనిగాదు—అవి యెప్పుడూ ఒకటే—కాని యివి వారికి ఏవేవి—ఎంతవరకు రుచించేవి అన్న వాటిల్లో తేడావుంది. మల్లీ తిళ్లల్లో భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య వగైరా పదార్థాలన్నీ అప్పుడూ యిప్పుడూ ఒకటై వుండొచ్చుగాని వీటిని అనుభవించడంలో తేడాలున్నాయి. 'జిహ్వాచాపల్యం' అంటే 'తిండి పిచ్చి' తగ్గాలని పెద్దలంటే, యిప్పటి వారు జిహ్వకు రుచించే తిండ్లకు ప్రాకులాడతారు. తెనుగు వారికి 'పులుసు' రుచి, అరవతంబికి 'సాంబారు' రుచి, మళయాళ సోదరికి 'కొబ్బరి నూనె—సెంద్రన్ వేపడం'.రుచి, బెంగాల్ బహిన్‌కి 'ఆవనూనెలో వేచిన చేపలు' రుచి, పాశ్చాత్యులకు యింకోటి—ఇంకోటీ రుచి, ఆంధ్రుల 'ఆవకాయ', తమిళుల 'చేంగాయ్ చెట్నీ', బర్మీస్ 'కప్పల ఊరగాయ'ల రుచులు వేరు.

పానీయాల రుచులు :—అలాగే పానీయాల్లో ప్రజల రుచులు వేరు. గ్రామస్థులకు 'గంజే' పానకం, 'నీరే' అమృతతుల్యం ఐతే, పట్న వాసులకు కాఫీ, టీ లెమనేడ్ వగైరాలు లేందే దినం వెళ్లదు. 'దిన'మేగాదు, 'తద్దినం' నాడైనా యివి పొట్టకు పడ్డాకే తర్వాత కార్యక్రమం! ఇల్లూ వొళ్లూ గుల్లవుతున్నా యివి తాగితేనేగాని నాగరీకులకు విరేచనమే గాదు! పాటక జనానికి కల్లు రుచి, పట్నం పెద్దలకు విదేశ పానీయాలు రుచి. త్రాగుడంటే జ్ఞాపకం వచ్చింది. 'మట్టు—సిగరెట్లు' వగైరాల త్రాగుడు ఆదోరకం. ఇందులోనూ అనేక రుచులు. 'ముక్కు—పొడుము' కూడా ఒక రుచే కొందరకు!

వస్త్రధారణ రుచులు :—ఈ రుచులు ఇంకోరకం. కొందరు పట్టుపీతాంబరాలకు ప్రాకులాడితే, కొందరు పొందూరు ఖద్దరుకు తంటాలు పడతారు. కొందరకు చీర, మరికొందరకు ఫ్రాక్కు రుచి. పొట్టిచేతుల జాకెట్లు కొందరికి, పొడుగుచేతుల రవికెలు కొందరికి రుచిస్తే, మరి కొందరికి మరికొన్ని పిచ్చి అనుకరణలు రుచి.

శరీరాలంకార రుచులు :—దీంట్లో ఉన్నన్ని భిన్న రుచులు మరెందులోనూ లేవు. ముఖ్యంగా స్త్రీలలో యీ రుచులు study చేయవలసిందే. 'The proper study of womankind is woman' అంది ఒకావిడ. సకల నాణ్యాల రుచుల్ని గురించి పెద్ద గ్రంథం వ్రాయొచ్చు.

గృహాలంకరణ రుచులు :—గ్రామస్థులకు అలుక్కు—ముగ్గెట్టుకుంటేనే పండుగ, పట్నవాసులకు కడుక్కు—ని తుడుచుకుంటేనే సింకు. కొందరికి తాటాకు కొంపే మహా రాజభవనం, మరి కొందరికి మిద్దెలు, ఇంకా కొందరికి మేడలూ రుచి.

భాషల్లో రుచి :—"దేశ భాషలందు తెలుగు లెస్స" అన్నాడు తెలుగునుడీ కారం సొంపు గ్రహించిన కళాభిలాషి—కళాపోషకుడు ఐన—కృష్ణదేవరాయలు. తెలుగంటే 'Italian of the East' అంటారు కొందరు. ఒక్కొక్కరికి ఒక్కొక్క భాష రుచిస్తుంది. కొందరికి వాడుక భాష బాగుంటుంది. కొందరకు అచ్చతెనుగు నచ్చుతుంది. సంస్కృతం అప్పటి వారికి రుచిస్తే, ఇంగ్లీషు యిప్పటి వారికి రుచి. "కొందరకు తెనుగు గుణమగు।

కొందరకు సంస్కృతంబు గుణమగు। కొందరకు గుణములగు। నే నందర మెప్పింతు కృతుల నర్యైయెడలన్” అన్నాడు సవ్యసాచి పోతన మహాశయుడు.

అలాగే గ్రంథాల్లోను. కొందరికి నవలలు రుచిస్తే కొందరికి శాస్త్రగ్రంథాలు, కొందరికి వేదాంత గ్రంథాలూ రుచి. కొందరికి సంగీతం, కొందరకు సాహిత్యం—ఇలాగ లలిత కళల్లో రుచులు వేరు.

రుచుల్ని గురించి వ్రాయడం మొదలెడితే అదొక అంతు లేని వ్యాసమైపోతుంది. ప్రతీ విషయంలోనూ అప్పటికీ—ఇప్పటికీ, మనకీ—యింకొకరికీ, బీదలకు—భాగ్యవంతులకు, విద్యాధికులకు—విద్య లేనివారికి, రుచుల్లో భేధాలున్నాయి. ఒక వ్యక్తే ఐనా “బాలస్తావత్ క్రీడాసక్త, తరుణస్తావత్ తరుణీసక్త, వృద్ధస్తావత్ చింతాసక్త...” అన్నట్లు వయస్సును బట్టి రుచులు మారుతుంటాయి. రోజూ మారే రుచులకు కారణం చెప్పలేక 'Variety is the spice of life' అంటాడు ఒక కవి. “లోకోభిన్నరుచిః” అని మన సామెత. “పుర్రెకొక బుద్ధి—జిహ్వకొక రుచి” అంటుంది మా అమ్మమ్మ! రుచుల్లో వట్టి భేధాలేగాక గట్టి అన్యోన్య విరుద్ధాలుకూడా గోచరిస్తాయి. ఇది ప్రకృతి సహజమేమో! పురుగులు కప్పకు రుచిస్తే, కప్ప పాముకు రుచి, పాము ముంగిసకు రుచి. లేడికి పచ్చిక రుచిస్తే, సింహానికి లేడి రుధిరం రుచి. ఇలాగ భేధాలు, విరుద్ధాలు ఉంటూనే సృష్టి నడుస్తూ ఉంటుంది. అందులోనే వుంది సృష్టి కర్త చాతుర్యం—

★




వైశ్య సేవాసదనము

ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమహేంద్రవరము :—శ్రీ వైశ్య సేవాసదనము 1920 లో దానకర్ణ శ్రీ వాశం రామలింగయ్యగారిచేత స్త్రీ విద్యాభివృద్ధికై స్థాపించబడినది. పదిహేను సంవత్సరములనుండి సదనముచే నడుపబడుచున్న ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల ఆంధ్ర విశ్వ విద్యాలయమువారి, మద్రాసు గవర్నమెంటు వారి ఆమోదమును పొందివున్నది. ఈ కళాశాలలో ఎలిమెంటరీ, అడ్వాన్సు, ప్రిలిమినరీ, ఫైనల్ తరగతులలో మొత్తము 206 గురు విద్యార్థినులు వున్నారు. సంస్కృత పరీక్షలలోనే కాక బెనారస్ మెట్రిక్యులేషనువంటి యితర పరీక్షలకుకూడ యిక్కడ తరగతులు నడుపబడుతున్నవి. చిత్రలేఖనము, నాట్యము మొదలగు లలితకళల నభ్యసించు అవకాశములు వున్నవి. హిందీ నేర్చుకోవటమేకాక విద్యార్థినులు వక్తృత్వ పోటీలలో పాల్గొంటు వుంటారు.

విద్యార్థినులేకాక యీ సదనమున పురస్త్రీలుకూడ నగిషీ, ఊలులేసుకుట్లు దుస్తులను కుట్టుట నేర్చుకుంటు వుంటారు. సదనమునకొక పెద్ద గ్రంథాలయము పఠనమందిరము వున్నవి. వారమున కొకసారి వక్తృత్వ కళోపాసన చేస్తు వుంటారు. సదనమున 51 రు నివసిస్తున్నారు. పొరుగూరు విద్యార్థినులకు వుచితముగ బస, పేదలకు వుచితముగ భోజనము యివ్వబడుతున్నవి. కార్యాధికారిణి, ప్రిన్సిపాల్ శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారి ఆధ్వర్యమున సంస్థ దినదినాభివృద్ధిగాంచుచున్నది. ఇటువంటి స్త్రీల అభ్యుదయానికి జాతి మత భేదములేక పాటుబడే సంస్థ తన 26 వ వార్షికోత్సవము జరుపుకున్నదంటే సంస్థ నిర్వాహకులే కాక ఆంధ్ర మహిళలందరు సంతోషించవలసిన విషయము.

★

దాంపత్యంలో —



—వ్యత్యాసాలు

(కొడవటిగంటి కుటుంబరావుగారి రచన ననుసరించి)

అమ్మ

మూలం :
నికోలాయీ టికోనోవ్

★

అనువాదము :
శ్రీమతి టి. సావిత్రి

"పద వాణ్ణి చూసివద్దాం." అని తల్లి అన్నది. ఎవరి పేరూ ఎత్తి అన లేదు గాని ఆమె కూతురు ఓల్గా ఎవరిని గురించి అన్నదీ వెంటనే తెలుసుకుంది.

ఆమె ఉద్దేశ్యం ఓల్గా అన్న బోరిస్‌తో అని. బోరిస్ వలంటీరు అయినాడు. తానుగూడ తన కాలేజీ పిల్లలందరితో బాటు సైన్యంలో భర్తీ కాబోతున్నానని తెలిపాడు.

చిన్నబోయి దిగాలబడియున్న తల్లి అతని కెదురుగా నిలబడి "కాని నీ కళ్లు చాల బలహీనమైనవి నాయనా! నీ ఆరోగ్యం బాగాలేదు. నీకు భయం కలగడంలా?" అని అడిగింది.

"దిగులు పడవద్దమ్మా" అంటూ తన సామాను సిద్ధం చేసుకున్నాడు.

తల్లి, ఓల్గా అతను మిలిటరీ తర్ఫీదు పొందుతున్న గ్రామానికి అతన్ని కలుసుకొనే నిమిత్తం అనేక సార్లు వెళ్తుండేవాడు. అతడు ఎంతో ఎండ కారణంగా నల్లబడిపోయినా దుమ్ము క్రమ్ముకొని వున్నా, ఆనందంగా ఎదురు వచ్చేవాడు. వాళ్లు అతని దగ్గర కూర్చుని పట్టణపు సంగతులు, తోటి స్నేహితుల్ని గురించి కబుర్లు చెప్పుకొనేవారు. యుద్ధాన్ని గూర్చి మాత్రం ఏమీ ప్రసంగించేవారు కారు. వారికి నాలుగు వైపులా యుద్ధమయమే గదా!

అప్పటి కింకా ఓల్గా చిన్నది. ఆ అమ్మాయికి యీ చిన్న చిన్న ప్రయాణాలు చాల బాగుండేవి. తిరిగి వచ్చేటపుడు రెండు చేతులనిండా, ఒళ్లోను అడవి పుష్పాలు నింపుకొని స్టేషనులో విద్యుచ్ఛక్తితో నడిచే రైలు దగ్గరకు వచ్చేది. సాయంత్రం అవుతుండగా యింటికి చేరుకునే సరికి పట్టణం అంతా యుద్ధ ప్రయత్నాలలో లగ్నమై వుండేది. నాలుగు వైపులా ప్రజలు పనులు చేసుకుంటూ కనబడేవారు.

ఈ పరిస్థితి అంతా వెంటనే మారి పోయింది. యుద్ధ రంగం చాల దగ్గరికి వచ్చింది. ఈ సమయంలో యివ్వాళ బోరిస్‌ను ఎట్లా కలుసుకుంటావా అని చాల దుఃఖిస్తోంది. అంతా మారిపోయింది.

వారిద్దరు (తల్లి, ఓల్గా) పొలాలు మైదానాల మీదుగా పోతున్నారు. నాలుగు దిక్కులా హేమంత ఋతువు యొక్క నగ్న స్వరూపం నిరసత్వమే. బరువుతో నిండియున్న బండ్లు, మోటారు లారీల పంక్తి వస్తోంది. రోడ్లన్నీ ఖాళీ చేస్తున్న ప్రజలతోను, వారి బిడ్డలతోను కిటకిటలాడుతున్నాయి. వీపుల మీద మూటలు, తమ సామాను మోసుకొని యుద్ధరంగానికి దూరంగా పోతున్నారు జనం. ఒక ప్రక్క చచ్చి పోయిన ఒక గుర్రం పడివుంది. ఎర్ర సైన్యం పెద్ద పెద్ద ధ్వనులు చేస్తూ, 'మార్చ్' చేసుకుంటూ వెళ్తోంది. చాల దగ్గరలోనే ఎక్కడో ఎడతెగని గుండ్ల బారుధ్వని వినవస్తోంది. నాల్గువైపులా ఒక విధమైన జీవం లేని అపరిచిత వాతావరణం ఉంది. పడిపోయిన తోటలు అత్యంత భయం, ఒక విధమైన విసుగదల కలిగిస్తున్నది.

ఇంత భయంకర పరిస్థితుల్లో ఓల్గా సాహస పూర్వకంగా తన తల్లి వెంట నడుస్తోంది. తల్లి నెమ్మదిగా అయినా, ఎంతో ధృఢంగా ముందుకు నడచి పోతోంది.

గ్రామంలో మంటలు తీవ్రంగా లేస్తున్నాయి. దిబ్బ మీదకు వెళ్లి వారు హటాత్తుగా ఆగిపోయారు. ఇండ్ల కప్పుల పైన ఎర్రని మంటలు నాట్యమాడుతున్నాయి. వాటిని ఆర్పేవాడు ఒక్కడుగూడ లేడు. చాల యిళ్లు తగులబడి బూడిద అయిపోయినవి. అది చాల భయంకరమైన విచిత్ర దృశ్యం. ఓల్గా భయపడుతూ తల్లి భుజం పట్టుకొని లాగింది. కాని తల్లి శాంతంగా "ఆ పొదవరకు మాత్రం మనం తప్పక వెళ్లాలి." అని చెప్పింది. ఇక యిద్దరూ గ్రామంలో తగుల

బడుతున్న యిండ్ల మధ్యగానున్న దారిని పోవడం ఆరంభించారు.

గ్రామంలోకి వెళ్లి ఒక చిన్న కాలవ దాటిన తరువాత మార్గం బంద్ అయింది. చచ్చిపోయిన ఆవు దారికి అడ్డంగా పడియుంది. ఇంకాపైన పలుగు పారీలతో నిండివున్న ఒక బండీ నిలబడియుంది. పలుగు పారలు బయటికి జారుతున్నాయి. బండి వెనుక చక్రం దగ్గర ఒక శవం చేతులు చాచుకొని తల్లక్రిందుగా పడియుంది. అంతా బీభత్సం.

ముందుకు నడిచారోలేదో ఈలలాంటి ఒక ధ్వని వినబడింది. అదిక్రమేణా తీక్ష్ణమౌతూ వస్తున్నది. దాని మూలంగా చెవులకు బాధాకరంగా ఉంది. తల్లి ఆగి తన తలను వంచుకున్నది. ఓల్గా కూడా యిదే పని చేసింది. తప్పు పని అని గూడ ఆమెకు తెలుసు. వినగానే భూమి మీద పడుకోవాలి. ముఖాన్ని దాచుకోవాలి. కాని ఏం చేస్తారు? బోరిస్‌ను వెతకాలిగా! ఒకవేళ అటువైపునుండి వచ్చే గుండ్లకు మాటిమాటికి యీ విధంగా పండుకోటానికి ప్రయత్నించినట్లయితే వారు ఎప్పటికీ బోరిస్‌ను చేరగలిగే వారు గాదు.

ఒక దిబ్బ వెనుక గుండు పడింది. మట్టి అంతాపైకి లేచింది. వాతావరణము యింకా శాంతపడనే లేదు. ఇంతలో యింకొక గుండు బండి, మనిషి వున్న చోటపడింది. మళ్లీ మట్టి పైకి లేచింది. కాని అప్పటికి వారు చాల దూరం ముందుకుపోయారు. మరల ఆ చిన్న అడవుల్లో కిందపడుతూ, లేస్తూ పరుగెత్తడం ఆరంభించారు. ఓల్గా వణికి పోతున్నది. పెదిమలు ఎండిపోయినై. అయినా తల్లి ముందుకుపోతూనే ఉంది. ఓల్గా తల్లి వెంట నడుస్తూనేవుంది. "ఈ గుండ్లు మనకు తగలవు. తగలనే తగలవు" అని తన మనస్సుకు తానే సమాధానము చెప్పుకుంటున్నది.

ఓల్గా అన్నది, "అమ్మా, ఇంకా ఎక్కడికి వెళ్తావు?"

అమ్మ మెదలకుండా నిల్చుంది. ఓల్గా యొక్క అలసిపోయి మందమతిగాయున్న చిన్న హృదయంలో వేసారియున్న తన తల్లి యెడల జాలి ఉద్భవించింది.

ఓల్గా మళ్లా అన్నది, "అమ్మా, పద యింటికి తిరిగి పోదాం. ముందుకు పోవడంలో ఏమైనా లాభం ఉందేమో నీవే స్వయంగా చూడమ్మా."

అమ్మ జావాబిచ్చింది, "యింకా కొంచెం దూరంనడువమ్మా, అక్కడికి వెళ్లి జాడ తీద్దాం."

వారు మరల విధ్వంసమైన పొలాలు, మైదానాలలో ఉదాసీనత నొందిన గ్రామాలు చూస్తూ ముందుకు పోసాగారు. దిబ్బలు, మిట్టలు, మహావృక్షములు, పొదలమాటున ఎర్ర సైనికులు పడుకొని యుండి ఎడమవైపునకు చూస్తున్నారు. రెమొకారొకీని వారిలోనుండి ముగ్గురు తమ గుప్త స్థానములనుండి బయటికి వచ్చారు.

అమ్మ ఆనందంతో వారి వైపుకు పరుగెత్తుకొని వెళ్లి వారిలో ఒకరితో "నేను పొరపాటు పడకుంటే నీ పేరు 'పాల్' కాదూ" అని ప్రశ్నించింది.

ఎర్రసైన్యంలోని పొడుగైన ఒక్క పలాచటి ఆ సైనికుడు అమ్మ వంక ఆశ్చర్యంతోను, తదేకదృష్టితోను చూచి అన్నాడు.

"మీరు బోరిస్ తల్లి గాదూ?"

"అవును, నేను అతన్ని చూడ దలచుకొన్నాను. ఎక్కడ దొరుకుతాడు?"

"అతన్ని కలుసుకోవడమా?" పాల్ ఆశ్చర్యచకితుడైనాడు. మరల, "సరే, ముందుకి, ఆ కొండ వైపుకి వెళ్లండి. కాని మీరు వెళ్లకుండా ఉండడం మంచిది. అతన్ని వెతకడం చాలకష్టం. ఇంక ఆ పైన..." అని నవ్వి "చూడండి నాల్గువైపులా యుద్ధం జరుగుతుంది గదూ, మేము దాదాపు చుట్టు ముట్టబడియున్నాము. మీరు యిక్కడ ఎట్లా తిరుగుతున్నారు...?" మరల ప్రశ్నించాడు.

"నేను బోరిస్‌ను కలుసుకో దలచుకున్నాను. కలుసుకోవడం ఆవశ్యకరం..." అన్నది అమ్మ.

ఈ మాటలు అమ్మ ఎంత చనువుగాను, గంభీరస్వరంతో చెప్పగలిగిందంటే కాలేజీలో బోరిస్ తోటి వాడుగా వున్న పాల్ కేవలం "సరే, అయితే ముందుకు వెళ్లండి" అని మాత్రమే అనగలిగాడు.

అమ్మ "నీవు బోరిస్‌ను ఎరుగుదువా?" అని అడిగింది.

"అవును, అవును, ఎందుకు ఎరుగనూ?"

"వాడు ఎలా కాల్పులు జరుపుతున్నాడు?"

"వాడి గురి తప్పదు."

"వాడు పిరికి వాడా?"

"అసలు, వాడుగనుక పిరికి పంద అయినట్లయితే ఎప్పటికీ మా కంపెనీలో చేర్చుకునే వాళ్లం కాదు."

ఎర్రసైనికుడు బిగ్గరగా "మీరు వాళ్లకొరకు ఆగరా?" అని అడిగాడు.

అమ్మ నడుస్తూనే "ఆగం, ఆగం నీ దయకు మా ధన్యవాదాలు" అని జవాబిచ్చి ఓల్గాను, "పదమ్మ తల్లీ, పద మన పని అయింది" అన్నది అమ్మ.

వారు రోడ్డు మీదకు చేరుకున్నారు.

"ఓల్గా! మా తల్లిగాదే నీవు అలసిపోయినావు గదూ?"

"లేదమ్మా, కాని యిక్కడనుంచి బ్రతికి బయపడతే మని భయంకలుగుతోంది. నేను అంత పిరికి పందనై పోయ్యాను."

అమ్మ యొక్క ఎండి పోయి రక్తవిహీనమైన పెదవులు ముడుచుకొని పొయ్యాయి. చిరునవ్వుతో అన్నది, "ఓల్గా తల్లీ! మనకు ఏమీ ప్రమాదం సంభవించదు."

ఇంకా ఒక క్షణం తరువాత మళ్లీ అన్నది "ఇపుడు నా హృదయము చాల శాంతమైనది. వాడు యుద్ధం చేయడానికి అర్హుడుకాడని తలచేదాన్ని. వాడి దృష్టి హ్రస్వము బలహీనము. అందుకనే నేను స్వయంగా చూడదలచుకొన్నాను, ఇపుడు చూశాను. నా కొడుకు గూడ వారందరితో బాటు ధైర్య సాహసాలతో యుద్ధం చేస్తున్నాడని యిపుడు తెలుసుకున్నాను. ఇంత మాత్రమే నేను తెలుసుకొన గోరాను. ఇక పద, యింటికి పోదాం"

అమ్మ తన చిన్న చిన్న అడుగులు చాల కడిగా వేయసాగింది.......

★

సారనాథ్

శ్రీమతి కె. సుశీలాదేవి

ప్రాచీన చరిత్రలో బుద్ధ భగవానుని చరిత్ర ఒక ముఖ్య రంగము. ఆతని జీవిత చరిత్ర చిరస్మరణీయముగా వుండటానికి ఒక్క స్వదేశమునందే కాకుండా చీనా, జపాను టిబెటు, మొదలగు విదేశములందుకూడా యీనాటికి పూర్వపు బౌద్ధయుగము కళ్లకు కట్టినట్లుండుటకు చారిత్రాత్మక ప్రదేశాలే తార్కాణము.

అందులో సారనాథ్ ఒకటి. సారనాథ్ కాశీకి 7 మైళ్ల దూరమునందున్నది. కాశీనుంచి రైలుబండ్లు బస్సులుకూడా సారనాథుకు వెడుతాయి. కాశీ, పుణ్యం సంపాదించాలని పెద్దవారు వెడితే, కాశీ విశ్వవిద్యాలయ పరీక్షలకు వెళ్లి యీ ముఖ్య ప్రదేశమైన బుద్ధ వాటిక చూడడానికి వెడుతూవుంటారు నేటి విద్యార్థి బృందము.

ఆంధ్ర మహిళాసభ విద్యార్థినుల పరీక్షలు మార్చి 28 వ తేదిన ముగిసాయి.

29వ తేదీని ఉదయమే లేచి ఒక బస్సుమీద చలో నవజవాన్ అంటూ బయలుదేరాము. దారిలో మొట్ట మొదట భారతమాతగుడికి వెళ్లి యీలాంటి పవిత్ర స్థలాలను పవిత్ర జీవితాలను కలిగియున్న తల్లికి నమస్సులు అందజేసినాము. మా బాలికలు చక్కగా భారతమాతా అని ఎలుగెత్తి ఆ తల్లిని మనసారా ప్రార్థించారు. కొంతసేపటికి సారనాథు చేరాము. మొదట పిల్లలందరు యిదేమిటి సారనాథంటే ఒక చక్కగా నిర్మించి, బుద్ధభగవానుడు చూడగానే ప్రత్యక్షమవుతాడనుకున్నారు. అది నిజంగా అతి ప్రశాంతమైన చోటు. ఆ విశాల రంగస్థలముమీద పాదము పెట్టగానే ఒక విధమైన గొప్పతనము ప్రతివారిలోను కలిగి తీరుతుంది. అలాంటి ఆకర్షణవుంది కనుకనే అనేక శిథిల ప్రదేశాలు శిథిలమైన వస్తువులు నూతనంగా వుంటూవుంటాయి.



మొదట రంగము అశోకుని స్తూపము. అశోకుని జీవిత చరిత్ర తెలిసినవారంతా అశోకుని స్తూపాన్ని ఎందుకు స్థాపిస్తాడో తెలుసుకుంటారు. రెండవ రంగము సారనాథ్ శిథిల దేవాలయములు, వాటి మండపాలు. అందులో బుద్ధ భగవానుడు సభలు చేసి ధర్మ బోధనకు వీలుగా వుండే అరుగులు కనిపిస్తాయి. వాటిని దాటి యింకొంచము ముందుగా వెడితే ఆ నాటి రాజపుత్ర స్త్రీలు ఘోషాతో వుండి అంతఃపురమునించి బైటవారికి కనిపించకుండా బుద్ధుని దర్శించటానికి వచ్చేటట్లుగా చిహ్నములు వున్నాయి.

అన్నిటి కంటే ముఖ్య రంగము బుద్ధ యుగమునాటి (Sanitary) మురికి కాలవలు వాటిలోని నీరు నిలవకుండా పోవుటకు కట్టిన మార్గాలు చూస్తే నేటి మునిసిపాలిటీవారు, పరిపాలకులు యివన్నీ క్రొత్తగా సృష్టించామని గర్వపడ నక్కర లేదు. అప్పటివారు కూడా మన కంటె తెలివైన వారని తెలుస్తుంది.

ఇంతవరకు సహజ ప్రకృతిని వర్ణించడమైనది. తరువాత బౌద్ధులు అక్కడ చేరి చక్కని ప్రదర్శనశాల, (మ్యూజియము) బుద్ధుని మందిరము ఒక పెద్ద ధర్మశాల మొదలగునవి నిర్మించారు. బుద్ధుని యుగమునాడు వాడుకలోని సామాను, ఆ నాటి శిల్ప

కళ, దైవభక్తి మొదలగునవి చూడాలంటే ఆ ప్రదర్శన శాల ఒక్కటే చాలు. అందులో ఒకటి మాత్రము మరిచి పోలేము. బుద్ధుడు ఛత్రము క్రింద నిలబడి వుండటం. ఛత్రము, బుద్ధుని విగ్రహము రాతిలో చెక్కబడి వుంటాయి. ఆ శిల్పకళ యీ నాడు తపస్సు ధారబోసినా ఎవరూ సంపాదించలేరు. కాని ఛత్రము విరిగి ఒక బోటు పెట్ట వలసివచ్చినది. విరిగి పోయిన రాతి పలకలు గూడా దాచి వుంచడమువల్ల ఆనందము పొందుతున్నామంటే అందులో మహాత్తరము వుండి తీరాలి.

మా కందరికి అందులోను విద్యార్థినులకు మరిచినా మర పురానిది మూలకుందకుటీ విహారము; దాని పేరే నచ్చింది. మాకు అది పైకి చూడడానికే చాలా బాగుంటుం దంటారు మా బాలికలు. యింక లోపలికి వెడితే చెప్ప లేము వాళ్ల సంతోషము, ఆశ్చర్యము. మంచి రంగులతో చలువ రాతి గోడమీద హాలుకు నాలుగు వైపులా బుద్ధుని జీవిత చరిత్ర పుట్టుక మొదలు నిర్వాణమువరకు చక్కగా చిత్రించాడు ఒక భక్తుడు. అతడు జపానువాడు, బౌద్ధుడు. జపాను గవర్నమెంటు అంగీకారము తీసుకొని తన చేత నైనంత విద్య చూపిస్తానని ఒప్పుకున్నాడు. ఆ చిత్రములందు ఆ జీవకళ ఏలాగు పోసినాడా అనిపిస్తుంది. అన్నిటి లోను బుద్ధ భగవాను నిర్వాణము చూచి విచారించే పరివారములోనివారి భావములు మన కందరకు కళ్లకి కట్టినట్లు వుంటాయి. ఏ సంగతైనా, ఏ వస్తు వైనా, సరే మన కళ్లార చూసినప్పుడే మనకు ఎక్కువగా అర్థమగుతుంది. అవి ఎప్పటికి మరచి పోము అని నిరూపిస్తున్నాయి ఆ చిత్రాలన్నీ. అంత అనుభవము అతనికి కలిగిందంటే ఆ బుద్ధ భగవానుని దయే అని చెప్ప నక్కర లేదు. ఏ దేళ మేగినా ఎందు కాలిడినా భక్తితో పాడరా తమ్ముడా అనుకుంటూ బస్సు ఎక్కినాము. దారిలో మా వాళ్లు దీనికి సారనాథు అని పేరెందుకు వచ్చినదా అని ప్రశ్నించారు.

దానికి ఒక చిన్న కథ వుంది. ఆ కాలమునందు ఒక రాజు ప్రతి దినము వేటకి వెడుతుండేవాడట. అతనికి వేట అంటే యిష్టమే కాని కష్టపడి జంతువులను వెదక లేడు. అందుచేత భటులు రోజుకు ఒక జీవిని బంధించి మార్గములో పడ వేస్తూ వుండేవారు. ఒక నాడు ఒక లేడిని అలాగే కాళ్లు కట్టి అక్కడ పడవేశారు. బుద్ధ భగవాను డా దృశ్యమును చూచి చాలా దుఃఖించి ఆ నోరులేని జీవమును రక్షించుటకు తానే వేటకు బలి అవటానికి సిద్ధపడ్డాడు. ఇంతలో రాజు వచ్చి ఎదురుగా బుద్ధ భగవానుని జూచి ఆశ్చర్యపడి సాష్టాంగప్రణామము చేశాడు. జీవితము అందరికీ ఒకటే, నీకు కావలసినది ఒక జీవికదా? అలాంటప్పుడు అజ్ఞాన జంతువు కంటే జ్ఞానజీవి ఎక్కువ కనుక తనను వేటాడమన్నాడు. తను చేస్తున్న పనికి పశ్చాత్తాపపడి రాజు ఆ నాటినుంచి వీరికి శిష్యుడయాడు. ఆ విధముగా ఒక లేడి, లేడి అనగా హిందీలో సార్ అంటారని దానిని ఆ ప్రదేశమునందు రక్షించుటచేత ఆ ప్రదేశమునకు సారనాథ్ అని పేరు వచ్చినదని చెపుతారు.



మూలకుంద కుటీవిహార్

చిత్రజగత్తు

శ్రీ సారథి ఫిలింసువారి ‘గృహప్రవేశం’ మే నెలలో విడుదల కాబోతున్నది. చిత్రం ‘ఓల్డ్ వైన్ ఇన్ ది న్యూ బాటిల్’ మాదిరిగాను లేదు, న్యూ వైన్ ఇన్ ది ఓల్డ్ బాటిల్ పద్ధతిలోను లేక న్యూ వైన్ ఇన్ ది న్యూ బాటిల్ తరహాలో వుందట.

భానుమతి ఎంతో బాగా పాడిందనీ, అభినయించిందనీ “అనగ నగ” అని పాడిన పాట మరిచిపోవడానికి వీల్లేనంత గొప్పగా పాడిందనీ రషెస్ చూడ్డానికి అవకాశం కలిగినవారు చెబుతున్నారు.

చిత్రానికి కథ, సంభాషణలు వ్రాసినది గోపీచంద్ గారు. పాటలు నళినీకాంతరావుగారు వ్రాశారు. సి. ఎస్. ఆర్. ప్రసాద్, భానుమతి, శ్రీరంజని (జూనియర్) మొదలైనవారు నటించారు.

* * *

ఈ నెల 22వ తేదిని ఘంటసాల బలరామయ్యగారు తమ “ముగ్గురు మరాఠీల”ను దేశంమీదకి వదులుతున్నారు. శ్రీ గోవిందరాజుల సుబ్బారావు, నారాయణరావు, నాగేశ్వరరావుగార్లు పైగా కన్నాంబ, కుమారి, బెజవాడ రాజరత్నం వున్నారు. చిత్రాన్ని బలరామయ్యగారే డైరక్టు చేశారు.

* * *

“త్యాగయ్య” చిత్రం పూర్తి అయింది. కాని వరసను నారద నారది, భక్త తులసీదాస్, ముగ్గురు మరాఠీలు, గృహప్రవేశం మొదలైనవి జోరుగా విడుదల అవుతున్న తొందరలో గాక, కొంచెం స్థిమితంగా విడుదల చెయ్యడానికే నాగయ్యగారు నిశ్చయించినట్లు కనిపిస్తుంది.

కాస్త వోపిక పట్టినందుకు, చిత్రం సంపూర్ణ వినోదం, పారవశ్యం కలిగించి తీరుతుందనడానికి సందేహం లేదు.

* * *

శారదా ప్రొడక్షన్స్‌వారు “పల్నాటి యుద్ధం” చిత్రాన్ని తయారు చేస్తున్నారు.

కన్నాంబ, గోవిందరాజుల సుబ్బారావు మొదలైన హేమా హేమీలతో పల్నాటి పౌరుషాన్ని—నాయకురాలి గర్వాన్ని, బాలచంద్రుని వీరకృత్యాలను యధాతథంగా చూపడానికి దర్శకులు రామబ్రహ్మంగారు శక్తి వంచన లేకుండా కృషిచేస్తున్నారు.

* * *

శ్రీ శోభనాచలవారి “గొల్లభామ” చాలవరకు పూర్తి అయినప్పటికీ ఇంకా ఒకటి రెండు నెలలు దాటితేనే గాని విడుదల కాదట.

* * *

ప్రభాకర్ ప్రొడక్షన్స్‌వారు “ఇది మా కథ” లేక Excuse me అనే హాస్యరస భరితమైన చిత్రం తయారు చేస్తున్నారు.

చిత్రంలో సగం భాగం సదాశివ బ్రహ్మంగారి దర్శకత్వం—మిగిలిన అర్ధభాగం డి. ఎస్. కొట్నీస్‌గారి దర్శకత్వంలో పూర్తి అవుతున్నది.

లక్ష్మీరాజ్యం ప్రభాకరరావు ప్రధాన భూమికలు ధరించారు.

* * *

పోతన, మాయామచ్ఛీంద్ర చిత్రాలలో ప్రసిద్ధినందిన శ్రీ జంధ్యాల గౌరీనాధశాస్త్రిగారు “రాధేయ” చిత్రాన్ని శ్యామలాఫిలింసు పేరుతో తయారు చెయ్యడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇదే సమయంలో “గీతాంజలి” అనే సామాజిక చిత్రాన్ని కూడా వీరు నిర్మిస్తారు.

“గీతాంజలి”కి శ్రీ ఊటుకూరు సత్యనారాయణరావుగారు, “రాధేయ”కు శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారు సంభాషణలు వ్రాస్తున్నారు. దర్శకుడు శ్రీ తంగిరాల హనుమంతరావుగారు.

* * *

శ్రీ చిత్రపు నారాయణమూర్తిగారు “బ్రహ్మరథం” అనే చిత్రాన్ని తయారు చేస్తున్నారు.

★

Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras.
Printed by M. Satyanarayana at the Hindi Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras.